ఈ పేపర్ కోసం
www.visionandhra.in
చూడండి

# విజన్ ఆంధ్ర

తెలుగు దినపత్రిక

VISION ANDHRA TELUGU DAILY

అక్రిడేషన్ లు కలవు
విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక
తెలుగుదిన పత్రికలో రిపోర్టర్లు కావలెను
తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాలు, నియోజకవర్గాలు, మండలాల వారిగా రిపోర్టర్లు కావలెను
సంప్రదించవలసిన ఫోన్ నంబర్స్ :
9440897445, 8074636674

శనివారం 20 జూన్ 2026 | Saturday 20 June 2026 | హైదరాబాద్ Hyderabad | పేజీలు: 12+12 | వెల: రూ.1.00 | PUBLISHED FROM: HYDERABAD,NALGONDA, VIJAYAWADA
సంపుటి: 28 సంచిక: 79 | Vol.No 28 Issue No .79
www.visionandhra.in

# పాఠశాలల్లోనే దేశ భవిష్యత్

## అట్టహాసంగా యంగ్ ఇండియా వెల్‌కమ్ కిట్ల పంపిణీ

- విద్యార్థులతో డ్రగ్స్ వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించిన గవర్నర్
- వివిధ ప్రాంతాల నుంచి 15వేలమంది విద్యార్థుల హాజరు
- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు






- నాణ్యమైన విద్యతో పాటు వసతి సౌకర్యాలు
- తెలంగాణలో విద్యావిధానంలో విప్లవాత్మక మార్పులు
- ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి
- విద్యార్థులకు యంగ్ ఇండియా స్కూల్ కిట్స్ అందచేత
- విద్యామంత్రిగా తానే నిరంతర పర్యవేక్షణ
- ఎల్బీ స్టేడియం కార్యక్రమంలో సిఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్,జూన్19 : దేశ బవిష్యత్ పాఠశాలల్లోనే ఉందని గ్రహించి, అందుకు అనుగుణంగా తెలంగాణ విద్యావిధానంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టామని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. కార్పోరేట్ స్కూళ్లకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చి దిద్దుతున్నామని అన్నారు. పేదలు ఆత్మన్యూన తకు లోనుకకాకుండా వారి పిల్లలకు కూడా ప్రైవేట్ తరహా విద్యను అందిస్తున్నామని అన్నారు. అందుకోసం విద్యార్థులు ఆత్మగౌరవంతో పాఠశాలకు వెళ్లేందుకు ఎడ్యుకేషన్ కిట్లను పంపిణీ చేస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. విద్యపై నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్తున్నామని చెప్పారు. అందుకోసం విద్యాశాఖను తానే స్వయంగా నిర్వహిస్తున్నానని చెప్పారు. నగరంలోని ఎల్బీ స్టేడియంలో యంగ్ ఇండియా ఎడ్యుకేషన్ కిట్ల పంపిణీని గవర్నర్ శివప్రతాప్ శుక్లాతో కలిసి సీఎం ప్రారంభించారు. గురుకుల పాఠశాల విద్యార్థులకు 22 వస్తువులతో కిట్లు అందించారు. వసతి గృహ విద్యార్థులకు 10, పాఠశాల విద్యార్థులకు మిగతా2లో..

## గవర్నర్ తో భేటీ అయిన ఉన్నత విద్యా మండలి చైర్మన్ బాలకృష్ణా రెడ్డి

- ఉన్నత విద్యలో తెలంగాణ దేశానికే ఆదర్శం కావాలి : గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా





హైదరాబాద్, జూన్ 19 (విజన్ ఆంధ్ర ) : తెలంగాణ రాష్ట్రంలో ఉన్నత విద్యను భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దేందుకు తెలంగాణ ఉన్నత విద్యా మండలి ప్రవేశ పెట్టిన నూతన కోర్సులను 202627విద్యా సంవత్సరం నుంచే అన్ని రాష్ట్ర విశ్వ విద్యాలయాల్లో అమలు చేయాలని రాష్ట్ర గవర్నర్, విశ్వ విద్యాలయాల గౌరవ ఛాన్సలర్ శ్రీ శివ ప్రతాప్ శుక్లా మిగతా2లో..

## భూవివాదాలు లేని తెలంగాణ నిర్మాణమే లక్ష్యం

- రాష్ట్రంలో దశల వారీగా భూముల రీసర్వే
- వచ్చేనెల నుంచి తొలిదశలో 2240 గ్రామాల్లో ప్రారంభం
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

హైదరాబాద్,జూన్19 : భూ సమస్యలు, భూవివాదాలు లేని తెలంగాణను నిర్మించాలనే లక్ష్యంతో గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిగారి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలో భూ సర్వే నిర్వహించాలని కీలక నిర్ణయం తీసుకుందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా భూముల రీసర్వే కార్యక్రమాన్ని వచ్చే నెల నుంచి దశల వారీగా ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు. శుక్రవారం నాడు రెవెన్యూ అధికారులతో మిగతా2లో..



## పాత అడ్మిట్ కార్డులు చెల్లవు

వాట్సాప్ ద్వారా సమాచారం తెలుసుకునే వీలు

నీట్ విద్యార్థులకు ఎన్‌టిఎ కీలక సమాచారం మిగతా2లో..



## 20 ప్రాంతాల్లో ఆధునిక ధాన్య సైలోలు

- ధాన్యం నిల్వ వ్యవస్థ ఆధునీకరణకు చర్యలు
- ప్రస్తుత కొనుగోలు వ్యవస్థ కొనసాగుతుంది.
- ఎస్‌హెచ్‌జీలు, పీఏసీఎస్‌ల పాత్ర యథాతథం
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి

మిగతా2లో..

హైదరాబాద్,జూన్19 : రాష్ట్రంలో ధాన్యం నిల్వ వ్యవస్థను మరింత శాస్త్రీయంగా, ఆధునికంగా తీర్చిదిద్దేందుకు తెలంగాణ ప్రభుత్వం చర్యలు

## మూసీ రివర్‌ఫ్రంట్‌కు కేంద్రం గ్రీన్ సిగ్నల్

- అనుమతులు ఇస్తూ రక్షణ శాఖ ఉత్తర్వులు జారీ
- రూ.533.42 కోట్ల విలువైన 83.81 ఎకరాల డిఫెన్స్ భూమి అప్పగింత
- అనుమతులపై సిఎం రేవంత్ రెడ్డి హర్షం
- కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు కృతజ్ఞతలు





హైదరాబాద్,జూన్19 : తెలంగాణ ప్రభుత్వం తలపెట్టిన మూసీ రివర్‌ఫ్రంట్ అభివృద్ధికి కీలక ముందడుగు పడింది. గాంధీ సరోవర్ ప్రాజెక్ట్ అమలుకు కేంద్రం నుంచి అధికారిక అనుమతి లభించింది. మూసీ రివర్‌ఫ్రంట్ ప్రాజెక్ట్‌కు కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. బాపూఘాట్‌ను 'గాంధీ సరోవర్'గా అభివృద్ధి చేయడానికి వర్కింగ్ పర్మిషన్‌ను మంజూరు చేసింది. మిగతా2లో..

## హైదరాబాద్‌లో జనసేన పార్టీ కార్యాలయం

- మణికొండ మల్కం చెరువు సమీపంలో కొత్త ఆఫీస్
- జెండా ఎగురేసి ప్రారంభించిన జనసేనాని పవన్ కళ్యాణ్



మిగతా2లో..

## ఎన్నికల హామీలను విస్మరించిన కాంగ్రెస్

- మాఫియా నాయకుడిగా రేవంత్ వ్యవహార శైలి
- కెసిఆర్‌ను తిట్టడమే పనిగా పాలన సాగిస్తున్నారు
- మల్కాజిగిరి కార్యకర్తల సమావేశంలో కెటిఆర్ విమర్శలు

హైదరాబాద్,జూన్19 :రేవంత్ రెడ్డి అబద్దాలు చెప్పి, మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని కేటీఆర్ ధ్వజమెత్తారు. మల్కాజ్‌గిరి నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఈ కొద్ది రోజుల్లోనే ప్రజలు పడుతున్న ఇబ్బందులను మిగతా2లో..



## సింగరేణి సమస్యలు పరిష్కరించాలి

- నాణ్యమైన యంత్రాలను సమకూర్చాలి
- బాయిబాట కార్యక్రమానికి శ్రీధర్ బాబు ఆటంకాలు
- టిఆర్ఎస్ అధ్యక్షురాలు కవిత విమర్శలు

పెద్దపల్లి,జూన్19 : 'బాయి బాట' కార్యక్రమం చేపడితే రాజకీయంగా తమను అడ్డుకోవాలని మంత్రి శ్రీధర్‌బాబు పోలీసులను ఏర్పాటు చేశారని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత ఆరోపించారు. ఎంత అడ్డుకుంటే అంత బలంగా ముందుకు సాగుతామన్నారు. బాయిబాట కార్యక్రమంలో భాగంగా పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం అడ్రియాల లాంగ్‌వాల్ ప్రాజెక్టును కవిత సందర్శించారు. కార్మికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అడ్రియాల లాంగ్‌వాల్ ప్రాజెక్టులో ఉద్యోగులకు సౌకర్యాలు, సరైన యంత్రాలు, పనిముట్లు ఏర్పాటు చేయాలని కోరారు. సింగరేణి మిగతా2లో..



## వాట్సాప్‌లో పాఠశాల విద్యా సేవలు ప్రారంభం



- 18 లక్షల మందికి పైగా విద్యార్థులు, తల్లిదండ్రులకు సమాచారం
- విద్యాశాఖ, మీసేవ నేతృత్వంలో వినూత్న కార్యక్రమం
- డిజిటల్ మస్కట్ గా పాలపిట్టతో సమాచార వ్యాప్తి

హైదరాబాద్,జూన్19 : డిజిటల్ పాలనలో తెలంగాణ ప్రజాప్రభుత్వం మరో కీలక ముందడుగు వేసింది. విద్యాశాఖ ద్వారా అన్ని పాఠశాలల సమాచారం ఎప్పటికప్పుడు తల్లిదండ్రులు, మిగతా2లో..

## కేంద్రం నిర్ణయం మేరకే కొంటే మీరెందుకు ?

- కాంగ్రెస్‌ది రైతు వ్యతిరేక విశ్వాస ఘాతక ప్రభుత్వం
- రాహుల్ జన్మదినం రోజే రైతు డిక్లరేషన్‌కు చెల్లుచీటీ
- రైతులపై విషం కక్కిన సిఎం రేవంత్ రెడ్డి
- రెండు బస్తాల యూరియాతో మిర్చి రైతులు ఏం కాను
- మీడియా సమావేశంలో ప్రభుత్వంపై హరీష్ విమర్శలు



సిద్ధిపేట,జూన్19 : కేంద్రం కనీస మద్దతు ధర నిర్ణయించిన పంటలను మాత్రమే కొంటామంటే ఇక మీరెందుకని అధికార కాంగ్రెస్ పార్టీ నేతలను బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు సూటిగా ప్రశ్నించారు. పేపర్ లెస్ కేబినెట్ అన్నారని.. మిగతా2లో..

## నాణ్యమైన విద్యతోనే అసమానతలు దూరం

- తెలంగాణ పబ్లిక్ స్కూల్ సీఎం, దార్శనికతకు నిదర్శనం
- తెలంగాణ బీసీ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్



విజన్ ఆంధ్ర ప్రతినిధి జూన్ 19 : రాష్ట్ర భవిష్యత్తు తరగతి గదుల్లోనే రూపు దిద్దుకుంటుందని అసమానతలు లేని కామన్ స్కూల్ విధానమే ఉత్తమమని, మన ప్రియతమ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి లిగారిలి నేతృత్వంలో రూపుదిద్దుకుందే " తెలంగాణ పబ్లిక్ స్కూల్" అని తెలంగాణ బీసీ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్ అన్నారు. శుక్రవారం నాడు ఆయన మీడియాకు ఒక ప్రకటన విడుదల చేస్తూ, విద్యా వివక్షను రూపుమాపాలంటే, కామన్ స్కూల్ విధానం తప్పనిసరి అని దూరాలోచనతో, రాష్ట్ర ముఖ్యమంత్రి తన దార్శనికతను ప్రదర్శించారని అన్నారు. ఆవాస ప్రాంతాలలో నర్సరీ నుంచి ఇంటర్ వరకు తెలుగు ఆంగ్ల మాధ్యమాలలో ఒకే స్కూల్ ప్రజలకు అందుబాటులో ఉంచడం రాజైన, పేదైనా వారి పిల్లలు అదే పాఠశాలలో చదువుకునే ఏకీకృత పాఠశాల మిగతా2లో..

## నేడు అన్నదాత సుఖీభవ నిధుల విడుదల



- రూ.3,125 కోట్లు పంపిణీకి రంగం సిద్ధం
- 46.85 లక్షల మంది రైతు కుటుంబాలకు లబ్ధి
- లింగంగుట్లలో అందచేయనున్న సిఎం చంద్రబాబు

అమరావతి,జూన్19 : రాష్ట్రంలోని రైతులకు పెట్టుబడి సాయం అందించేందుకు అన్నదాత సుఖీభవ నిధులను ఎపి ప్రభుత్వం నేడు విడుదల చేయనుంది. శనివారం పల్నాడు జిల్లా చిలకలూరిపేట నియోజకవర్గంలోని లింగం గుంట్లలో జరిగే కార్యక్రమంలో ఈ నిధులను సీఎం చంద్రబాబు నాయుడు విడుదల చేయనున్నారు. 2026-27 ఆర్థిక సంవత్సరంలో తొలి విడత నగదును అన్నదాతల ఖాతాల్లో ప్రభుత్వం జమ చేయనుంది. అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ ద్వారా ఈ ఏడాది తొలి విడతగా రూ.3,125 కోట్లు పంపిణీ చేయనున్నారు. ఈ నగదు ద్వారా 46.85 లక్షల మంది రైతు కుటుంబాలకు లబ్ది మిగతా2లో..

## మైనర్ల డ్రైవింగ్‌ను క్షమించేది లేదు

- స్కూల్ పిల్ల భద్రతపై యాజమాన్యాలదే బాధ్యత
- స్కూల్ యాజమాన్యాలతో భేటీలో సిపి సజ్జన్నార్

హైదరాబాద్,జూన్19 :మైనర్లు డ్రైవింగ్ చేస్తే అస్సలు క్షమించమని హైదరాబాద్ సీపీ సజ్జనార్ స్పష్టం చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో 'స్కూల్ పిల్లల భద్రత'పై స్కూల్ యాజమాన్యాలు, సంబంధిత శాఖలతో మిగతా2లో..



## నేడు అన్నదాత సుఖీభవ నిధుల విడుదల

చేకూరనుంది. మరో వైపు శనివారం ప్రధాన మంత్రి కిసాన్ యోజన పథకం కింద నిధులను విడుదల చేస్తోంది. పశ్చిమ బెంగాల్ హుగ్లీ జిల్లాలోని తారకేశ్వర్‌లో జరిగే కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ ఈ నిధులను విడుదల చేయనున్నారు. దీంతో ఒక్కో రైతు ఖాతాలో రూ. 2 వేలు చొప్పున నగదు జమ కానుంది. దీంతో కేంద్రం, ఏపీ ప్రభుత్వం ఒకే రోజు రైతుల ఖాతాల్లో నగదు జమ చేయనున్నాయి. ఇంకో వైపు జూన్ 30వ తేదీన రాష్ట్రంలోని రైతులకు రైతు భరోసా నిధులు విడుదల చేయాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వం నిర్ణయించింది. ఆ రోజు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మధిరలో నిర్వహించే సభలో సీఎం రేవంత్ రెడ్డి ఈ నిధులను విడుదల చేయనున్నారు.

## మైనర్ల డ్రైవింగ్‌ను క్షమించేది లేదు

ట్రాఫిక్ పోలీసులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. సిటీ పరిధిలో 3500లకు పైగా స్కూల్స్ ఉన్నాయని, వీటిలో 12 లక్షలకు పైగా విద్యార్థులు చదువుతున్నారని అన్నారు. సేఫ్ స్కూల్ ఎన్విరాన్మెంట్ క్రియేట్ చేయడానికి ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్టు చెప్పారు. విద్యార్థులకు ట్రాఫిక్ రూల్స్ పాటించడం అన్నది అలవాటుగా మారాలని సూచించారు. విద్యాసంస్థల్లో ర్యాంక్స్ ఇంపార్టెంట్ కాదని.. సేఫ్ ఎన్విరాన్మెంట్ ముఖ్యమని సీపీ స్పష్టం చేశారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో స్కూల్ బస్సు డ్రైవర్లు పట్టుబడుతున్నారని తెలిపారు. విద్యార్థులు స్కూల్‌కు ఏ విధంగా వస్తున్నారనే దానిపై స్కూల్ యాజమాన్యం వద్ద పూర్తి రూట్‌మ్యాప్ ఉండాలన్నారు. పిల్లలు పాఠశాలకు వస్తున్నారంటే.. ఏం జరిగినా స్కూల్ యాజమాన్యానిదే బాధ్యత అని తేల్చిచెప్పారు. స్కూల్ బస్సులను నడిపే డ్రైవర్లపై నిఘా ఉంచాలని సీపీ సూచించారు. ట్రాఫిక్ వాలంటీర్లు, మార్షల్స్‌ను విద్యాసంస్థలు నియమించుకోవాలని అన్నారు. పిల్లలు తెలిసీ తెలియక నేరాల్లో ఇన్వాల్వ్ అవుతున్నారని.. పిల్లలపై టీచర్స్, పేరెంట్స్ పర్యవేక్షణ ఉండాలని తెలిపారు. స్కూల్ పరిసరాల్లో ఖచ్చితంగా సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. స్కూల్ పరిసరాల్లో పొగాకు ఉత్పత్తులు అమ్మడం నేరమని... అలాంటి వాటిపై పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. దేశవ్యాప్తంగా ప్రతిరోజు 45 మంది విద్యార్థులు యాక్సిడెంట్లో చనిపోతున్నారని, యాక్సిడెంట్లు మర్డర్ల కంటే ప్రమాదకరమన్నారు. అందుకే స్కూల్ విద్యార్థులకు ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించాలని సీపీ సజ్జనార్ వెల్లడించారు.

## పాత అడ్మిట్ కార్డులు చెల్లవు

న్యూఢిల్లీ,జూన్19(ఆర్‌ఎన్‌ఎ): నీట్ అడ్మిట్ కార్డులపై ఎన్‌టీఏ కీలక ప్రకటన చేసింది. అడ్మిట్ కార్డులను ఇప్పటికే డౌన్‌లోడ్ చేసుకున్నవారు మళ్లీ చేసుకోవాల్సిన అవసరం లేదని తెలిపింది. కొత్త అడ్మిట్ కార్డులను ఇంకా డౌన్‌లోడ్ చేసుకోని విద్యార్థుల కోసం ఎన్‌టీఏ నుంచి ఎస్ఎంఎస్, ఈ-మెయిల్, వాట్సాప్ సేవలు అందుబాటులో ఉంటాయని వెల్లడించింది. మే 3 నాటి పాత అడ్మిట్ కార్డులు ఇకపై చెల్లవని స్పష్టం చేసింది. కొత్త అడ్మిట్ కార్డ్‌లను అధికారిక వెబ్‌సైట్ నుంచి మాత్రమే డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించింది. పలువురు విద్యార్థుల కోరిక మేరకు వారు కోరిన నగరాల్లో కొత్త పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపింది. నీట్ 2026 అభ్యర్థుల కోసం ఎన్‌టీఏ వాట్సాప్ సేవలను అందుబాటులోకి తెచ్చింది. జూన్ 21 ఆదివారం జరగబోయే నీట్ రీ-ఎగ్జామినేషన్ సమాచారం ఇకపై నేరుగా వాట్సాప్ ద్వారా అభ్యర్థులకు అందనుంది. 91- 78279 80287 నంబర్ నుంచి మాత్రమే అధికారిక సమాచారం వస్తుందని ఎన్‌టీఏ వెల్లడించింది. బ్లూ టిక్ లేని నంబర్ల నుంచి వచ్చే మెసేజ్‌లను నమ్మవద్దని విద్యార్థులను హెచ్చరించింది.

## మూసీ రివర్‌ఫ్రంట్‌కు కేంద్రం గ్రీన్ సిగ్నల్

రూ.533.42 కోట్ల విలువైన 83.81 ఎకరాల డిఫెన్స్ భూమి వినియోగానికి అనుమతిచ్చింది. ఆర్టిలరీ సెంటర్ గోల్కొండ పరిధిలోని భూమిలో అభివృద్ధి పనులకు కేంద్రం క్లియరెన్స్ ఇచ్చింది. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్లాగ్‌షిప్ ప్రాజెక్ట్‌కు కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ నుండి కీలక అనుమతులు లభించాయి. హైదరాబాద్‌లోని బాపు ఘాట్ వద్ద నిర్మించతలపెట్టిన గాంధీ సరోవర్ ప్రాజెక్ట్ పనులకు రక్షణ శాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ కీలకమైన క్లియరెన్స్ లభించడం పట్ల తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ప్రాజెక్టుకు పూర్తి స్థాయిలో సహకరించి, అనుమతులు మంజూరు చేసినందుకు కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, కేంద్ర రక్షణ శాఖ , ఇండియన్ ఆర్మీకి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. తమ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న మూసీ నది పునరుజ్జీవనం , రివర్‌ఫ్రంట్ అభివృద్ధి విజన్‌లో గాంధీ సరోవర్ ప్రాజెక్ట్‌కు అనుమతులు రావడం ఒక కీలక మైలురాయి అని అభివర్ణించారు. బాపు ఘాట్ పరిసర ప్రాంతాలలో ఈ ప్రాజెక్ట్ పనులు ప్రారంభం కావడం వల్ల మూసీ పరివాహక ప్రాంత రూపురేఖలు మారిపోతాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. మూసీ నది పరివాహక ప్రాంతాన్ని కేవలం ఒక నదిలా కాకుండా.. అద్భుతమైన పర్యావరణ, సాంస్కృతిక , గొప్ప ప్రజా ఆస్తిగా మార్చడమే తెలంగాణ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని సీఎం రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా హైదరాబాద్ నగరానికి ఒక సరికొత్త పర్యాటక హంగులు తోడవుతాయని, పర్యావరణ రక్షణకు కూడా ఇది ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు. కేంద్ర రక్షణ శాఖ ఇచ్చిన ఈ గ్రీన్ సిగ్నల్‌తో గాంధీ సరోవర్ ప్రాజెక్ట్ పనులు మరింత వేగంగా ముందుకు సాగనున్నాయి.మూసీ పునరుజ్జీవం, రివర్ ఫ్రంట్ అభివృద్ధి విజన్‌లో ఇదో మైలురాయన్నారు. మూసీ పరివాహక ప్రాంతాన్ని పర్యావరణ, సాంస్కృతిక, ప్రజా ఆస్తిగా మార్చడమే లక్ష్యమని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

## సింగరేణి సమస్యలు పరిష్కరించాలి

కార్మికులకు ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ ఇచ్చిన హామీలన్నీ వెంటనే నెరవేర్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సింగరేణిలో క్వాలిటీ యంత్రాలు లేవు.. వారి భద్రతను కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని కల్వకుంట్ల కవిత అన్నారు. సింగరేణి కార్మికుల సమస్యలు, స్థానిక మంత్రి శ్రీధర్ బాబు వైఖరిని ఎండగడుతూ ఆమె వ్యాఖ్యలు చేశారు. అదే సమయంలో మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావుపై ఆమె చేసిన వ్యాఖ్యలు అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తున్నాయి. సింగరేణి కార్మికుల క్షేమమే తమకు ముఖ్యమని స్పష్టం చేసిన కవిత.. ప్రస్తుతం సింగరేణిలో కార్మికులకు కనీస నాణ్యత కలిగిన యంత్రాలు అందుబాటులో లేవని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రాణాలను పణంగా పెట్టి పనిచేసే బొగ్గు గని కార్మికుల భద్రతను ప్రస్తుత ప్రభుత్వం గాలికొదిలేసిందని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో సింగరేణి కార్మికులకు ఇచ్చిన ప్రతి హామీని కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్ రెడ్డిని హరీష్ రావే కాపాడుతున్నారు సంచలన వ్యాఖ్యలు చేశారు. అంతేకాదు.. స్థానిక మంత్రి శ్రీధర్ బాబు వైఖరిని తీవ్రంగా తప్పుబట్టారు. తాము సింగరేణి ప్రాంతాల్లో పర్యటిస్తుంటే మంత్రి శ్రీధర్ బాబు కావాలనే తమ పర్యటనలను అడ్డుకుంటున్నారని ఆరోపించారు. కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లకుండా అడ్డుకుంటూ, ఈ వ్యవహారం ద్వారా శ్రీధర్ బాబు రాజకీయంగా లబ్ధి పొందాలని చూస్తున్నారని విమర్శించారు.

## ఎన్నికల హామీలను విస్మరించిన కాంగ్రెస్

ప్రస్తావిస్తూ, ప్రభుత్వాన్ని ఒక మాఫియాతో పోల్చారు. ప్రభుత్వం ఏర్పడి ఇన్ని రోజులవుతున్నా ఇచ్చిన గ్యారంటీల ఊసే లేదు. దీనిపై ముఖ్యమంత్రిని ప్రశ్నిస్తే అడ్డమైన తిట్లు తిడుతున్నారు. వంద రోజుల్లో పిల్లలు పుడతారా అంటూ వింత మాటలు మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. కేసీఆర్‌ను తిట్టుకుంటూ తిరిగితే చాలు, పాలన చేయనక్కర్లేదు అనే చందాన సీఎం వ్యవహార శైలి ఉందని విమర్శించారు. గత ప్రభుత్వం చేసిన పనులకు రిబ్బన్లు కట్ చేయడానికి సీఎం తన జేబులో కత్తెర పెట్టుకుని తిరుగుతున్నారని కేటీఆర్ ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర అభివృద్ధి శూన్యమైందని, కేవలం అప్పులే పెరిగిపోయాయని కేటీఆర్ ఆరోపించారు. ఈ కొద్ది కాలంలోనే ప్రభుత్వం దాదాపు 4 లక్షల కోట్ల రూపాయల అప్పు చేసిందని పేర్కొన్నారు. హైదరాబాద్ నగరంలో పేదలకు ఒక్క ఇల్లు కూడా కట్టి ఇవ్వలేదు గాని, 'హైడ్రా' పేరుతో ఉన్న ఇళ్లను మాత్రం నిర్దాక్షయంగా కూల్చుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ నాయకులను 'దండుపాళ్యం ముఠా'తో పోల్చిన ఆయన, ఈ ప్రభుత్వాన్ని ఒక మాఫియా నడుపుతోందని, ఆ మాఫియాలో రేవంత్ రెడ్డి ఒక పిల్ల నాయకుడు అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో రైతుల పరిస్థితి మరీ దారుణంగా తయారైందని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యం కొనుగోలు చేయడానికి ప్రభుత్వం దగ్గర గోనెసంచులు కూడా లేవని, ఆ సంచులన్నీ ఢిల్లీకి పోతున్నాయని విమర్శించారు. రైతులకు ఇవ్వాల్సిన 'రైతుబంధు' డబ్బు బంద్ అయిపోయిందని, ఆ పైసలన్నీ రాహుల్ గాంధీ ఖాతాలో 'టింగ్ టింగ్' అని పడుతున్నాయని ఆరోపించారు. ప్రస్తుతం పరిస్థితి ఎంత దారుణంగా ఉందంటే, రైతులు ధాన్యం కుప్పలపైనే ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి వచ్చిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలనలో ప్రజలకు మంచి, చెడు ఏంటో పూర్తిగా అర్థమైందన్న కేటీఆర్, కేసీఆర్‌ను మళ్లీ అధికారంలోకి తీసుకురావడానికి ప్రజలంతా కథానాయకులు కావాలని పిలుపునిచ్చారు. మల్కాజ్‌గిరి ప్రజలు , బిఆర్ఎస్ కార్యకర్తలు ఎటువంటి రౌడీలు, గుండాలకు భయపడాల్సిన అవసరం లేదని, పార్టీ ఎల్లప్పుడూ ప్రజల పరంగా నిలబడుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

## పాఠశాలల్లోనే దేశ భవిష్యత్

7 వస్తువులతో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో రేవంత్‌రెడ్డి మాట్లాడారు. తెలంగాణ భాషా ప్రయుక్తరాష్ట్రంగానో, పాలనా సౌలభ్యం కోసమో ఏర్పడింది కాదని ఈసందర్భంగా అన్నారు. 60 ఏళ్ల సుదీర్ఘ పోరాటం, విద్యార్థుల ఆత్మబలిదానాలతో ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైంది. తెలంగాణ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు, ఉపాధి కోసం ఎంతోమంది త్యాగాలు చేశారు. దేశ భవిష్యత్తు తరగతి గదుల్లో ఉంది.. వాటిని పునరుద్ధరించాలన్నదే తన సంకల్పమని అన్నారు. విద్యాశాఖను గతంలో విధ్వంసం చేశారు. గత పాలకుల అరాచకంతో రాష్ట్రానికి వందేళ్ల నష్టం జరిగింది. తెలంగాణ ఎడ్యుకేషన్ పాలసీ రూపొందించి ప్రక్షాళన చేపట్టాం అని వివరించారు. విధ్వంసమైన విద్యాశాఖను వికాసం వైపు నడిపించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనికోసం బడ్జెట్‌లో 8.5 శాతం నిధులు కేటాయించాం. వెనుకబడిన తరగతుల విద్యార్థుల కోసం రూ.26,600 కోట్లు ఖర్చు చేస్తున్నాం. వీటిని భావితరాల భవిష్యత్తును నిర్ణయించే పెట్టుబడులుగా భావిస్తున్నాం. ఆరుట్లలోని తెలంగాణ పబ్లిక్ స్కూల్‌లో నో అడ్మిషన్ బోర్డు పెట్టారు. ప్రభుత్వ స్కూళ్లలో ఇలా బోర్డు పెట్టే పరిస్థితి వస్తుందని ఎవరూ ఊహించి ఉండరని అన్నారు. ఉద్యోగులకు జీతాల మాదిరిగానే ప్రతినెలా ఒకటో తేదీన విద్యార్థులకు కాస్మోటిక్ ఛార్జీలు చెల్లిస్తున్నామని రేవంత్‌రెడ్డి అన్నారు. గతంలో హాస్టల్ విద్యార్థులకు ఈ ఛార్జీలు పెంచలేదని, తాము అధికారంలోకి వచ్చాక పెంచామని అన్నారు. ఈ కార్యక్రమంలో గవర్నర్‌తో పాటు మంత్రులు, ఎంపిలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

## అట్టహాసంగా యంగ్ ఇండియా వెల్‌కమ్ కిట్ల పంపిణీ

ఎల్బీ స్టేడియంలో యంగ్ ఇండియా వెల్కమ్ కిట్స్ పంపిణీ, డ్రగ్స్ వ్యతిరేక ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని తెలంగాణ ప్రభుత్వం ఘనంగా నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులతో డ్రగ్స్ వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించడంతో పాటు కోట్ల రూపాయల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. తెలంగాణ వ్యాప్తంగా రూ.50.73కోట్లతో క్రీడా మౌలిక సదుపాయాల అభివృద్ధికి సీఎం రేవంత్ శ్రీకారం చుట్టారు. అందులో రూ.36.65కోట్లతో వివిధ జిల్లాల్లో మినీ స్టేడియాల నిర్మాణం, క్రీడా మౌలిక సదుపాయాల అభివృద్ధికి శంకుస్థాపన చేశారు. రూ.14.08కోట్లతో గచ్చిబౌలి, ఎల్బీ స్టేడియాల్లో బాలబాలికల క్రీడా శిక్షణకు వివిధ అకాడమీలను రేవంత్ ప్రారంభించారు. రూ.10కోట్లతో రంగారెడ్డి జిల్లా కొందుర్గ్‌లో మినీ స్టేడియం నిర్మాణానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. రూ.10కోట్లతో సంగారెడ్డిలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియం ఆధునికీకరణకు కొబ్బరికాయ కొట్టారు. అలాగే రూ.4కోట్లతో నారాయణపేట్ జిల్లా నర్వలో మినీ స్టేడియం నిర్మాణానికి భూమిపూజ చేశారు. రూ.4కోట్లతో వనపర్తి జిల్లా ఆత్మకూర్‌లో మల్టీ పర్పస్ స్టేడియం, కబడ్డీ, వాలీబాల్, ఖోఖో కోర్టుల నిర్మాణం, క్రికెట్ గ్రౌండ్, వాకింగ్ ట్రాక్ అభివృద్ధికి శంకుస్థాపన చేశారు. అలాగే రూ.3.50కోట్లతో కామారెడ్డి జిల్లా గాంధారి, రూ.2.65కోట్లతో మెదక్ జిల్లా నర్సాపూర్‌లో మినీ స్టేడియాలకు భూమిపూజ చేశారు. రూ.2.50కోట్లతో నారాయణపేట్ జిల్లా మక్తల్ మండలం ఉట్కూరులో వాలీబాల్, కబడ్డీ కోర్టుల నిర్మాణానికీ కొబ్బరికాయ కొట్టారు సీఎం రేవంత్. రూ.5.70 కోట్లతో బాలికల కోసం హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో ఏర్పాటు చేసిన ఈఎంఈం తెలంగాణ టాలెంట్ అకాడమీ ప్రారంభం చేశారు. రూ.5.70 కోట్లతో బాలుర కోసం గచ్చిబౌలి స్టేడియంలో ఏర్పాటు చేసిన ఈఎంఈం తెలంగాణ టాలెంట్ అకాడమీ ప్రారంభించారు. రూ.35.95 లక్షలతో బాలికల కోసం గచ్చిబౌలి స్టేడియంలో ఏర్పాటు చేసిన అథ్లెటిక్స్ అకాడమీ ప్రారంభం అయ్యింది. రూ.35.94 లక్షలతో బాలుర కోసం గచ్చిబౌలి స్టేడియంలో ఏర్పాటు చేసిన అథ్లెటిక్స్ అకాడమీ ప్రారంభం చేశారు. రూ.44.50 లక్షలతో బాలికల కోసం గచ్చిబౌలి స్టేడియంలో ఏర్పాటు చేసిన హాకీ అకాడమీ ప్రారంభం చేశారు. రూ.44.50 లక్షలతో బాలుర కోసం గచ్చిబౌలి స్టేడియంలో ఏర్పాటు చేసిన హాకీ అకాడమీ ప్రారంభం అయ్యింది. రూ.58.50 లక్షలతో బాలుర కోసం ఎల్బీ స్టేడియంలో ఏర్పాటు చేసిన ఫుట్ బాల్ అకాడమీ ప్రారంభం చేశారు. రూ.49 లక్షలతో బాలుర కోసం ఎల్బీ స్టేడియంలో ఏర్పాటు చేసిన హ్యాండ్ బాల్ అకాడమీ ప్రారంభం అయ్యింది. ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి, గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాతో పాటు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వివిధ కార్పొరేషన్ల ఛైర్మన్లు, ఉన్నతాధికారులు హాజరయ్యారు. మరోవైపు గురుకుల విద్యార్థులకు 22 రకాల వస్తువులు, హాస్టల్ విద్యార్థులకు 10, డే స్కాలర్లకు 7 రకాల విద్యా సామగ్రితో కిట్లను అందించారు. ఈ కార్యక్రమానికి సుమారు 15వేల మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ చారిత్రాత్మక వేడుకకు రాష్ట్రంలోని ప్రభుత్వ బడులు, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు (కేజీబీవీలు), ప్రభుత్వ గురుకులాలు, విద్యా వసతి గృహాల నుంచి దాదాపు 15 వేల మంది విద్యార్థులు తరలివచ్చారు. విద్యార్థులు చదువుకునే విద్యాసంస్థల రకాన్ని బట్టి వారి అవసరాలకు తగినట్లుగా ఈ కిట్లను ప్రభుత్వం ప్రత్యేకంగా

## భూవివాదాలు లేని తెలంగాణ నిర్మాణమే లక్ష్యం

నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో మంత్రి గారు మాట్లాడుతూ రాష్ట్రంలో మొత్తం 10,954 రెవెన్యూ గ్రామాలుండగా తొలి దశలో హైదరాబాద్ మినహా మిగిలిన 32 జిల్లాల నుంచి 70 గ్రామాల చొప్పున మొత్తం 2240 గ్రామాలను ఎంపిక చేసి రీసర్వే చేపట్టనున్నట్లు తెలిపారు. ఇందు కు సంబంధించిన అన్ని ఏర్పాట్లను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. భూమి రైతుకు కేవలం ఆస్తి మాత్రమే కాదని.. అది అతని జీవనాధారమని ప్రతి అంగుళం భూమికి స్పష్టమైన హద్దులు, ప్రతి సర్వే నంబర్‌కు భూదార్, ప్రతి రైతుకు భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణను భూ వివాదాలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ఈ రీ-సర్వే కార్యక్రమం చారిత్రాత్మక మైలురాయిగా నిలుస్తుందని మంత్రి పొంగులేటి పేర్కొన్నారు. రాష్ట్రంలో ఇప్పటికీ అనేక ప్రాంతాల్లో 1936 నాటి నిజాం కాలం సర్వే రికార్డులే ప్రధాన ఆధారంగా ఉన్నాయని, కాలక్రమేణా భూముల విభజనలు, ఉప సంఖ్యలు పెరగడం, పట్టణీకరణ విస్తరించడం, పరిపాలనా సరిహద్దులు మారడం వల్ల అనేక ప్రాంతాల్లో భూముల అసలు హద్దులపై స్పష్టత లేకుండా పోయిందన్నారు. ఈ పరిస్థితులకు శాశ్వత పరిష్కారం చూపేందుకే ప్రభుత్వం సమగ్ర రీ-సర్వే చేపడుతోందని తెలిపారు. భూ వివాదాల పరిష్కారంలో భాగంగా రాష్ట్రంలో నిజాం కాలం నుంచి నక్షాలు లేని 378 గ్రామాలను గుర్తించామని, వాటిలో ఇప్పటికే 5 గ్రామాల్లో రీ-సర్వే పూర్తి చేసి భూదార్ నంబర్లు కేటాయించినట్లు తెలిపారు. మిగిలిన 373 గ్రామాల్లో కూడా రోవర్స్ వంటి ఆధునిక సాంకేతికతతో సర్వే పనులు వేగంగా కొనసాగుతున్నాయని చెప్పారు. గొలుసులు, కర్రలు, క్రాస్ స్టాఫ్, మెజరింగ్ టేప్ వంటి పాత సర్వే పరికరాలకు పూర్తిగా స్వస్తి చెబుతున్నామని మంత్రి తెలిపారు. డీజీపీఎస్, రోవర్స్, జీఐఎస్, క్యూజీఐఎస్ వంటి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ శాస్త్రీయ పద్ధతిలో భూముల సర్వే నిర్వహించనున్నట్లు చెప్పారు. ఇప్పటికే 411 రోవర్స్ కొనుగోలు చేయగా, త్వరలో మరో 400 రోవర్స్ కొనుగోలు చేయనున్నట్లు వెల్లడించారు. భూముల రీ-సర్వే పూర్తయిన తర్వాత ప్రతి భూకమతానికి ఖచ్చితమైన హద్దులను నిర్ణయించి, ప్రతి సర్వే నంబర్‌కు ప్రత్యేక భూదార్ నంబర్ కేటాయించనున్నట్లు మంత్రి తెలిపారు. ఆధార్ తరహాలో ప్రతి భూమికి ప్రత్యేక గుర్తింపుగా భూదార్ కార్డులు జారీ చేస్తామని చెప్పారు. డీజీపీఎస్ ద్వారా సేకరించిన సమాచారాన్ని క్యూజీఐఎస్ సాఫ్ట్‌వేర్‌లో నిక్షిప్తం చేసి భూ భారతి పోర్టల్‌లో నమోదు చేయనున్నట్లు తెలిపారు.

## హైదరాబాద్‌లో జనసేన పార్టీ కార్యాలయం

హైదరాబాద్,జూన్19 : హైదరాబాద్‌లో జనసేన పార్టీ కార్యాలయం ప్రారంభం అయ్యింది. పార్టీ అధినేత, ఎపి డిప్యూటి సిఎం÷- పవన్ కళ్యాణ్ కార్యాలయాన్ని ప్రారంభించారు. హైదరాబాద్‌లోని మణికొండ మల్కం చెరువు సమీపంలో నూతనంగా నిర్మించిన జనసేన తెలంగాణ రాష్ట్ర కార్యాలయం శుక్రవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలతో అధికారికంగా ప్రారంభమైంది. జనసేన పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యాలయ ప్రారంభోత్సవం సందర్భంగా పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ జనసేన జెండాను ఆవిష్కరించి కార్యాలయంలోకి అడుగుపెట్టారు. ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం తెలంగాణ తల్లి చిత్రపటానికి నమస్కరించి, రాష్ట్ర నాయకులతో ముచ్చటించారు. రాబోయే గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (ఉఊఓఅ) ఎన్నికల్లో జనసేన పార్టీ బరిలోకి దిగుతుందని పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఇప్పటికే స్పష్టం చేశారు. ఒంటరిగానైనా సరే జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో పోటీ చేస్తామని, క్షేత్రస్థాయిలో పార్టీకి బలం పెంచేందుకు త్వరలోనే తానే స్వయంగా తెలంగాణవ్యాప్తంగా పర్యటిస్తానని ఆయన ప్రకటించారు. ఈ క్రమంలోనే గ్రేటర్ ఎన్నికలను ఒక సవాల్‌గా తీసుకుని క్యాడర్‌ను సమాయత్తం చేసేందుకు ఈ నూతన కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వంలో కీలక భాగస్వామిగా మారిన జనసేన పార్టీ.. తెలంగాణపై తన రాజకీయ దృష్టిని కేంద్రీకరించింది. రాష్ట్రంలో పార్టీ విస్తరణ, సంస్థాగత బలోపేతమే లక్ష్యంగా సరికొత్త వ్యూహాలతో దూకుడు పెంచింది. హైదరాబాద్‌లో ఇప్పటికే జనసేన పార్టీకి కార్యాలయం ఉన్నప్పటికీ.. తెలంగాణలో పార్టీ ఉనికిని మరింత బలంగా చాటేందుకు ఈ కొత్త ఆఫీస్‌ను అందుబాటులోకి తెచ్చారు. రాష్ట్రంలో పార్టీ చేరికలను ప్రోత్సహించేందుకు వీలుగా త్వరలోనే ఒక ప్రత్యేక 'జాయినింగ్స్ కమిటీ'ని కూడా ఏర్పాటు చేయనున్నారు. ఈ కార్యాలయం కేంద్రంగానే తెలంగాణలో సంస్థాగత నిర్మాణం, కమిటీల ఏర్పాటు, ఇతర రాజకీయ వ్యూహాలపై జనసేన నాయకత్వం దృష్టి సారించనుంది.ఇటీవలి కాలంలో పవన్ కళ్యాణ్ హైదరాబాద్‌లో ప్రెస్‌మీట్ పెట్టడం, ఢిల్లీ వేదికగా జరిగిన 'సేన ప్రస్థానం' కార్యక్రమంలో తెలంగాణ రాజకీయాల గురించి ప్రస్తావించడం, అలాగే హనుమకొండలో తన అభిమాని నిరంజన్‌ను కలవడం వంటి వరుస పరిణామాలు జనసైనికుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపాయి. ఆంధ్రప్రదేశ్‌లో సాధించిన విజయ ఉత్సాహంతో తెలంగాణలోనూ జనసేనను ఒక బలమైన ప్రత్యామ్నాయ శక్తిగా నిలబెట్టాలని పవన్ భావిస్తున్నారు. ఈ నూతన కార్యాలయం ప్రారంభోత్సవంతో తెలంగాణ రాజకీయాల్లో జనసేన తన తదుపరి పొలిటికల్ రోడ్ మ్యాప్‌ను ఎలా సిద్ధం చేసుకోబోతోందనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

## 20 ప్రాంతాల్లో ఆధునిక ధాన్య సైలోలు

చేపడుతోందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ప్రధాన వరి ఉత్పత్తి జిల్లాల్లో 20 ప్రాంతాల్లో అత్యాధునిక సైలోల ఏర్పాటుపై ప్రభుత్వం పరిశీలన చేస్తున్నట్లు వెల్లడించారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో శుక్రవారం ధాన్య నిల్వ, రవాణా రంగానికి చెందిన ప్రముఖ సంస్థల ప్రతినిధులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మంత్రి మాట్లాడారు. రాష్ట్రంలో వరి ఉత్పత్తి, ధాన్యం కొనుగోళ్లు ప్రతి ఏడాది పెరుగుతున్న నేపథ్యంలో భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని నిల్వ సామర్థ్యాలను కూడా పెంచాల్సిన అవసరం ఉందని మంత్రి పేర్కొన్నారు. అందులో భాగంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన సైలోల ఏర్పాటును ప్రభుత్వం పరిశీలిస్తోందన్నారు. ప్రారంభ దశలో 50 వేల మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యంతో సైలోల నెట్‌వర్క్‌ను అభివృద్ధి చేసే అవకాశాలను అధ్యయనం చేస్తున్నా మని చెప్పారు. సైలోలు ప్రస్తుతం అమలులో ఉన్న ధాన్యం కొనుగోలు, నిల్వ వ్యవస్థలకు ప్రత్యామ్నాయం కాదని, వాటికి అనుబంధంగా పనిచేసే ఆధునిక మౌలిక వసతులుగా ఉపయోగపడతాయని స్పష్టం చేశారు. 'తెలంగాణలో రైతుల నుంచి ధాన్యం కొనుగోళ్లలో స్వయం సహాయక సంఘాలు, ఇకేపీ కేంద్రాలు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. భవిష్యత్తులో కూడా వారి పాత్ర కొనసాగుతుంది. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రస్తుత కొనుగోలు వ్యవస్థను కొనసాగిస్తూనే ఆధునిక సాంకేతికతను అనుసంధానం చేస్తాం' అని మంత్రి తెలిపారు. పంట కోతల అనంతరం నిల్వ నష్టాలను తగ్గించడం, ధాన్యం నాణ్యతను పరిరక్షించడం, రవాణా వ్యవస్థను వేగవంతం చేయడం, సరఫరా గొలుసును మరింత సమర్థవంతంగా మార్చడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని ఆయన చెప్పారు. సమావేశంలో పాల్గొన్న సాంకేతిక నిపుణులు ఆధునిక సైలోల ద్వారా ధాన్యం స్వీకరణ నుంచి నిల్వ, రవాణా వరకు మొత్తం ప్రక్రియను ఆటోమేటెడ్ పద్ధతి లో నిర్వహించవచ్చని వివరించారు. డిజిటల్ నాణ్యత పరీక్షలు, యాంత్రిక అన్‌లోడింగ్, సెన్సార్ ఆధారిత పర్యవేక్షణ, శాస్త్రీయ నిల్వ విధానాల ద్వారా ధాన్య నాణ్యతను దీర్ఘకాలం కాపాడవచ్చని తెలిపారు. కొనుగోలు కేంద్రాలు, నిల్వ కేంద్రాల వద్ద ఎదురవుతున్న కార్మికుల కొరత, రవాణా ఆలస్యం వంటి సమస్యలకు కూడా ఈ వ్యవస్థ సమర్థవంతమైన పరిష్కారం చూపగలదని మంత్రి అభిప్రాయపడ్డారు.

## కేంద్రం నిర్ణయం మేరకే కొంటే మీరెందుకు ?

కానీ మీది విశ్వాసం లేని కేబినెట్ అని అభివర్ణించారు. మీది విశ్వాఘాతుక ప్రభుత్వమని రేవంత్ రెడ్డి సర్కారుపై నిప్పులు చెరిగారు. పంట కొనుగోలుపై కాంగ్రెస్ సర్కార్ చేతులెత్తేసిందని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ జన్మదినం నాడు రైతులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విషం కక్కారని మండిపడ్డారు. శుక్రవారం సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. వరంగల్‌లో రాహుల్ గాంధీ రైతు డిక్లరేషన్ ప్రకటించారని గుర్తు చేశారు. ఆయన జన్మదినం రోజే ఆ డిక్లరేషన్‌ను తెలంగాణ సీఎం బొందపెట్టారని హరీశ్ రావు విమర్శించారు. ధాన్యం ఏదైనా కనీస మద్దతు ధరతోపాటు బోనస్ కూడా ఇస్తామని నాడు రాహుల్ గాంధీ వరంగల్ వేదికగా ప్రకటించారని గుర్తు చేశారు. కానీ అందుకు భిన్నంగా కేంద్రం చెప్పిందే కొంటాం.. ఎంత కొనమంటే అంతే కొంటామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే తెలిపారు. తన బాధ్యత నుంచి తప్పించుకుంటుందంటూ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రం కొన్నా కొనకపోయినా.. అన్ని పంటలు కొన్నది కేసీఆర్ ప్రభుత్వమని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. తన నిర్ణయం మార్చుకోవాలని ప్రభుత్వాన్ని ఎమ్మెల్యే హరీశ్ రావు డిమాండ్ చేశారు. కేంద్రం ఎంఎస్‌పి ప్రకటిస్తుంది తప్ప మక్కలూ, జొన్నలు కొనదా? అని అసహనం వ్యక్తం చేశారు. పప్పు దినుసులు, వేరుశనగ 25 శాతం మాత్రమే కేంద్రం కొనుగోలు చేస్తుందన్నారు. అంటే మిగతా పంటను రైతులు బయట అమ్ముకోవాలా? అని ప్రభుత్వాన్ని ఆయన నిలదీశారు. దళారుల దయాదక్షిణ్యంపై రైతులు ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొందని హరీశ్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. 50 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే కేంద్రం కొంటుందని.. మిగతా పంటను రైతులు ఏం చేయాలని ప్రభుత్వాన్ని నిలదీశారు. ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలంటున్న రైతులకు ప్రభుత్వం భరోసా ఇస్తుందా అని అడిగారు. తడి గుడ్డతో రైతుల గొంతును రేవంత్ రెడ్డి ప్రభుత్వం కోస్తుందన్నారు. రైతులు జీవితాలతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెలగాటం ఆడుతున్నాయన్నారు. ఎకరాకు రెండు బస్తాల యూరియా మాత్రమే.. అదీ నెలకు ఒకటి చొప్పున ఇస్తారట అంటూ ఆయన ఆందోళన చెందారు. రైతులంటే మీకు ఎందుకు ఇంత చిన్నచూపు అని మంత్రులను ఆయన ప్రశ్నించారు. యూరియా ఇచ్చే తెలివి కూడా లేదా అని ప్రభుత్వాన్ని నిలదీశారు. మిర్చి రైతులు ఎకరాకు ఐదారు యూరియా బస్తాలు వాడుతారని.. మరి మీరు రెండే ఇస్తే మిగతాది ఎట్లా అని ప్రశ్నించారు. కేంద్రం 30 శాతం యూరియా ధరలు పెంచిందని వివరించారు. రెండు బస్తాల ఆలోచన విరమించుకోవాలని ప్రభుత్వానికి ఆయన హితవు పలికారు. 45 రోజుల్లో 9 వేల కోట్ల రూపాయిల రైతు బంధు ఇస్తామన్నారని.. 90 రోజులు అయ్యిందని.. ఇప్పటికీ రైతుల ఖాతాల్లో నగదు మొత్తం పడలేదని విమర్శించారు.

## నాణ్యమైన విద్యతోనే అసమానతలు దూరం

వ్యవస్థే తెలంగాణ పబ్లిక్ స్కూల్ అని ఆయన పేర్కొన్నారు

ఎన్నో దేశ విదేశాలలో..

బ్రిటన్,అమెరికా లాంటి పాశ్చాత్య దేశాలు చైనా, రష్యా లాంటి సోషలిస్టు దేశాలలో కూడా ఆవాస ప్రాంతాలవారీగా ఏక కృత పాఠశాల వ్యవస్థ అది ప్రభుత్వ రంగంలో పని చేస్తూ ఉంటుందని కానీ మన దేశంలో విద్యను ఆవాస ప్రాంతా నియంత్రణ నియామకాలు లేకుండా విచ్చలవిడిగా ప్రైవేటు పాఠశాల వ్యవస్థను అనుమతించడం వల్ల విద్యావ్యవస్థలు వెర్రి తలలు వేస్తున్నాయని, ఒకే ఆవాస ప్రాంతంలో అవసరాలకు మించి ప్రైవేటు ప్రభుత్వ పాఠశాల వ్యవస్థ ఏర్పాటు విద్యార్థుల నమోదు స్థిరత్వాన్ని దెబ్బతీస్తుందని ఎంతసేపు విద్యా మార్పుల పేరుతో మరో తప్పుడు వైఖరి వైపు పాలకులు మొగ్గు చూపుతున్న నేపథ్యంలో తెలంగాణ రాష్ట్రం అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా ఉండాలని పబ్లిక్ స్కూల్ విధానాన్ని ప్రవేశపెట్టడం, మొట్టమొదటిగా రంగారెడ్డి జిల్లా, ఆరుట్ల పాఠశాల ప్రారంభించడం ఆహ్వానించదగ్గ అంశమని అన్నారు. 19 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ విద్యాలయాలలో చదువుతూ ఉంటే 36 లక్షల మంది విద్యార్థులు ప్రైవేటు విద్యాసంస్థల్లో చదువుతున్నారని తెలంగాణ పబ్లిక్ స్కూల్ యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ పేరుతో ప్రభుత్వం ఎన్ని ప్రవేశపెట్టిన అత్యధిక విద్యార్థులు ప్రైవేట్ విద్యాసంస్థలు నియంత్రించకుండా ప్రభుత్వ బడులను అవసరమైన మార్పులతో సంస్కరించకుండా చేపట్టి చర్యలేవి నిర్దిష్ట ఫలితాలు ఇవ్వవని ఆలోచించి ఈ పనిని చిత్తశుద్ధితో చేయగలిగిన ముఖ్యమంత్రి విద్యా సమానత విద్యా ప్రజాస్వామీకరణ అంతరాలు లేని శాస్త్రీయ విద్య అందుబాటులోకి వస్తుందని కామన్ స్కూల్ విధానం మాత్రమే ప్రజలకు ఏకైక ప్రత్యామ్నాయమని ఆలోచించిన ముఖ్యమంత్రి తెలంగాణ పబ్లిక్ స్కూల్ కు అంకురార్పణ చేశారని అన్నారు.

రాష్ట్ర విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దుకునేది తరగతి గదులలోనే

తెలంగాణ విద్యార్థుల భవిష్యత్తు రాష్ట్ర పునర్నిర్మాణం అద్దాలమేడల్లోనూ రంగుల గోడలలోనూ లేవని తరగతి గదుల్లోనే ఉంటాయని భావించి విద్యారంగానికి ప్రభుత్వం ఎనలేని ప్రాధాన్యత ఇస్తూ 27 వేల కోట్లు విద్యా రంగానికి ఖర్చు చేస్తున్నారని, అదేవిధంగా పబ్లిక్ స్కూల్ లో ఉదయం అల్పాహారం మధ్యాహ్నం భోజనం, సాయంత్రం స్నాక్స్ అందించడం, విద్యార్థుల భవితవ్యానికి పెద్దపీట వేస్తాయి అనడంలో అతిశయోక్తి లేదు నూతి శ్రీకాంత్ గౌడ్ అన్నారు.

## గవర్నర్ తో భేటీ అయిన ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ బాలకృష్ణా రెడ్డి

ఆదేశించారు. హైదరాబాద్‌లోని లోక్ భవన్‌లో తెలంగాణ ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టా రెడ్డితో సమావేశమైన గవర్నర్, మండలి ప్రతిపాదించిన వినూత్న విద్యా కార్యక్రమాల అమలు, ప్రణాళికలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ బాలకిష్టా రెడ్డి ఏరోస్పేస్, డిఫెన్స్, మారిటైమ్, ఫిన్‌టెక్, క్లైమేట్ గవర్నెన్స్, లైఫ్ సైన్సెస్, ఫుడ్ టెక్నాలజీ వంటి వ్యూహాత్మక ప్రాధాన్యత కలిగిన రంగాల్లో ప్రవేశ పెట్టనున్న కొత్త కోర్సుల వివరాలను గవర్నర్‌కు వివరించారు, జాతీయ విద్యా విధానం (చీజ్రూ-2020)తో పాటు అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఈ కోర్సులను రూపొందించినట్లు తెలిపారు. ఉపాధి అవకాశాలను పెంపొందించే, పరిశ్రమల అవసరాలకు అనుగుణమైన కోర్సులను ప్రవేశ పెట్టినందుకు తెలంగాణ ఉన్నత విద్యా మండలిని గవర్నర్ అభినందించారు. వేగంగా మారుతున్న ప్రపంచ అవసరాలకు తగ్గట్టుగా నైపుణ్యాలతో కూడిన మానవ వనరులను తయారు చేయడంలో ఈ కార్యక్రమాలు కీలకంగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఉన్నత విద్యలో వినూత్నతకు ప్రాధాన్యతనిస్తూ, తెలంగాణ దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించిన గవర్నర్, పరిశ్రమలు, పరిశోధనా సంస్థలతో సమన్వయం పెంపొందించి ఈ కార్యక్రమాలను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలని సూచించారు. గవర్నర్ అందిస్తున్న ప్రోత్సాహం, మార్గ దర్శకత్వానికి కృతజ్ఞతలు తెలిపిన ప్రొఫెసర్ బాలకిష్టా రెడ్డి, రాష్ట్రంలోని విశ్వ విద్యాలయాలు, కళాశాలల్లో ఈ కోర్సులను విజయ వంతంగా అమలు చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.

## వాట్సాప్‌లో పాఠశాల విద్యా సేవలు ప్రారంభం

విద్యార్థులకు అందించనున్నారు. మీసేవ సహకారంతో వాట్సాప్ ద్వారా ఇకపై స్కూల్ అప్డేట్స్ నేరుగా వారి ఫోన్ కు చేరనున్నాయి. ఎల్‌బీ స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఈ సేవలను అధికారికంగా ప్రారంభించారు. వినూత్న కార్యక్రమం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 18 లక్షల మందికి పైగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాఠశాల విద్యకు సంబంధించిన ముఖ్యమైన సమాచారం, సేవలు, ప్రభుత్వ కార్యక్రమాల వివరాలను నేరుగా వాట్సాప్ ద్వారా పొందనున్నారు. విద్యా పురోగతి, పరీక్షల సమాచారం, విద్యా సామగ్రి పంపిణీ, స్కాలర్‌షిప్‌లు, పాఠశాల కార్యక్రమాలు, ఆరోగ్య, సంక్షేమ కార్యక్రమాల వంటి అంశాలపై సకాలంలో సమాచారం అందుబాటులోకి రానుంది. ప్లాట్‌ఫారమ్‌ను ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు నేతృత్వంలో తెలంగాణ ప్రభుత్వ సమాచార సాంకేతిక, ఎలక్ట్రానిక్స్ / కమ్యూనికేషన్స్ (ఎ÷ఃఇ/అ) శాఖకు చెందిన ఎలక్ట్రానిక్ సర్వీస్ డెలివరీ-మీసేవ విభాగం, పాఠశాల విద్యా శాఖతో కలిసి అభివృద్ధి చేసింది. విద్యార్థులు, తల్లిదండ్రులకు పారదర్శకంగా, సులభమైన రీతిలో వేగవంతమైన సేవలను అందించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యం. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది ఈ డిజిటల్ సేవలను వినియోగించుకుంటున్నారు. వాట్సాప్ ద్వారా మీసేవ ప్రస్తుతం అందిస్తున్న ప్రధాన సేవలు ఇలా ఉన్నాయి. విద్యార్థుల ప్రోగ్రెస్ రిపోర్టులు,హాల్ టికెట్ల డౌన్‌లోడ్,మార్కుల మెమోలు,పరీక్షా ఫలితాలు,ఎస్ఎస్‌సీ మెమోలు, బోనెడ్ సర్టిఫికెట్లు,ట్రాన్స్ ఫర్ సర్టిఫికెట్లు,ఎస్ఎస్‌సీ మెమో సవరణల దరఖాస్తులు సేవల వల్ల విద్యార్థులు, తల్లిదండ్రులు కార్యాలయాలకు వెళ్లాల్సిన అవసరం తగ్గి, సమయంతో పాటు వ్యయం ఆదా అవుతోంది.

# సంపాదకీయం

## సమగ్ర పంటల విధానమే మేలు !

దేశంలో పంటల విధానంపై సమగ్రత లోపించింది. రైతులు తమకు తోచిన పంటలు వేస్తున్నారు. ధరల కోసం దేబురిస్తున్నారు. ప్రభుత్వాలు వీలైనంత మేరకు కొంటున్నాయి. వీలుకాకపోతే చేతులెత్తేస్తున్నాయి. ముఖ్యంగా వరి, జొన్న, మక్కజొన్నలనే పండించడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇప్పటికే దేశంలో ధాన్యం బాగా పోగయ్యింది. డిమాండ్ ఉన్న పంటలు వేయడం, సేంద్రియం వైపు మళ్లడంలో రైతులు ఇప్పటికీ వెనకడుగు వేస్తున్నారు. దీంతో సంప్రదాయ వరి పండిస్తూ చేతులు కాల్చుకుంటున్నారు. ఈ విధానం ముందుగా పోవాలి. ప్రభుత్వాలు కూడా రైతులను చైతన్యం చేయడం లేదా, ఫలానా పంటలు వేయండి అని చెప్పడం లేదు. తెలంగాణ రైతుల పరిస్థితి తీసుకుంటే ఇదే అర్థం అవుతోంది. సన్నాలు పండించిన వారికి గిట్టుబాటు ధరలు వస్తున్నాయి. మద్దతు ధరలను మించి కొంటున్నారు. తాజాగా మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మార్కెట్ యార్డులో సన్న వడ్లకు డిమాండ్ పెరిగింది. వరుసగా రెండ్రోజుల నుంచి 3వేలకు పైగానే మద్దతు ధరలు దక్కుతున్నాయి. ప్రభుత్వం కూడా సన్నాలు పండించాలని, ఏడు రకాలను తాజాగా గుర్తించింది. కానీ మండలాల వారిగా రైతులతో మాట్లాడి వారిని ఒప్పించి, రైతుల పంటల విధానంలో మార్పులు తీసుకుని రావాల్సి ఉంది. ఇవన్నీ ఒక ఎత్తయితే కేంద్రం కూడా ధాన్యం మొత్తాన్ని కొనడానికి ముందుకు రావడం లేదు. టార్గెట్లు విధించి, ఆమేరకు ధాన్యం సేకరణకు రాష్ట్ర ప్రభుత్వాలకు చెబుతోంది. గతంలో బిఆర్ఎస్ అధికారంలో ఉండగా ఇలాగే జరిగింది. ఢిల్లీలో కూడా బిఆర్ఎస్ అధినేత, ఆనాటి సిఎం కెసిఆర్ ధర్నాకు దిగారు. అయినా నేటికీ మార్పు రాలేదు. అందువల్ల రాష్ట్రాలు తమకుతాముగా సమగ్ర పంటల విధానం అమలు చేయాలి. కేవలం ఉచిత విద్యుత్, రైతుభరోసా డబ్బులు వేస్తే సరిపోదు. ఏ పంటలు వేయాలో, వాటికి మార్కెటింగ్ ఎలా ఉంటుందో తెలియచేయాలి. ప్రభుత్వాల జోక్యం లేకుండానే రైతులు పంటలు అమ్ముకునే పరిస్థితిని తీసుకుని రావాలి.ఇక విషయానికి వస్తే ఖరీఫ్ ముంచుకొస్తున్న వేళ రబీ పంటల కొనుగోళ్లు ఇంకా సాగుతూనే ఉన్నాయి. ఈ క్రమంలో పంటల కొనుగోళ్లపై కాంగ్రెస్ సర్కార్ చేతులెత్తేసింది. రైతులు పండించిన చివరి గింజ వరకు కొంటామంటూ చెబుతూ వచ్చిన మంత్రులు, ఇప్పుడు ఊహించని రీతిలో ప్రకటన చేశారు. ధాన్యం, మక్కజొన్న, జొన్న, కందులు, పెసర్లు.. ఇలా పంట ఏదైనా సరే ఇక రాష్ట్ర ప్రభుత్వం తరఫున పంటలు కొనుగోలు చేసే ప్రసక్తే లేదని తేల్చి చెప్పింది. కేంద్ర ప్రభుత్వం ఎంత కొనాలని చెబితే అంతే కొంటామని, అంతకుమించి గింజ కూడా ఎక్కువ కొనేది లేదని స్పష్టంచేసింది. గురువారం సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఇన్‌ఫార్మల్ క్యాబినెట్ సమావేశంలో పంటల కొనుగోళ్లపై సంచలన నిర్ణయం తీసుకున్నది. ధాన్యం, మక్కలు, జొన్నలు, కందులు, పెసర్లు ఇలా పంటల కొనుగోళ్ల బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపైకి నెట్టేసింది. రాష్ట్రంలో ఉత్పత్తి అయ్యే ఏ పంటనైనా సరే కేంద్రం నిర్దేశించిన కోటా మేరకే కొనుగోలు చేస్తామని మంత్రి ఉత్తమ్ మీడియాకు చెప్పారు. పంటలకు మద్దతు ధరను కేంద్రమే నిర్ణయిస్తుంది కాబట్టి.. పంటల కొనుగోలు బాధ్యత కూడా కేంద్ర ప్రభుత్వానిదేనని అన్నారు. మంత్రి వ్యాఖ్యల నేపథ్యంలో ఇకపై రైతులు పండించిన పంటలను కొనుగోలు చేయబోదనేది సుస్పష్టం. కేంద్రం కొనుగోలు చేస్తామని చెప్పిన పంటలను, కేంద్రం ఇచ్చిన కోటా మేరకే ఇక్కడ కేంద్రం ఇచ్చిన డబ్బులతో రైతుల నుంచి సేకరించి కేంద్రానికి అందిస్తుంది. అంతేగానీ ఒకవేళ కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన కోటాకు మించి పంటలు ఉత్పత్తి అయితే ఆ పంటలను రాష్ట్ర ప్రభుత్వం తన సొంత నిధులతో కొనుగోలు చేయబోదు. పంటల కొనుగోళ్లలో కేంద్రం కోటా పూర్తికాగానే ఆ కేంద్రాలను మూసివేస్తుంది. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యంతో పాటు ఇతర పంటలు ఉన్నా ఇక నుంచి ప్రభుత్వం పట్టించుకోదు. మొత్తంగా ఇదే విషయం అర్థం అవుతోంది. ఇలాంటి సమయంలో ఏం చేయాలన్నది కూడా ప్రభుత్వం ప్రకటించాలి. ఎంతమేరకు వరి వేయాలో, అదికూడా ఏ రకం వేయాలో రైతులకు చెప్పాలి. ఏయే జిల్లాల్లో వరి వేయాలో, వేయకూడదో కూడా నిర్ణయించాలి. నిజానికి ధాన్యం సేకరణ బాధ్యత కేంద్రానిదే. కేంద్రం ఆదేశాల మేరకే రాష్ట్రాలు ధాన్యం సేకరణ చేసి, ఎఫ్‌సిఐకి అప్పగిస్తుంది. ఈ క్రమంలో ÷ూష్ట్రంలోని వివిధ పంటలను కేంద్ర ప్రభుత్వం కొంత మేరకే కొనుగోలు చేస్తుంది. ఉత్పత్తి అయిన ధాన్యంలో మూడో వంతు మాత్రమే కొంటుంది. ఇక పెసర్లు, కందులు, జొన్నలు, సన్‌ఫ్లవర్, సోయాబీన్ వంటి పంటలను మొత్తం ఉత్పత్తిలో 25శాతం మాత్రమే కొనుగోలు చేస్తుంది. ఒకవేళ కేంద్ర ప్రభుత్వానికి అవసరముండి, పంట ఎక్కువగా ఉంటే మరో 5-10శాతం వరకు కొనుగోలుకు అనుమతి ఇస్తుంది. ఒత్తిడి తెచ్చినర రాష్ట్రాలకే ఈ వెసులబాటు ఉంటుంది. ఇకపోతే కేంద్ర ప్రభుత్వం.. మక్కలను మాత్రం అసలే కొనుగోలు చేయదు. ఎంత ఉత్పత్తి అయినా సరే ఒక్క గింజ కూడా కొనుగోలు చేయదు. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వం తన కోటా కింద కొనుగోలు చేయగా మిగిలిన పంటలను కొనుగోలు చేసే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలదే. కేంద్రం తన కోటా మేరకు కొనుగోలు చేసిన తర్వాత మిగిలిన పంట ఉత్పత్తులను రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేసేందుకు నిరాకరిస్తే రైతులు ఏం కావాలన్నది ఆలోచన చేయాలి. అందువల్ల పంటల విధానం అమల్లోకి రావాలి. ఏయే పంటలు వేయాలో, ఎంత విస్తీర్ణంలో వేయాలో ప్రభుత్వం నిర్ణయించాలి. అందుకు తగ్గట్లుగా ఎరువుల,విత్తనాలు సరఫరాచేసి, ఆయా పంటలనే ప్రోత్సహించడం ద్వారా సంక్షోభాన్ని అధిగమించవచ్చు.

# మోదీ పరిపాలన స్వర్ణయుగం లాంటిది

### - బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండారి శాంతికుమార్




కల్వకుర్తి జూన్ 19 (విజన్ ఆంధ్ర): భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గత 12 సంవత్సరాల పరిపాలన స్వర్ణయుగం లాంటిదని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండారి శాంతికుమార్ అన్నారు. శుక్రవారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో భారతీయ జనతా యువమోర్చా ఆధ్వర్యంలో నిర్వహించిన "నమో జన్జీ యువ సమ్మేళనం" కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా బండారి శాంతికుమార్ మాట్లాడుతూ, కరోనా కాలంలో గరీబ్ కళ్యాణ్ అన్న యోజన ద్వారా 81 కోట్ల మందికి ఉచిత బియ్యం పంపిణీ చేయడం, కిసాన్ క్రెడిట్ కార్డు ద్వారా కోట్లాది మంది రైతులకు రుణ సదుపాయాలు కల్పించడం, ఆయుష్మాన్ భారత్ పథకం ద్వారా కోట్లాది మందికి ఆరోగ్య బీమా అందించడం వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలను మోదీ ప్రభుత్వం విజయవంతంగా అమలు చేసిందన్నారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద కోట్లాది మందికి పక్కా ఇళ్లు నిర్మించడం, స్వనిధి యోజన ద్వారా వీధి వ్యాపారులకు రుణాలు అందించడం, ఉజ్వల యోజన ద్వారా మహిళలకు ఉచిత వంటగ్యాస్ కనెక్షన్లు ఇవ్వడం, జల్ జీవన్ మిషన్ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి కనెక్షన్లు కల్పించడం వంటి కార్యక్రమాలు దేశ అభివృద్ధికి దోహదపడ్డాయని తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత అనేక దశాబ్దాల పాటు దేశాన్ని పాలించిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ఆశలను నెరవేర్చడంలో విఫలమైందని ఆరోపించిన ఆయన, మోదీ నాయకత్వంలో అన్ని వర్గాల ప్రజలకు అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందుతున్నాయని పేర్కొన్నారు. జిల్లా అధ్యక్షుడు నరేందర్‌రావు మాట్లాడుతూ, మోదీ 12 ఏళ్ల పాలనలో మచ్చలేని పరిపాలన అందిస్తూ పేద ప్రజల అభ్యున్నతి కోసం నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. యువ సమ్మేళన జిల్లా కన్వీనర్ నరేష్ చారి మాట్లాడుతూ, దేశ యువత మోదీ పరిపాలనను ఆదరిస్తోందని, ప్రతీ ఎన్నికల్లో యువత బీజేపీకి మద్దతుగా నిలుస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నరేందర్‌రావు, యువ సమ్మేళన జిల్లా కన్వీనర్ నరేష్ చారి, జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్ర గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణిలో అవినీతిపై నిజాలు బయటపెట్టాలి

### -ఛలో సింగరేణిలో పాల్గొన్న అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్...



నిజామాబాద్ జూన్19: (విజన్ ఆంధ్ర )సింగరేణిలో జరిగిన అవినీతిపై నిజాలు బయటపెట్టాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ డిమాండ్ చేశారు. బీజేపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ లతో మంచిర్యాల జిల్లాలో చేపట్టిన ఛలో సింగరేణి కార్యక్రమంలో శుక్రవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సింగరేణి స్టాక్ రికార్డులో ఉన్నట్లు చూపిన సుమారు 40 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గు కనిపించడం లేదని ఆరోపించారు. ఈ బొగ్గు విలువ సుమారు రూ. 1600 కోట్లు ఉంటుందని , అక్రమంగా తరలించి విక్రయించారని చెప్పారు. దీనివల్ల ప్రభుత్వ రంగ సంస్థకు భారీ నష్టం జరిగిందని వాపోయారు. ఈ వ్యవహారంపై స్వతంత్ర లేదా ఉన్నత స్థాయి విచారణ జరపాలని డిమాండ్ చేశారు. బొగ్గు నిల్వలు, ఉత్పత్తి, రవాణా, విక్రయాలపై పూర్తి ఆడిట్ నిర్వహించాలని అన్నారు. ప్రజల సంపదకు సంబంధించిన అంశాల్లో ప్రభుత్వం జవాబుదారీతనం చూపించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మౌనం వీడి సింగరేణి వ్యవహారంలో నిజం ఏదో ప్రజలకు తెలపాలన్నారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం అనేక హామీలను తుంగలో తొక్కిందని గుర్తు చేశారు. దీనికి తోడు భారీ అవినీతికి పాల్పడడం ప్రజలను మోసం చేయడమేనని తెలిపారు. జైపూర్ థర్మల్, సోలార్ పవర్ ప్లాంట్ల పేరుతో పిపిఏ లు, డిపీఆర్ లు లేకుండానే భారీ అవినీతికి తెరలేపారన్నారు. సైట్ విజిట్ సర్టిఫికెట్ పేరుతో నచ్చిన కాంట్రాక్టర్లకు టెండర్లు కట్టబెట్టి కార్మికుల శ్రమను దోచుకుంటున్నారని మండిపడ్డారు. గతంలో బీఆర్ఎస్, ఇప్పుడు కాంగ్రెస్ పార్టీలో సింగరేణిని కేవలం ఓటు బ్యాంకు రాజకీయాలకు మాత్రమే వినియోగించుకుంటున్నాయని విమర్శించారు. అయితే కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం భారతీయ జనతా పార్టీ నిరంతరం పోరాడుతూనే ఉంటుందని స్పష్టం చేశారు. సింగరేణి ప్రాంత పరిస్థితులను పరిశీలించేందుకు వెళ్లిన తమని కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసుల ద్వారా అడ్డుకొని అరెస్టు చేయడం అత్యంత హేయమైన చర్య అని ఖండించారు. కార్యక్రమంలో బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, ఎమ్మెల్యేలు రామారావు పటేల్, పాల్వాయి హరీష్ బాబు, వెంకటరమణారెడ్డి, రాకేష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# కామారెడ్డి జిల్లాలో 70 గ్రామాలలో సమగ్ర రీ-సర్వే నిర్వహణకు నోటిఫికేషన్ జారీ



కామారెడ్డి బ్యూరో జూన్ 19(విజన్ఆంధ్ర)తెలంగాణ ప్రభుత్వ ప్రధాన భూ పరిపాలన కమిషనర్ రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి లోకేష్ కుమార్ శుక్రవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్న సమగ్ర రీ-సర్వే కార్యక్రమం పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో అన్ని జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, జిల్లా సర్వే భూ రికార్డుల అధికారులు పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో భూ రికార్డుల ఆధునీకరణ, సరిహద్దుల నిర్ధారణ, రీ-సర్వే ప్రక్రియలో అనుసరించాల్సిన విధివిధానాలపై సమగ్రంగా చర్చించారు. జిల్లాల్లో ప్రతిపాదిత గ్రామాల రీ-సర్వే కార్యక్రమాన్ని పారదర్శకంగా, వేగవంతంగా పూర్తి చేయాలని లోకేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. ప్రజలకు పూర్తి అవగాహన కల్పించి, అభ్యంతరాలు, క్లెయిమ్‌లను నిబంధనల మేరకు పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, అదనపు కలెక్టర్ విక్టర్, సర్వే లాండ్ అధికారి పాల్గొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కామారెడ్డి జిల్లాలో నూతనంగా ప్రతిపాదించిన 70 గ్రామాలలో సమగ్ర రీ-సర్వే కార్యక్రమాన్ని చేపట్టేందుకు జిల్లా కలెక్టర్ సర్వే అండ్ బౌండరీస్ చట్టం, 1923లోని సెక్షన్ 6(1) ప్రకారం 12.06.2026 తేదీన జిల్లా గెజిట్ నెం.175 ద్వారా నోటిఫికేషన్ జారీ చేసినట్లు తెలిపారు. జిల్లాలోని ప్రతి మండలంలో మూడు గ్రామాల చొప్పున మొత్తం 70 గ్రామాలను ఈ సమగ్ర రీ-సర్వే కార్యక్రమానికి ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. భూ రికార్డులను ఆధునీకరించడం, సరిహద్దులను ఖచ్చితంగా నిర్ధారించడం, భూ వివాదాలను తగ్గించడం మరియు భూములకు సంబంధించిన సమాచారాన్ని పారదర్శకంగా నమోదు చేయడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు. నోటిఫికేషన్ ప్రతులను సంబంధిత తహసీల్దార్లు, ఎంపీడీవోలు, గ్రామపంచాయతీ కార్యాలయాలకు పంపించి, ప్రజల అవగాహన కోసం ఆయా కార్యాలయాల నోటీసు బోర్డులపై ప్రదర్శించాల్సిందిగా ఆదేశాలు జారీ చేసినట్లు వెల్లడించారు. ప్రతిపాదిత రీ-సర్వే గ్రామాలకు సంబంధించి ఎవరికైనా అభ్యంతరాలు, క్లెయిమ్‌లు లేదా సూచనలు ఉన్నట్లయితే, నోటిఫికేషన్ ప్రచురితమైన తేదీ నుండి నిర్దేశిత గడువులోగా సంబంధిత తహసీల్దార్ కార్యాలయం లేదా జిల్లా సర్వే మరియు భూ రికార్డుల కార్యాలయం, కామారెడ్డికి లిఖితపూర్వకంగా సమర్పించవచ్చని జిల్లా పరిపాలన సూచించింది. రీ-సర్వే ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయడానికి ప్రజలు పూర్తి సహకారం అందించాలని, సర్వే అధికారులు కోరినప్పుడు అవసరమైన సమాచారం, సంబంధిత పత్రాలు అందించాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

# యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు



వరంగల్ జిల్లా ప్రతినిధి జూన్19(విజన్ ఆంధ్ర) ;- వరంగల్ జిల్లా కేంద్రంలోని పర్వతగిరి మండలంలో ఏఐసీసీ అగ్రనేత లోక్ సభ ప్రతిపక్ష నాయకులు,ఇందిరమ్మ ఆశయ సారథి రాజీవ్ కలల వారధి రాహుల్ గాంధీ 56వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని పర్వతగిరి మండల కేంద్రంలోని ప్రైమరీ పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులకు యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నోట్ బుక్స్ మరియు పలకలు పెన్సిల్లు అందించారు ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కందికట్ల అనిల్, మరియు యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు గొడుగు వినయ్ మాట్లాడుతూ రాహుల్ గాంధీ కాబోయే భారతదేశ ప్రధాని అని..భారత దేశ ఐక్యత కోసం ఆదర్శవంతమైన నాయకత్వంతో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేస్తూ ముందుకు నడిపిస్తున్న యువ నాయకులు అని కొనియాడారు..ప్రజల హక్కుల కోసం నిరంతరం పోరాడుతూ, భారతదేశ ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు అంకింతభావంతో పని చేస్తు కాంగ్రెస్ పార్టీకి ఒక దిక్సూచి గా ఉన్న నాయకుడు అని తెలిపారు..రాజ్యాంగ విలువలను కాపాడేందుకు, అణగారిన వర్గాల గొంతుకగా, సమగ్ర మరియు నవభారత నిర్మాణం కోసం ఆయన చేస్తున్న నిరంతర పోరాటం కోట్లాది మందికి స్ఫూర్తిదాయకం అని అన్నారు. వారు ఆయురారోగ్యాలతో, ప్రజాసేవలో విజయాలు చేకూరాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ పర్వతగిరి మండల ఉపాధ్యక్షులు మూడు దేవరాజ్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు నరుకుడు రవీందర్, యూత్ కాంగ్రెస్ వర్ధన్నపేట నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి ఎర్రబోయిన సాంబరాజు యాదవ్, పర్వతగిరి మాజీ మండల పార్టీ అధ్యక్షులు కత్తుల శ్రీనివాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమణ రెడ్డి, యూత్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ల్యాబొరేటరీ టెక్నీషియన్ సీనియర్ ట్యూబర్క్యులోసిస్ పోస్టుల నియామకాలు

ల్యాబొరేటరీ టెక్నీషియన్ సీనియర్ ట్యూబర్క్యులోసిస్ పోస్టుల నియామకాలు:

మెదక్ జిల్లా ప్రతినిధి జూన్ 19 (విశాల తెలంగాణ): జిల్లాలో ల్యాబొరేటరీ టెక్నీషియన్ సీనియర్ ట్యూబర్క్యులోసిస్ ల్యాబొరేటరీ సూపర్వైజర్ ఎస్ టి ఎల్ ఎస్, పోస్టుల నియామకాలకు సంబంధించిన తాత్కాలిక ఎంపిక జాబితా జిల్లా కలెక్టర్ కార్యాలయం అధికారిక వెబ్‌సైట్‌లో ప్రచురించబడినది. అభ్యర్థులు తమ దరఖాస్తు స్థితిని పరిశీలించి, జాబితాలోని కాలమ్‌లో పేర్కొన్న లోపాలు లేదా పెండింగ్ పత్రాలను గమనించగలరు. ఏవైనా అభ్యంతరాలు ఉన్నా లేదా అదనపు/పెండింగ్ పత్రాలను సమర్పించవలసి ఉన్నా, సంబంధిత అభ్యర్థులు శనివారం, సోమవారం మరియు మంగళవారం రోజులలో కార్యాలయ సమయాల్లో జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి డి ఎం అండ్ హెచ్ ఓ, కార్యాలయంలో తమ అభ్యంతరాలు సంబంధిత పత్రాలను సమర్పించవలసిందిగా కోరడమైనది. నిర్దేశించిన గడువు అనంతరం అందిన అభ్యంతరాలు లేదా పత్రాలు ఏ పరిస్థితుల్లోనూ పరిగణనలోకి తీసుకోబడవు. తెలిపారు మెడ్చల్ ' మల్కాజిగిరి జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి,డా. సి. ఉమా గౌరి తెలిపారు.

# బీఆర్ఎస్ డిజిటల్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

### బీఆర్ఎస్ శ్రేణులకు కేటీఆర్ పిలుపు



అల్వాల్, జూన్ 19: బీఆర్ఎస్ డిజిటల్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీమంత్రి కేటీఆర్ పిలుపునిచ్చారు. శుక్రవారం మల్కాజ్‌గిరి నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం బొల్లారంలోని మెమోటోస్ వెడ్డింగ్ కన్వెన్షన్‌లో మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన కేటీఆర్ మాట్లాడుతూ... పార్టీ డిజిటల్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయడంతో పాటు ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమం (సర్)లో పార్టీ శ్రేణులు చురుకుగా పాల్గొని ప్రతి అర్హుడైన ఓటరు పేరు, జాబితాలో ఉండేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో అనుసరించాల్సిన వ్యూహాత్మక చర్యలపై నాయకులు, కార్యకర్తలకు సమగ్ర దిశానిర్దేశం చేశారు. సమావేశంలో మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.., మల్కాజ్‌గిరి ప్రజలు తనపై ఉంచిన విశ్వాసంతో ఎమ్మెల్యేగా సేవ చేసే అవకాశం లభించిందని, ఆ బాధ్యతను ప్రజాసేవకు వచ్చిన పవిత్ర అవకాశంగా భావిస్తున్నానని తెలిపారు. గత రెండున్నర సంవత్సరాలుగా మల్కాజ్‌గిరి నియోజకవర్గం ఎదుర్కొంటున్న రైల్వే గేట్లు, ట్రాఫిక్ సమస్యలు, తాగునీటి కొరత, విద్యుత్ మరియు డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం రూ. 1755 కోట్లకు పైగా నిధులు మంజూరు అయ్యేలా కృషి చేశామని, గౌతమ్‌నగర్ 5 ఎం ఎల్ డీ రిజర్వాయర్, విద్యుత్ సబ్‌స్టేషన్లు, ఏఓసీ అదనపు రోడ్లు, జిల్లా కోర్టు భవనం, ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్, స్విమ్మింగ్ పూల్, బండ చెరువు అభివృద్ధి వంటి అనేక కీలక ప్రాజెక్టులను సాధించానని వివరించారు. అలాగే, అరుంధతి హాస్పిటల్ఊ ద్వారా పేదలకు ఉచిత వైద్య సేవలు అందిస్తున్నానని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు చేపట్టామని, దళిత రత్న అవార్డులు, సేవాలాల్ జయంతి వేడుకలు, మైనార్టీలకు కుట్టు మిషన్లు, ఆశూర్‌ఖానాలు, చర్చిలకు ఆర్థిక సహాయం, మహిళల సాధికారత కోసం ప్రత్యేక బ్యాంకర్ల సమావేశాలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. గౌతమ్‌నగర్, వినాయక్‌నగర్ తదితర ప్రాంతాల్లో పేదల హక్కుల కోసం కోర్టుల్లో, అధికారుల వద్ద పోరాడిన విషయాలను గుర్తు చేశారు. రాజకీయ ఒత్తిడులు, ఇబ్బందులు ఎదురైనా ప్రజల సమస్యల పరిష్కారమే తన ధ్యేయమని స్పష్టం చేశారు. మల్కాజ్‌గిరిని హైదరాబాద్‌లోనే అత్యుత్తమ అభివృద్ధి చెందిన నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే చెప్పారు. తన రాజకీయ ప్రయాణంలో రెండుసార్లు అవకాశం కల్పించిన బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ రాష్ట్ర నిర్మాణ శిల్పి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావుకి, అలాగే 50 వేల మెజారిటీతో గెలిపించిన మల్కాజ్‌గిరి ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంబీసీ చైర్మన్, మల్కాజ్‌గిరి నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు ఇన్‌చార్జ్ నందికంటి శ్రీధర్, మల్కాజ్‌గిరి లోక్‌సభ ఇన్‌చార్జ్ రాగిడి లక్ష్మారెడ్డి, మాజీ కార్పొరేటర్లు చింతల శాంతి శ్రీనివాస్ రెడ్డి, సబితా అనిల్ కిషోర్ గౌడ్, జగదీష్ గౌడ్, ఆకుల నర్సింగరావు, మురుగేష్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బద్ధం పరశురాం రెడ్డి, జేఏసీ వెంకన్న, జీకే హనుమంతరావు, అమీనుద్దీన్, చిన్న యాదవ్, ప్రభాకర్ గౌడ్, వంశీ ముదిరాజ్, హేమంత్ పటేల్, శ్రీధర్ గౌడ్, డోలి రమేష్, ఢిల్లీ పరమేష్, లక్ష్మణ్ యాదవ్, శోభన్, భాస్కర్ రెడ్డి, అరుణ్ రావు, అరవింద్, శివ గౌడ్, సాయి గౌడ్, గౌస్ ఇమ్రాన్, ఖలీల్, శ్రీనివాస్ గౌడ్ తదితర నాయకులు, కార్యకర్తలు, మహిళలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రమాదకరంగా మారిన బ్రైట్ వ్యూ ఫార్చ్యూన్ అవెన్యూ జంక్షన్ ను పరిశీలించిన మల్కాజిగిరి జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్

అల్వాల్, జూన్ 19: అత్యంత ప్రమాదకరంగా మారిన బ్రైట్ వ్యూ ఫార్చ్యూన్ అవెన్యూ జంక్షన్ ను శుక్రవారంమల్కాజిగిరి జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్‌పరిశీలించారు. కౌకూర్ ఫార్చ్యూన్ అవెన్యూ కాలనీకి చెందిన శ్రీ వరకాల స్వామి (64) రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. తన కుమార్తెను యాప్రాల్ ప్రాంతంలో దింపి తిరిగి ఇంటికి వస్తుండగా, బ్రైట్ వ్యూ సమీపంలో ఫార్చ్యూన్ అవెన్యూ కాలనీ వైపు కుడి మలుపు తిరిగే సమయంలో అతివేగంగా వస్తున్న బుల్లెట్ బైక్ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడి ప్రాణాలు కోల్పోయారు. మృతుడు ఒక కుమారుడు, ఒక కుమార్తెకు తండ్రి. ఆయన మృతి పట్ల స్థానిక ప్రజలు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బ్రైట్ వ్యూ ఫార్చ్యూన్ అవెన్యూ జంక్షన్ ప్రాంతం అత్యంత ప్రమాదకరంగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత నాలుగు సంవత్సరాలలో ఇదే ప్రాంతంలో సుమారు 14 మంది రోడ్డు ప్రమాదాలలో మృతి చెందినట్లు తెలిపారు. రహదారి మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలు, అనధికారిక ఇంటర్నెట్ పోల్స్, అధిక వేగంతో ప్రయాణించే వాహనాలు ప్రమాదాలకు నిలయంగా మారింది. ఈ నేపథ్యంలో శుక్రవారం మల్కాజిగిరి జోన్ జోనల్ కమిషనర్ శ్రీ సంచిత్ గంగ్వార్, సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మల్కాజిగిరి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, సామాజిక కార్యకర్త తుడిమెల్ల మల్లికార్జున్ ఈ ప్రాంతంలో జరుగుతున్న ప్రమాదాల వివరాలను జోనల్ కమిషనర్ కు వివరించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఏసీపీ సుబ్బయ్య, జవహర్‌నగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శివశంకర్, రోడ్ సేఫ్టీ సబ్ ఇన్‌స్పెక్టర్ కె. జగన్, ఎంఎంసీ ఎలక్ట్రికల్ విభాగానికి చెందిన సతీష్ , స్ట్రీట్ లైట్ సూపర్వైజర్ అశోక్ లు ప్రమాద నివారణకు అవసరమైన చర్యలపై సూచనలు చేశారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్, సంబంధిత అధికారులకు రహదారి మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాల తొలగింపు లేదా స్థానచలనం, స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు, ఫార్చ్యూన్ అవెన్యూ, గ్రీన్‌వుడ్స్, ఆర్క్ తదితర కాలనీలకు సరైన డైవర్షన్ మార్గాల కల్పన, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అదే విధంగా భరత్‌పేట్ సర్కిల్ నుండి కార్గిల్ గేట్ హనుమాన్ దేవాలయం వరకు రహదారిపై ఉన్న అనధికారిక విద్యుత్, ఇంటర్నెట్ పోల్స్ తొలగించి, తగిన వీధి దీపాల ఏర్పాటుతో పాటు రహదారి భద్రతా ప్రమాణాలను మెరుగుపరచాలని ఎంఎంసీ అధికారులకు ప్రతిపాదనలు సమర్పించారు. భవిష్యత్తులో ఇటువంటి రోడ్డు ప్రమాదాలు జరగకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని, ప్రజల ప్రాణ భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని తుడిమెల్ల మల్లికార్జున్, అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు బొడ్డు శ్రీనివాస్ యాదవ్, బాల్ రెడ్డి, శివరాజ్, అల్లి మల్లేష్, అల్లి పండు, అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

## దేశీయ మార్కెట్లో బంగారం ధరలు పతనం

### పదిగ్రాములపై 3వేలకు పైగా దిగివచ్చిన ధరలు

న్యూఢిల్లీ,జూన్19 దేశీయ మార్కెట్లో బంగారం, వెండి ధరలు దిగొచ్చాయి. పశ్చిమాసియా ఉద్రిక్తతలు చల్లారడం, చమురు ధరలు పడిపోవడం వంటి పరిణామాలతో ఈ లోహాలకు డిమాండ్ తగ్గింది. దీంతో వీటి ధరలు కాస్తా తగ్గుముఖం పట్టాయి. హైదరాబాద్ మార్కెట్లో శుక్రవారం 24 క్యారెట్ల మేలిమి 10 గ్రాముల పుత్తడి ధర రూ.1,49,270గా ఉంది. క్రితం రోజుతో పోలిస్తే దాదాపు రూ.3000కు పైనే తగ్గింది. ఇక, కేజీ వెండి ధర రూ.2.37లక్షలు పలికింది. వెండి ధర ఒక్క రోజే రూ.8,600 తగ్గడం గమనార్హం. అంతర్జాతీయ మార్కెట్లోనూ ఈ లోహాల ధరలు దిగొచ్చాయి. ఔన్సు పుత్తడి ధర 4,139 డాలర్లు, ఔన్సు వెండి ధర 63.85 డాలర్లుగా ఉంది. కమొడిటీ ఎక్స్ఛేంజీ మార్కెట్లో గోల్డ్ ఫ్యూచర్స్ ధర రూ. 1.46 లక్షలకు పడిపోయింది. సిల్వర్ ఫ్యూచర్స్ ధర రూ.2.30లక్షలుగా కొనసాగుతోంది. అమెరికా-ఇరాన్ యుద్ధం ముగియడం, ఫెడ్ ప్రకటనతో అంతర్జాతీయ మార్కెట్లు కోలుకున్నాయి. అటు డాలర్‌తో పోలిస్తే మన కరెన్సీ రూపాయి విలువ కూడా బలపడుతోంది. చమురు ధరలు యుద్ధం మునుపటి స్థితికి దిగొస్తున్నాయి. ఈ కారణాలు బంగారం, వెండి ధరలపై ప్రభావం చూపిస్తున్నాయని బులియన్ విశ్లేషకులు చెబుతున్నారు.

# క్యాన్సర్ శస్త్ర చికిత్స ల్లో విప్లవత్మక మార్పులు

### రోబోటిక్ టెక్నాలజీతో క్యాన్సర్ ను జయించవచ్చు

### సీనియర్ సర్జికల్ అంకలాజిస్ట్, రోబోటిక్ సర్జన్ డా, రాజేష్ గౌడ్



మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూన్ 19,(విజన్ ఆంధ్ర) క్యాన్సర్ చికిత్సలో అనేక మార్పులు చోటు చేసుకుంటున్నాయని, అంతేకాకుండా ప్రజలకు ట్యూమర్ బయాలజీ పై మరింత అవగాహన పెరగడంతో పాటు నేటి క్యాన్సర్ శాస్త్ర చికిత్సలో వ్యాధులను తొలగించడమే కాకుండా రోగికి మరింత జీవన నాణ్యతను అందిస్తూ పూర్తిగా నయం చేయడం జరుగుతుందని యశోద హాస్పిటల్ సీనియర్ సర్జికల్ ఆంకాలజిస్ట్ మరియు రోబోటిక్ సర్జన్ డాక్టర్ రాజేష్ గౌడ్ అన్నారు. శుక్రవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఓ హోటల్లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సాంకేతిక ఆవిష్కరణలలో ఒకటి రోబోటిక్ శస్త్ర చికిత్స ఫ్లోరోసైన్స్ గైడెడ్ సర్జరీ అని పేర్కొన్నారు. ఆధునిక టెక్నాలజీలు అత్యంత ఖచ్చితత్వం రోగి వేగవంతంగా కోలుకొనే అవకాశాలను అందిస్తుందన్నారు. గతంలో చేసిన సర్జరీల మాదిరిగా కాకుండా, నూతన టెక్నాలజీతో రోబోటిక్ సర్జరీని కేవలం ఎనిమిది మిల్లీ మీటర్ల రంధ్రం ద్వారా వైద్యులు శాస్త్ర చికిత్సను పూర్తి చేయగలుగుతున్నారని తెలిపారు. ముఖ్యంగా స్మార్ట్ టెక్నాలజీ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కలయికతో శస్త్ర చికిత్సలు మరింత ఖచ్చితంగా సురక్షితంగా మారుతున్నాయని పేర్కొన్నారు. శస్త్ర చికిత్సలో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకుంటున్నాయని, క్లోరోసిన్స్ గైడేడ్ రోబోటిక్ టెక్నాల తో క్యాన్సర్ ను జయించవచ్చు అన్నారు. రొమ్ము క్యాన్సర్ చికిత్సలో కూడా ఫ్లోరోసైన్స్ గైడల్ టెక్నాలజీ కొత్త దిశను చూపుతోందని, ప్రత్యేకమైన డై ఇంజక్షన్ ఇచ్చిన తర్వాతనే క్యాన్సర్ నుండి మొదట ప్రభావితమయ్యే సెంటినల్ లింప్ నోడ్స్ కెమెరా ద్వారా స్పష్టంగా కనిపిస్తాయన్నారు. లింప్ నోడ్స్ ను మాత్రమే కచ్చితంగా తొలగించవచ్చుని గతంలో లాగే అన్ని లింప్ నోడ్స్ తొలగించాల్సిన అవసరం తగ్గి నొప్పి ఇతర సమస్యలు తగ్గుతాయని, ఇది రోగి జీవన నాణ్యతను మరింత మెరుగుపరుస్తుందన్నారు. రోబోటికి టెక్నాలజీ తో ప్రోస్ట్రేట్, బ్లాడర్, కిడ్నీ ఆర్డినల్ ట్యూమర్ల చికిత్సలో ఎంతో మార్పు తీసుకు వచ్చిందన్నారు. రోబోటిక్ సర్జరీ వల్ల రోగికి నొప్పి ఉండక పోవడం,రక్తం ఎక్కించే అవసరం ఉండదని,ఆస్పత్రిలో రోజుల తరబడి ఉండాల్సిన అవసరం లేదని,త్వరగా కోలుకోవచ్చుని, మెరుగైన జీవన నాణ్యత తో పాటు ఖర్చు కూడా తక్కువగానే అవుతుందన్నారు. క్యాన్సర్ ను నయం చేయడమే కాకుండా రోగి జీవితాన్ని మరింత మెరుగ్గా మార్చడం కూడా ఆధునిక శాస్త్ర శిక్షణ లక్ష్యం అని పేర్కొన్నారు. రోబోటిక్ సర్జరీ విధానం ను ప్రాజెక్టర్ ద్వారా ప్రదర్శించారు. ఈ సమావేశంలో పీఆర్వో నవీన్ పాల్గొన్నారు.

# సూర్యాపేట జిల్లా కేంద్రాన్ని సురక్షిత పట్టణంగా తీర్చిదిద్దుతాం

**పట్టణంలో అదనంగా మరో 20 సీసీ కెమెరాల ఏర్పాటు.. కమాండ్ కంట్రోల్‌కు అనుసంధానం**

**భూకబ్జాదారులు, రౌడీషీటర్లపై నిరంతర నిఘా..**

**ట్రాఫిక్ సమస్యల నివారణకు ప్రత్యేక ప్రణాళిక ఆపరేషన్ రోప్**

**మహిళలు, విద్యార్థినుల భద్రతకు అత్యధిక ప్రాధాన్యత..**

**వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు**

**సూర్యాపేట జిల్లా ఎస్పి కె నరసింహ**





సూర్యాపేట జూన్ 19:(విజన్ ఆంధ్ర)జిల్లాలోని పోలీస్ స్టేషన్ల వార్షిక తనిఖీల్లో భాగంగా సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ శుక్రవారం సూర్యాపేట 1వ పట్టణ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి, క్షేత్రస్థాయిలో విస్తృత తనిఖీలు నిర్వహించారు. పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న ఎస్పీ కి డీఎస్పీ ప్రసన్నకుమార్, పట్టణ ఇన్స్పెక్టర్ వెంకటయ్య, ఎస్సైలు మరియు సిబ్బంది ఘనంగా గౌరవ వందనంతో స్వాగతం పలికారు.అనంతరం సిబ్బంది నిర్వహించిన కవాతును పరిశీలించి వారి యూనిఫామ్స్ మరియు కిట్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బందితో వ్యక్తిగతంగా మాట్లాడి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో మొక్కలు నాటారు. అనంతరం స్టేషన్ పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించి, స్టేషన్‌లోని వివిధ రకాల కీలక రికార్డులను, శాంతిభద్రతల నిర్వహణ ఫైళ్లను తనిఖీ చేసి అధికారులకు పలు సూచనలు చేశారు. పిర్యాదులు, కేసులు పెండింగ్ ఉంచకుండా త్వరితగతిన పూర్తి చేయాలి, కోర్టులతో సమన్వయంగా పని చేసి ఎక్కువ కేసుల్లో శిక్షలు అమలయ్యేలా కృషి చేయాలని అన్నారు. బాధితులకు రక్షణ, భద్రత కల్పించడం ప్రాథమిక విధి, బాధ్యత అన్నారు. సిబంది విధులను పర్యవేక్షణ చేయాలి సమర్థవంతంగా పని చేసేలా నైపుణ్యాలను వృద్ధి చేయాలను అన్నారు. జిల్లా కేంద్రంలో అప్రమత్తంగా ఉంటూ నేరాలను పటిష్టంగా నిరోధించాలని అన్నారు,

**20 సీసీ కెమెరాల ప్రారంభం**

ప్రజల రక్షణ మరియు ట్రాఫిక్ నియంత్రణను మరింత బలోపేతం చేయడంలో భాగంగా పట్టణ కేంద్రంలో కొత్తగా ఏర్పాటు చేసిన మరో 20 సీసీ కెమెరాలను ఎస్పీ ప్రారంభించారు. వీటిని తక్షణమే కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ నరసింహ మాట్లాడుతూ సూర్యాపేట జిల్లా కేంద్రాన్ని అత్యంత సురక్షిత పట్టణంగా మార్చడమే మా ప్రాధాన్యత. ముఖ్యంగా మహిళల, విద్యార్థినుల భద్రతకు మేము అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నాము. మహిళలను వేధించే వారిపై, ఆకతాయిలపై కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రస్తుతం పాఠశాలలు, విద్యాసంస్థలు ప్రారంభమైనందున, విద్యార్థినుల భద్రత పట్ల అవగాహన కల్పించేందుకు విద్యాసంస్థల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాము.పోలీస్ సేవలను ప్రజలకు మరింత సులభతరం చేసేందుకు సరికొత్త విధానాన్ని అమలు చేస్తున్నాం. ప్రజల నుండి ఏదైనా ఫిర్యాదు అందిన వెంటనే పోలీసులు నేరుగా బాధితుల ఇళ్లకు వెళ్లి ఫిర్యాదులను స్వీకరిస్తున్నారు. అక్కడికక్కడే కేసులు నమోదు చేసి తక్షణ సహాయం అందిస్తున్నాం. దీనివల్ల బాధితులు పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా, వారి ఇంటి వద్దకే పోలీసు సేవలను చేరవేస్తున్నాం." ప్రజలకు ఇబ్బందులు కలిగించే రౌడీషీటర్లు, భూకబ్జాదారులు, చట్టవ్యతిరేక పనులకు పాల్పడే వారిపై పూర్తిస్థాయి నిఘా ఉంచుతాం. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవు. అలాగే పట్టణంలో ట్రాఫిక్ సమస్యల నివారణకు ప్రత్యేక నివారణ ప్రణాళికను సిద్ధం చేసి అమలు చేస్తున్నాం. ఈ వార్షిక తనిఖీ కార్యక్రమంలో డీఎస్పీ ప్రసన్నకుమార్, పట్టణ ఇన్స్పెక్టర్ వెంకటయ్య, డిసిఆర్బి ఇన్స్పెక్టర్ మగ్దూం అలీ, ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం, ఎస్సైలు ఏడుకొండలు, మహేందర్ నాథ్,శివతేజ, సందీప్, వెంకన్న, రహిముద్దీన్, ఏఎస్సై శంకర్, స్టోర్ ఆర్ఎస్ఐ అఖిల్, డిసిఆర్బి ఎస్ఐ యాకూబ్, ఏఎస్ఐ అంజన్ రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ శేఖర్ రెడ్డి, సీసీ సందీప్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రీన్ భద్రాద్రి నూతన కార్యవర్గం ఘనంగా ఎన్నిక

### భద్రాచలాన్ని హరితవనంగా తీర్చిదిద్దడమే లక్ష్యం



భద్రాచలం టౌన్ జూన్ 20(విజన్ ఆంధ్ర) పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా పనిచేస్తున్న గ్రీన్ భద్రాద్రి సంస్థ 14వ నూతన కార్యవర్గాన్ని ఘనంగా ఎన్నుకుంది. నూతన అధ్యక్షుడిగా ఆర్. రామకృష్ణారెడ్డి, కార్యదర్శిగా భుక్యా రంజిత్ నాయక్, కోశాధికారిగా ఉప్పాడ రాంప్రసాద్ రెడ్డి ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా డాక్టర్ కృష్ణ ప్రసాద్, వీరయ్య, మహిళా విభాగం జాయింట్ కార్యదర్శిగా లక్ష్మీ సావిత్రి, పీఆర్ఓగా సంపత్, లీగల్ అడ్వైజర్‌గా రామరాజు తిరుమలరావు బాధ్యతలు స్వీకరించారు. హార్టికల్చర్ అడ్వైజర్లుగా లయన్స్ డాక్టర్ గొల్ల భూపతిరావు, కామిశెట్టి కృష్ణ (పార్క్ కృష్ణ) నియమితులయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు హాజరై మాట్లాడుతూ, భద్రాచలం పుణ్యక్షేత్రం మాత్రమే కాకుండా పచ్చదనానికి ప్రతీకగా నిలవాలని ఆకాంక్షించారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, మొక్కలు నాటడం ద్వారా భావితరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించవచ్చని తెలిపారు. పట్టణ ప్రముఖులు యోగి సూర్యనారాయణ మాట్లాడుతూ గ్రీన్ భద్రాద్రి సంస్థ సమాజ సేవతో పాటు పర్యావరణ పరిరక్షణలో చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. మొక్కలు నాటడమే కాకుండా వాటి సంరక్షణ కూడా అంతే ముఖ్యమని పేర్కొన్నారు. భగవాన్ స్వీట్స్ అధినేత శంకర్ మాట్లాడుతూ భద్రాచలం వంటి పవిత్ర క్షేత్రంలో పచ్చదనాన్ని పెంపొందించేందుకు సంస్థ చేపడుతున్న కార్యక్రమాలు ఆదర్శప్రాయమని కొనియాడారు. అనంతరం నూతన అధ్యక్షుడు ఆర్. రామకృష్ణారెడ్డి, కార్యదర్శి భుక్యా రంజిత్ నాయక్, కోశాధికారి ఉప్పాడ రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ 2026 27 సంవత్సరంలో భారీ ఎత్తున వృక్షారోపణ కార్యక్రమాలు చేపట్టి భద్రాచలాన్ని మరింత హరితవనంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమం ముగింపులో నూతన కార్యవర్గ సభ్యులను శాలువాలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టి గ్రీన్ భద్రాద్రిని ప్రజలకు మరింత చేరువ చేస్తామని సభ్యులు వెల్లడించారు.

## ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు



మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూన్ 19,(విజన్ ఆంధ్ర)మంచిర్యాల శాసన సభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, మాజీ జిల్లా అధ్యక్షురాలు సురేఖ ఆదేశాల మేరకు శుక్రవారం ఎమ్మెల్యే నివాసంలో మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి, మిఠాయిలు పంచారు.అనంతరం దేవాపూర్ ఆదాని సిమెంట్ కంపెనీ యూనియన్ అధ్యక్షులు కొక్కిరాల సత్యపాల్ రావు మాట్లాడుతూ దేశానికి రాహుల్ గాంధీ లాంటి నాయకత్వం వహించే నాయకుడు కావాలని అన్నారు. ఈ కార్యక్రమం లో మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్, మంచిర్యాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తూముల నరేష్,వివిధ డివిజన్ ల కార్పొరేటర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు,ఎన్ ఎస్ యు ఐ నాయకులు , యూత్ కాంగ్రెస్ నాయకులు , కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణలో తొలిసారిగా పబ్లిక్ పాలసీతో ఐఏఎస్ కోచింగ్

### అరోరా యూనివర్సిటీతక్షశిలా ఐఏఎస్ అకాడమీ మధ్య అవగాహన ఒప్పందం



బోడుప్పల్,జూన్ 19(విజన్ ఆంధ్ర ప్రతినిధి) : సివిల్ సర్వీసెస్‌తో పాటు ఇతర పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు ఉపయోగపడేలా అరోరా యూనివర్సిటీ, తక్షశిలా ఐఏఎస్ అకాడమీ సంయుక్తంగా వినూత్న విద్యా కార్యక్రమాన్ని ప్రారంభించాయి. ఈ మేరకు ఇరు సంస్థలు అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఈ ఒప్పందం ద్వారా తెలంగాణలోనే తొలిసారిగా బీఏ పబ్లిక్ పాలసీ (ఆనర్స్), ఎంఏ పబ్లిక్ పాలసీ కోర్సులను సివిల్ సర్వీసెస్ కోచింగ్‌తో అనుసంధానం చేస్తూ అందుబాటులోకి తీసుకువచ్చారు. ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులతో పాటు డిగ్రీ పూర్తి చేసిన వారు కూడా ఈ కోర్సుల్లో చేరి ఉన్నత విద్యతో పాటు పోటీ పరీక్షలకు సమాంతరంగా సిద్ధమయ్యే అవకాశం కల్పించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకుతక్షశిలా ఐఏఎస్ అకాడమీ డైరెక్టర్ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ సాధారణంగా సివిల్స్ కోచింగ్ కోసం విద్యార్థులు డిగ్రీ అనంతరం ప్రత్యేకంగా సమయం కేటాయించాల్సి వస్తుందని, దీంతో కెరీర్‌లో గ్యాప్ ఇయర్స్ వచ్చే అవకాశం ఉంటుందని అన్నారు. అయితే ఈ ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్ ద్వారా విద్యార్థులు చదువుతో పాటే కోచింగ్ పొందగలరని, సమయాన్ని సమర్థవంతంగా వినియోగించుకొని పోటీ పరీక్షలకు మెరుగ్గా సిద్ధమయ్యే అవకాశం ఉంటుందని తెలిపారు. అనంతరం అరోరా యూనివర్సిటీ ప్రతినిధులు మాట్లాడుతూ.. నూతన విద్యా విధానం (ఎన్ఈపీ) ప్రకారం ఆధునిక బోధనా పద్ధతులను అమలు చేస్తున్నామని చెప్పారు. ప్రతి విద్యా సంవత్సరాన్ని నాలుగు టర్మ్‌లుగా విభజించి, నాలుగో టర్మ్‌లో విద్యార్థులకు తప్పనిసరిగా ఇంటర్న్‌షిప్ అవకాశం కల్పిస్తున్నామని వివరించారు. ఈ విధానం ద్వారా విద్యార్థుల నైపుణ్యాలు, విషయ పరిజ్ఞానం మరింత మెరుగుపడతాయని పేర్కొన్నారు. అరోరా యూనివర్సిటీ అందిస్తున్న అంతర్జాతీయ స్థాయి విద్యా సదుపాయాలు, తక్షశిలా ఐఏఎస్ అకాడమీ అందిస్తున్న నాణ్యమైన కోచింగ్ కలయిక విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. భవిష్యత్తులో ఈ కార్యక్రమం ద్వారా మరిన్ని ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు రాష్ట్రానికి అందించాలని ఆకాంక్షించారు. కోర్సుల అడ్మిషన్లు ప్రారంభమైనట్లు పేర్కొంటూ, ఆసక్తి గల విద్యార్థులు 9030088698, 9030088689, 910012345 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

## ఇందిరమ్మ ఇళ్ల పనులు వేగవంతం చేయాలి

### -కలెక్టర్ చిత్రా మిశ్రా



కరీంనగర్ (విజన్ ఆంధ్ర బ్యూరో) జూన్ 19. లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తూ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ చిత్రా మిశ్రా .. గృహ నిర్మాణ శాఖ అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో 25వ డివిజన్ పరిధి సుభాష్ నగర్ ఏరియా బుట్టి రాజారాం కాలనీలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను కలెక్టర్.. డిఆర్ఓ స్వామి, గృహ నిర్మాణ శాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. ఇల్లు మంజూరై పనులు ప్రారంభించని లబ్ధిదారులకు అవగాహన కల్పించి ఇళ్ల నిర్మాణం ప్రారంభించేలా చూడాలన్నారు. జిల్లాలో బిల్లులు జమ కాని లబ్ధిదారుల వివరాలతో నివేదిక అందించాలని అధికారులను ఆదేశించారు. ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ఇళ్ల నిర్మాణం పరిశీలించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ స్వామి, గృహ నిర్మాణ శాఖ అధికారులు డీఈ వెంకటరమణ, ఏఈలు ఊర్మిళ, వర్షిని తదితరులు పాల్గొన్నారు.

## రాహుల్ గాంధీ దేశ ప్రధాని కావాల్సిన అవసరం ఎంతైనా ఉంది



సంగారెడ్డి బ్యూరో, జూన్ :19(విజన్ ఆంధ్ర)ఉమ్మడి రాష్ట్ర ప్రజలతో పాటు, దేశ ప్రజలు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలి రాహుల్ గాంధీ దేశ ప్రధాని కావాల్సిన అవసరం ఎంతైనా ఉంది అని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు. శుక్రవారం నాడు సంగారెడ్డిలో జగ్గారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు జరిగాయి. సందర్భంగా 350 మంది చిన్నారులకు సైకిళ్లు ఆయన పంపిణీ చేసిన చేశారు. 200 కేజీల భారీ కేక్ ని చిన్నారులతో కలిసి కట్ చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ బిహెచ్ యల్, బి డి యల్, ఓ డి ఎఫ్,ఇక్రిశాట్, ఐఐటీ హైదరాబాద్ లాంటి కేంద్ర సంస్థలు సంగారెడ్డి జిల్లాకి కాంగ్రెస్ పార్టీ ఇచ్చిందని తెలిపారు. బీజేపీ మాత్రం ఉన్న కేంద్ర రంగ సంస్థలని ప్రయివేటీకరణ చేస్తుందని విమర్శించారు. బీజేపీ నేతలు నెహ్రు పాలనని బ్రేక్ చేశామని సంబరాలు చేస్తున్నారురాహుల్ గాంధీ తల్లి, తండ్రి, తాత, నానమ్మ, ముత్తాత దేశం కోసం ఎం చేశారో నేను చెబుతా మరి 12 ఏళ్ల ప్రధాని మోడీ పాలనలో ఏం చేశారో సమాధానం చెబుతారా అని సవాల్ విసిరారు. ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాల పేరుతో ప్రధాని మోడీ యువతకి 24 కోట్ల ఉద్యోగాలు బాకీ ఉన్నారు. బీజేపీ నేతలు దేవుళ్లపైనే కుట్రలు చేస్తున్నారు ఇతర పార్టీలకు దేవుళ్ళతో సంబంధాన్ని వీడదీశారు ఇది బి జె పి ప్రభుత్వం చేస్తుందని వర్ణించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, తోపాజి కిషన్, కూన సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరస్తుడిని అరెస్టు చేసిన ఖమ్మం సైబర్ క్రైమ్ పోలీసులు



ఖమ్మం జిల్లా బ్యూరో, జూన్ 19 (విజన్ ఆంధ్ర) : ట్రైనింగ్ పేరుతో పదిలక్షలు కాజేసిన సైబర్ కేటుగాన్ని ఖమ్మం సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. ఆన్లైన్ లో నకిలీ పత్రాలు మరియు నకిలీ ఎమ్ఓయూ పేరుతో విద్యార్థులకు ట్రైనింగ్స్ ఇస్తామని నమ్మించి, 10 లక్షల రూపాయలు మోసం చేసిన కేసులో ఒకరిని ఖమ్మం సైబర్ క్రైమ్ పోలీసులు హైదరాబాద్ లో అరెస్టు చేసినట్లు పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఒక ప్రకటనలో తెలిపారు. కేసు వివరాలలోకి వెళితే ఖమ్మం జిల్లాకు చెందిన ప్రముఖ విధ్య సంస్థ కి వాట్సాప్ లో ఐఐటీ హైదరాబాద్ ప్రొఫెసర్ అని పరిచయం చేసుకొని, మీ కళాశాల విద్యార్థులకు ట్రైనింగ్స్ నిర్వహిస్తామని చెప్పి , నకిలీ డాక్యుమెంట్స్, నకిలీ ఎమ్ఓయూ లను ఆన్లైన్ లో పంపించి , 10 లక్షలు రూపాయలు మోసశీ చేసిన కేసులో నిందితుడు అక్కౌంట్ హోల్డర్ అయిన డి.రవి కిరణ్ (26)ను హైదరాబాద్ లో అరెస్టు చేసి ఖమ్మం సైబర్ క్రైం కోర్టులో హాజరు పరిచి, రిమాండ్ కి తరలించినట్లు తెలిపారు. ఇంకా కేసు దర్యాప్తు కొనసాగుతున్నట్లు తెలిపారు. ఈ కేసు విచారణలో ముఖ్య పాత్ర వహించిన సైబర్ క్రైమ్ డిఎస్పీ ఫణిందర్, సిఐ భూక్యా రవి కుమార్, ఎస్సై లు రశీజిత్ కుమార్ , విజయకుమార్, కానిస్టేబుల్ కృష్ణ రావు ,నాగేశ్వరావు, సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ సిబ్బందిని పోలీస్ కమిషనర్ అభినందించారు.

## మలేషియాలో మంత్రి నారాయణ పర్యటన


### ఘన వ్యర్థాల నిర్వహణపై మంత్రి పరిశీలన

అమరావతి,జూన్19 మలేషియాలో ఏపీ మంత్రి నారాయణ పర్యటన రెండో రోజు కొనసాగుతోంది. మలేషియాలో ఘన వ్యర్థాల నిర్వహణ, తక్కువ ధరలో ఇళ్ల నిర్మాణం వంటి ప్రాజెక్టుల్లో అమలు చేస్తున్న అత్యుత్తమ పద్ధతులను మంత్రి అధ్యయనం చేస్తున్నారు. సెలాంగోర్ రాష్ట్రంలోని బుకిత్ తగర్ ఎన్విరో పార్క్‌ను సందర్శించారు. మలేషియాలో అతిపెద్ద శానిటరీ ల్యాండ్ ఫీల్లింగ్ ప్రాంతంగా బుకిత్ తగర్ పేరొందింది. ఘన వ్యర్థాలను పర్యావరణానికి హాని లేకుండా శాస్త్రీయ పద్ధతిలో పూడ్చిపెట్టే విధానాన్ని మంత్రి అధ్యయనం చేశారు. భూమి, నీరు కలుషితం కాకుండా వ్యర్థాల నిర్వహణ ఏ విధంగా చేస్తున్నారో మంత్రికి అధికారులు వివరించారు. బెర్జయ గ్రూప్ నిర్మిస్తున్న హౌసింగ్ ప్రాజెక్టులను పరిశీలించనున్నారు.

## రామవరంలో చెత్త సేకరణకు ప్రత్యేక వాహనం

**ఆవుల సమస్య పరిష్కరించాలి**

**మేయర్‌కు కార్పొరేటర్ ఆకునూరి సుప్రియ వినతి**



కొత్తగూడెం బ్యూరో, జూన్ 20(విజన్ ఆంధ్ర)రామవరం పరిధిలోని 15వ డివిజన్‌లో నెలకొన్న పలు ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మూడు గణేష్‌కు 15వ డివిజన్ కార్పొరేటర్ ఆకునూరి సుప్రియ శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ రామవరం పరిధిలోని ఆరు డివిజన్లలో కలిపి వందకు పైగా వ్యాపార దుకాణాలు ఉన్నాయని, ముఖ్యంగా 15వ డివిజన్‌లోని హైవే రహదారి మరియు లోపలి మార్కెట్ ప్రాంతంలో అధిక సంఖ్యలో షాపులు కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రత్యేక చెత్త సేకరణ వాహనం అవసరంప్రస్తుతం ఈ ప్రాంతంలోని వ్యాపార దుకాణాల నుండి చెత్త సేకరణకు ప్రత్యేక వాహనం లేకపోవడంతో నివాస ప్రాంతాల కోసం కేటాయించిన స్వచ్ఛ ఆటో సేవలపైనే ఆధారపడాల్సి వస్తోందని పేర్కొన్నారు. దీని కారణంగా షాపులు, ఇళ్ల నుండి చెత్త సేకరణ సమర్థవంతంగా జరగడం లేదని తెలిపారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు వెంటనే ప్రత్యేక ట్రాక్టర్ లేదా ప్రత్యామ్నాయ చెత్త సేకరణ వాహనాన్ని కేటాయించాలని మేయర్‌ను కోరారు. రోడ్లపై తిరుగుతున్న ఆవులతో ప్రజలకు ఇబ్బందులు15వ డివిజన్‌లో రోడ్లపై తిరుగుతున్న ఆవుల సమస్య రోజురోజుకూ పెరుగుతోందని, దీని వల్ల ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మేయర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమస్యపై కూడా తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రామవరం ప్రజలు, వ్యాపారుల ఇబ్బందులను పరిగణనలోకి తీసుకుని మేయర్ సానుకూలంగా స్పందించి త్వరలోనే తగిన చర్యలు చేపడతారని కార్పొరేటర్ ఆకునూరి సుప్రియ ఆశాభావం వ్యక్తం చేశారు.

# ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావాన్ని అలవర్చుకోవాలి

**– ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి**



సూర్యాపేట జూన్ 19:(విజన్ ఆంధ్ర)దాతల సహకారంతో పూజారి కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆలయాల్లో భక్తుల్లో భక్తి భావాన్ని పెంపొందించడంలో పేట ఆలయాల కృషి అభినందనీయమని ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు గుడిపాటి నర్సయ్య,మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత అన్నారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని శబరి నగర్ లోని శ్రీ సాయి సేవా సమితి ట్రస్ట్ శ్రీ సాయి బాబా మందిరం లో శ్రీ షిరిడి సాయినాథ స్వామి 25వ (పంచవింశతి) వార్షిక మహోత్సవాలలో భాగంగా గత నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న పూజారి కార్యక్రమాల్లో శుక్రవారం చండీ హోమం, రుద్ర హోమం, పంచసూక్త హోమ కార్యక్రమాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి మాట్లాడారు. సూర్యాపేట పట్టణం ఆధ్యాత్మికతకు పెట్టింది పేరు అన్నారు.దాతల సహకారంతో ఆలయాల్లో ఉత్సవాలు నిర్వహిస్తూ ప్రజలు సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని హోమాలు తదితర కార్యక్రమాలు నిర్వహించడం సంతోషకరమన్నారు.ప్రజలు ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. సాయిబాబా ఆలయంలో 25వ వార్షిక ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్న ఉత్సవ కమిటీని ఆయన అభినందించారు. ఆలయాల్లో నిర్వహించే కార్యక్రమాలకు తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. అనంతరం రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి గారిని వేద బ్రాహ్మణులు సామూహిక ఆశీర్వాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సాయి బాబా దేవాలయ కమిటీ అధ్యక్షుడు కర్నాటి రవి, మున్సిపల్ కౌన్సిలర్ కొనతం రాజేష్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్దుల్ రహీం, మున్సిపల్ కౌన్సిలర్లు గుణగంటి హేమ సతీష్, చిలుముల సునీల్ రెడ్డి, నిమ్మల కీర్తి లవన్, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు, మాజీ కౌన్సిలర్ ఎలిమినేటి అభినయ్ నాయుడు, శ్రీ దండు మైసమ్మ దేవస్థానం తంగేళ్ల కరుణాకర్ రెడ్డి, శ్రీ లింగమంతుల దేవస్థానం చైర్మన్, మాజీ కౌన్సిలర్ పోలేబోయిన నర్సయ్య యాదవ్,మొరిశెట్టి లక్ష్మి,జిల్లా కాంగ్రెస్ సేవదల్ అధ్యక్షుడు ఆలేటి మాణిక్యం, పట్టణ కాంగ్రెస్ ఓబీసీ అధ్యక్షుడు రావుల రాంబాబు, తుంగతుర్తి నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు కోరుకొప్పుల నరేష్, జిల్లా కాంగ్రెస్ నాయకులు నాగెల్లి అరుణ్ కుమార్, వెన్న మధుకర్ రెడ్డి, నాగు నాయక్, పడిదల రవి, జమండ్ల సత్యనారాయణ రెడ్డి, రాచకొండ శ్రీనివాస్, నాగరాజు, రాజబాబు, లేళ్ల సంపత్, మిద్దె జనార్దన్, శాంతయ్య, తదితరులు పాల్గొన్నారు.

# ఆలయ అభివృద్ధికి పెద్దన్నగా కొత్త కిషోర్ గౌడ్

**రూ.2 లక్షలతో గ్రానైట్, మార్బుల్స్ ఏర్పాటు..**

**భక్తుల ప్రశంసలు అందుకున్న మాజీ డిప్యూటి మేయర్ కుటుంబ సభ్యులు**



బోడుప్పల్,జూన్ 19( విజన్ ఆంధ్ర):బోడుప్పల్ సర్కిల్ ఇందిరానగర్ కాలనీలో నిర్మాణంలో ఉన్న శ్రీశ్రీశ్రీ చిత్తారమ్మ పోచమ్మ ఆలయం అభివృద్ధికి మాజీ డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిషోర్ గౌడ్ అందించిన సహకారం స్థానికుల ప్రశంసలు అందుకుంటోంది. ఆలయ నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్న తరుణంలో ఆయన తనవంతు బాధ్యతగా రూ.2 లక్షల వ్యయంతో ఆలయ ప్రాంగణంలో గ్రానైట్, మార్బుల్స్ వేయించి భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించారు.ఆలయ కమిటీ చైర్మన్ జెనిగే వెంకటేష్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కిషోర్ గౌడ్, ఆధ్యాత్మిక కేంద్రాల అభివృద్ధి సమాజంలో ఐక్యతను పెంపొందిస్తుందని పేర్కొన్నారు. అమ్మవారి కృపతో బోడుప్పల్ ప్రాంత ప్రజలు సుఖసంతోషాలతో, శాంతి భద్రతలతో జీవించాలని ఆకాంక్షించారు. ప్రజా సేవతో పాటు ధార్మిక కార్యక్రమాల్లోనూ ముందుండే కిషోర్ గౌడ్, గతంలో కూడా పలు సామాజిక సేవా కార్యక్రమాలకు చేయూతనందించిన విషయం తెలిసిందే. ఇప్పుడు ఆలయ నిర్మాణానికి అందించిన ఆర్థిక సహకారం స్థానిక భక్తుల్లో ఆనందాన్ని నింపింది. ఆలయ అభివృద్ధికి ఆయన అందిస్తున్న సహకారం ఆదర్శప్రాయమని కాలనీ వాసులు, భక్తులు కొనియాడుతున్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తోటకూరి రవీందర్ యాదవ్ రేణుక, మేడ్చల్ జిల్లా బిజెపి పార్టీ రూరల్ ప్రదాన కార్యదర్శి గోనె శ్రీనివాస్,మాజీ కోఆప్షన్ సభ్యులు బత్తుల సుగుణసత్యనారాయణ యాదవ్, వివిధ పార్టీల నాయకులు, ఇందిరానగర్ నగర్ కాలనీ, జ్యోతి నగర్ కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# నల్లగొండ జిల్లాలో ఘోర ప్రమాదం

**పరసస్రం ఢీకొన్న రెండు కార్లు...**

**ముగ్గురు మృతి .మృతుల్లో తండ్రీ కొడుకులు**

నల్లగొండ,జూన్19 నల్లగొండ జిల్లాలోని పెద్దవూర మండలం రామన్నగూడెం వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. రెండు కార్లు పరస్పరం ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. మృతుల్లో తండ్రీకొడుకులతో పాటు మరొకరు ఉన్నారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అలాగే గాయపడిన వారిని చికిత్స నిమిత్తం నాగార్జునసాగర్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతిచెందిన తండ్రీకొడుకులు పల్నాడు జిల్లా ముప్పల్ మండలం కాకర్లపాలెం గ్రామానికి చెందిన కాకర్ల థామస్య(51), ప్రకాష్ రావు (35)గా గుర్తించారు. మరోవ్యక్తి వరంగల్ ఎస్ఎల్బీసీ సైట్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న సాయికుమార్(20)గా పోలీసులు తెలిపారు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ముగ్గురి మృతితో వారి కుటుంబాల్లో విషాదఛాయలు అలముకున్నాయి.

# షీ టీమ్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం నిర్వహణ



కొత్తగూడెం బ్యూరో జూన్ 20( విజన్ ఆంధ్ర)కొత్తగూడెం పట్టణంలోని మెదరబస్తీ పాఠశాలలో శుక్రవారం షీ టీమ్ ఆధ్వర్యంలో మహిళలు, బాలికల భద్రత మరియు నేరాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డయల్ ▪ 112 అత్యవసర సేవలు, టీ ▪ సేఫ్ యాప్ వినియోగం, మహిళలు మరియు అమ్మాయిలపై జరిగే నేరాల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు.ఈ సందర్భంగా షీ టీమ్ ఎస్ఐ లక్ష్మణ్ మాట్లాడుతూ, అమ్మాయిలు సమాజంలో జరుగుతున్న నేరాలపై అవగాహన కలిగి ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏదైనా సమస్య ఎదురైన వెంటనే పోలీసులను సంప్రదించాలని తెలిపారు.డయల్ ▪ 112 ద్వారా పోలీస్, ఫైర్, అంబులెన్స్‌తో పాటు మహిళలు మరియు చిన్నారులకు సంబంధించిన అత్యవసర సేవలను పొందవచ్చని వివరించారు. ప్రజలు ఈ సేవలను అవసరమైన సందర్భాల్లో వినియోగించుకోవాలని సూచించారు.అలాగే టీ ▪ సేఫ్ యాప్ ద్వారా ప్రయాణాన్ని మరింత సురక్షితంగా ఉంచుకోవచ్చని, ఈ యాప్ ద్వారా ప్రయాణ వివరాలను పోలీస్ పర్యవేక్షించగలరని తెలిపారు.మహిళలు, అమ్మాయిలు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొన్నా నిర్భయంగా షీ టీమ్‌ను సంప్రదించాలని, 8712682121 నంబర్‌కు కాల్ చేయవచ్చని తెలిపారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని చెప్పారు.ఈ కార్యక్రమంలో షీ టీమ్ ఏఎస్ఐ నాగయ్య, కానిస్టేబుల్ రాంబాబు, పాఠశాల సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# అంగన్వాడి ఆధ్వర్యంలో 'అమ్మ మాట'

**- డి డబ్ల్యూ ఓ. మల్లేశ్వరి**



భూపాలపల్లి జిల్లా 19 జూన్ (విజన్ ఆంధ్ర) భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని సుభాష్ కాలనీలో అంగన్వాడి ఆధ్వర్యంలో "అమ్మ మాట" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. చిన్నారుల ఆరోగ్యం, పోషకాహారంపై అవగాహన కల్పించే లక్ష్యంతో చేపట్టిన ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొని తల్లులకు సూచనలు చేశారు. భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని సుభాష్ కాలనీలో శుక్రవారం ఐసీడీఎస్ సూపర్వైజర్ రజిత ఆధ్వర్యంలో "అమ్మ మాట" కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి డీడబ్ల్యూఓ మల్లీశ్వరి, స్థానిక కౌన్సిలర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మల్లీశ్వరి మాట్లాడుతూ ప్రతి తల్లి "అమ్మ పొడి ▪ అమ్మ మాట" కార్యక్రమం సూచనలను పాటించి పిల్లల ఆరోగ్యం, పోషకాహారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు వసంత,సుజాత,సరూప, రమతో పాటు పలువురు తల్లులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

**–చెట్ల పెంపకాన్ని ఉద్యమంలా కొనసాగించాలి**

**కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్**



కామారెడ్డి బ్యూరో జూన్ 19(విజన్ఆంధ్ర)పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించేందుకు చెట్ల పెంపకాన్ని ఉద్యమంలా కొనసాగించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు.గురువారం వనమహోత్సవం2026 కార్యక్రమంలో భాగంగా కామారెడ్డి పట్టణంలోని ఆర్టీఓ కార్యాలయం సమీపంలో ఉన్న నర్సనపల్లి అటవీ సముదాయంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్మించిన భవనాన్ని కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం మొక్కలు నాటి వనమహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో చెట్ల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. వాతావరణ మార్పులు, పెరుగుతున్న కాలుష్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. ప్రభుత్వం చేపడుతున్న హరిత కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకుని పచ్చదనాన్ని పెంపొందించేందుకు సహకరించాలని కోరారు.అటవీ సంపద సంరక్షణతో పాటు గ్రామాలు, పట్టణాల్లో విస్తృతంగా మొక్కలు నాటడం ద్వారా పర్యావరణాన్ని కాపాడవచ్చని పేర్కొన్నారు. ప్రతి వ్యక్తి కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షిస్తే సమాజానికి గొప్ప సేవ చేసిన వారవుతారని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా అటవీ అధికారి నీరజ్ కుమార్ టిబ్రెవాల్, ఐఎఫ్ఎస్, అటవీ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, ప్రకృతి ప్రేమికులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# డీలర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా: రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి



సూర్యాపేట జూన్ 19:(విజన్ ఆంధ్ర)రేషన్ డీలర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అన్నారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సూర్యాపేట జిల్లా నియోజకవర్గ డీలర్ల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.డీలర్లు పోలీసు శాఖ నుంచి ఎదుర్కొంటున్న ఇబ్బందులను సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం సన్నబియ్యం పంపిణీ ప్రారంభించిన తర్వాత ప్రజల్లో దానికి మంచి ఆదరణ పెరిగిందని, రేషన్ దుకాణాలకు వచ్చే లబ్ధిదారులు బియ్యం ఎప్పుడు వస్తుందంటూ తరచూ ఆరా తీస్తున్నారని తెలిపారు.పార్టీ అనుబంధాలు, రాజకీయ భేదాలు పక్కనపెట్టి అందరినీ సమానంగా చూడాలని తమ అభిప్రాయమని పేర్కొన్నారు.డీలర్లు ఐక్యంగా ఉండి ప్రతి నెల తమ సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తానని, ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని అన్నారు.రేషన్ బియ్యం తరుగులో ఎదురవుతున్న సమస్యలను అధిగమించేందుకు వెయ్‌బ్రిడ్జి ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు గుడిపాటి నరసయ్య, తిరుమల ప్రగడ అనురాధ కిషన్ రావు,తెలంగాణ రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్కే ఖాజా మోహినుద్దీన్, డివిజన్ అధ్యక్షుడు గార్లపాటి ఎల్లారెడ్డి, వివిధ మండలాలకు చెందిన డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్‌సిహెచ్‌పి, రుద్రంపూర్ సైడింగ్‌లలో బొగ్గు రవాణా ఏర్పాట్ల పరిశీలన



కొత్తగూడెం బ్యూరో జూన్ 20(విజన్ ఆంధ్ర)కొత్తగూడెం ఏరియాలో బొగ్గు రవాణా వ్యవస్థను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు చేపడుతున్న చర్యల్లో భాగంగాశుక్రవారం ఆర్‌సిహెచ్‌పి, రుద్రంపూర్ రైల్వే సైడింగ్‌లను బి. వెంకన్న, ఐ ఆర్ టి ఎస్ , ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (కోల్ మూవ్‌మెంట్) సందర్శించారు.సందర్శన సందర్భంగా ఆయన ఆర్‌సిహెచ్‌పి మరియు రుద్రంపూర్ రైల్వే సైడింగ్‌లలో బొగ్గు లోడింగ్ విధానం, రవాణా సదుపాయాలు, మౌలిక వసతులు, నిర్వహణ అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించి బొగ్గు రవాణా ప్రక్రియను మరింత వేగవంతంగా, సమర్థవంతంగా నిర్వహించేలా అవసరమైన సూచనలు చేశారు.అనంతరం కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయ ప్రాంగణంలో నిర్మించనున్న ఆలయానికి నిర్వహించిన భూమిపూజ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా బి. వెంకన్న మాట్లాడుతూ, కొత్తగూడెం ఏరియా జీఎం కార్యాలయ ప్రాంగణంలో ఆలయ నిర్మాణానికి నిర్వహించిన భూమిపూజ కార్యక్రమంలో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఉద్యోగుల్లో సానుకూల దృక్పథాన్ని పెంపొందించడమే కాకుండా ప్రశాంతమైన కార్యాలయ వాతావరణం ఏర్పడేందుకు దోహదపడతాయని పేర్కొన్నారు. నిర్మించనున్న ఆలయం ఉద్యోగులు, కార్మికులకు ఆధ్యాత్మిక చైతన్యం అందించి వారి మనోధైర్యాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం. షాలేం రాజు, ఎస్.ఓ టు జీఎం ఎం. గోవిందరావు, పర్సనల్‌మేనేజర్ ఎల్. తిరుపతి, ఏజీఎం (ఫైనాన్స్) బీభత్స, ఇన్‌చార్జ్ (హెచ్‌వోడీ) సివిల్ కె. రాజారాం, ఏరియా ఇంజనీర్ వి. రామకృష్ణ, సీనియర్ ఎస్టేట్ ఆఫీసర్ బి. తౌర్య, జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్ కె. శ్రీనివాస్, కార్మిక సంఘాల నాయకులు, అధికారులు, ఉద్యోగులు మరియు కార్మికులు పాల్గొన్నారు.

# ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

**–జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**





మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూన్ 19,(విజన్ ఆంధ్ర)విద్యావ్యవస్థ బలోపేతం దిశగా ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు, అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్ తో కలిసి విద్యార్థులకు ఏకరూప దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యాసంస్థల అభివృద్ధి దిశగా అనేక చర్యలు చేపడుతుందని తెలిపారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలో త్రాగునీరు, విద్యుత్, మూత్రశాలలు, ప్రహరీ గోడ, అదనపు గదులు ఇతర సౌకర్యాలు కల్పించడంతో పాటు మెనూ ప్రకారం పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ క్రమంలో విద్యా సంవత్సరం ప్రారంభమైనందున జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులకు నోటు పుస్తకాలు, పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తులను అందించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని కస్తూరిబా గాంధీ విద్యాలయాలలో అదనపు తరగతి గదులు, భోజనశాలల నిర్మాణ పనులను చేపట్టి విద్యార్థులకు సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని, విద్యాలయాలలో అధిక మొత్తంలో అడ్మిషన్లు కల్పించి నాణ్యమైన విద్య అందించడం జరుగుతుందని తెలిపారు. 200 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణం చేపట్టడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థుల సంఖ్య పెంపొందించడం జరుగుతుందని, విద్యాశాఖ అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని, ప్రభుత్వ పాఠశాలలలో కల్పిస్తున్న సౌకర్యాలను విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించి విద్యార్థులు పాఠశాలకు వచ్చే విధంగా కృషి చేయాలని తెలిపారు. నాణ్యమైన విద్య అందించడంలో మంచిర్యాల జిల్లా 3వ స్థానంలో ఉందని, అన్ని ప్రభుత్వ పాఠశాలలలో ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని, ఉన్నత విద్య అభ్యసించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం విద్యారంగంతో పాటు వైద్య రంగ అభివృద్ధి దిశగా చర్యలు తీసుకుంటుందని తెలిపారు. జిల్లాలో సామాజిక ఆరోగ్య కేంద్రాలు, ప్రాథమిక, ఉప ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ ఆసుపత్రులు, మాతా శిశు ఆసుపత్రి ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సంబంధిత అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లో కొనసాగుతున్న ఫుడ్ సేఫ్టీ దాడులు

**ప్రముఖ హోటళ్లలో కుళ్లిన చికెన్ గుర్తింపు**

**పలు రెస్టారెంట్లకు నోటీసులు జారీ**

హైదరాబాద్,జూన్19: నగరంలో ఫుడ్ సేఫ్టీ అధికారుల స్పెషల్ డ్రైవ్ కొనసాగుతోంది. హోటల్స్, రెస్టారెంట్లలో అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. 45 ప్రముఖ ఫుడ్ లే అవుట్లు, 8 పన్నీర్ తయారీ కేంద్రాలపై దాడులు చేశారు. మరో రెండు రోజులపాటు ఫుడ్ సేఫ్టీ, టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడులు కొనసాగనున్నాయి. ఈ దాడుల్లో రెస్టారెంట్లు, హోటల్స్ కిచెన్స్‌లో అధ్వానమైన పరిస్థితులు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. జూబ్లీహిల్స్, మాదాపూర్‌లోని ప్రముఖ రెస్టారెంట్లలో రోజుల తరబడి కుళ్లిన చికెన్, పన్నీర్ ఉన్నట్లు సోదాల్లో బయటపడింది. దీంతో దాదాపు 20 రెస్టారెంట్లకు అధికారులు పెనాల్టీలు, నోటీసులు జారీ చేశారు. బేగంబజార్, కాటేదాన్ ప్రాంతాల్లో పన్నీర్ తయారీ కేంద్రాలపై దాడులు చేయగా.. అక్కడి వాతావరణం చూసి అధికారులే షాక్‌కు గురయ్యారు. గంజి పొడి, జంతువుల కొవ్వు ఉపయోగించి పన్నీర్ తయారు చేస్తున్నట్లు గుర్తించారు. ఫుడ్ సేఫ్టీ, టాస్క్‌ఫోర్స్ అధికారుల నేతృత్వంలో తనిఖీలు కొనసాగుతున్నాయి. పాతబస్తీలో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లపై హెచ్ ఫాస్ట్ దాడులు నిర్వహించింది. వాడిన ఆయిల్‌ను పదేపదే వినియోగిస్తున్నట్లు గుర్తించారు. అత్యంత ప్రమాదకర రసాయనాలతో సాస్ తయారుచేసి విక్రయాలు జరుపుతున్నట్లు తేలింది.

# రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

**–డాక్టర్లు నిరంతరం పేషెంట్లకు అందుబాటులో ఉండాలి**

**–వేగవంతంగా జనరల్ హాస్పిటల్ నూతన భవన నిర్మాణ పనులు పూర్తి చేయాలి**

**–వైద్య సేవలు, అభివృద్ధి పనులపై సమీక్ష**

**జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**



సూర్యాపేట జూన్ 19:(విజన్ ఆంధ్ర)వైద్యులు నిరంతరం అందుబాటులో ఉండి హాస్పిటల్ కు వచ్చే రోగులకు మెరుగైన చికిత్స అందించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆదేశించారు. సూర్యాపేట జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని ఎమర్జెన్సీ వార్డులు, ఇన్–పేషెంట్ మరియు అవుట్–పేషెంట్ విభాగాలను ఆయన స్వయంగా పరిశీలించారు. వార్డులలోని రోగులతో కలెక్టర్ మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారుఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రావణ్, ఆర్ఎంఓ, వివిధ విభాగాల హెచ్.ఓ.డిలతో సమావేశమై, రోగులకు అందుతున్న వైద్య సేవలపై ప్రత్యేకంగా చర్చించారు. జనవరి నెల నుండి మే నెల వరకు ఆసుపత్రికి దాదాపు 1,12,000 కంటే ఎక్కువ మంది అవుట్–పేషెంట్లకు, అలాగే 25,000 పైగా ఇన్–పేషెంట్లకు వైద్య సేవలు అందించినట్లు కలెక్టర్ తెలిపారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ ప్రోగ్రాం కింద ఆసుపత్రిలో మోకాలి మార్పిడి, ఇతర ఆర్థోపెడిక్ శస్త్రచికిత్సలు విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. రేడియాలజీ, గైనకాలజీ విభాగాల సేవలను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని, ముఖ్యంగా ఇక్కడి మాత శిశు కేంద్రంలో గైనకాలజీ విభాగం ఆధ్వర్యంలో ప్రసవాల సంఖ్య పెరిగినట్లు వెల్లడించారు. ఆసుపత్రికి వచ్చే రోగులందరికీ ఉచితంగా నాణ్యమైన వైద్యంతో పాటు, మందులను కూడా అందిస్తున్నామని స్పష్టం చేశారు.క్యాన్సర్ రోగులకు అండగా పేలియేటివ్ కేర్, కీమోథెరపీక్యాన్సర్ బాధితుల కోసం ఆసుపత్రిలో ప్రత్యేకంగా యూనిట్‌ను ఏర్పాటు చేసి, వారికి కీమోథెరపీతో పాటు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రస్తుతం దాదాపు 58 మంది క్యాన్సర్ రోగులు ఈ సేవల ద్వారా లబ్ధి పొందుతున్నారని ఆయన వివరించారు.త్వరలోనే నూతన భవనాలు అందుబాటులోకి ఆసుపత్రి ఆధునీకరణలో భాగంగా నూతనంగా నిర్మించిన మాతా శిశు సంరక్షణ బ్లాక్ భవన నిర్మాణం పూర్తయిందని, దానికి సంబంధించిన మిగిలిన ఎక్విప్‌మెంట్, ఇతర పనులను త్వరలోనే పూర్తి చేసి వినియోగంలోకి తెస్తామని ప్రకటించారు. అలాగే దీని పక్కనే నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి నూతన ప్రధాన భవన పనులు కూడా చివరి దశకు చేరుకున్నాయని, వీటిని వేగవంతంగా, నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని మెడికల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డిపార్ట్‌మెంట్ ఇంజనీర్లను ఆదేశించినట్లు తెలిపారు.ఆసుపత్రికి వచ్చే ఇన్–పేషెంట్లకు వైద్యంతో పాటు నాణ్యమైన భోజనాన్ని అందించాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.కార్యక్రమం లో సూపరింటెండెంట్ శ్రవణ్ కుమార్, ఆర్ఎంఓలు జనార్దన్, గీతా వాణి, ప్రశాంతి, డాక్టర్స్ మనీషా, సతీష్, ఉపేందర్ సింగ్, మునిసిపల్ కమీషనర్ హనుమంత్ రెడ్డి,మెడికల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి

### -కలెక్టర్ ఇలా త్రిపాఠి



నిజామాబాద్, జూన్ 19 :( విజన్ ఆంధ్ర)ఓటరు జాబితాలో ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా సమగ్రంగా, పారదర్శకంగా రూపొందించేందుకు చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (రా×=) 2026 ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి సంబంధిత ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం పురోగతిని సమీక్షించారు. బూత్ లెవల్ ఆఫీసర్లు, బూత్ లెవల్ ఏజెంట్లకు ఈ నెల 24వ తేదీలోగా శిక్షణ కార్యక్రమాలను పూర్తి చేయాలని సూచించారు. కేంద్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం జూన్ 25వ తేదీ నుంచి బీఎల్ఓ లు తమ పోలింగ్ కేంద్రాల పరిధిలో ఇంటింటికి వెళ్లి ఎన్యుమరేషన్ ఫారాలను పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.అక్టోబర్ 1వ తేదీన తుది ఓటరు జాబితా ప్రచురించే వరకు ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకారం అన్ని కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌పై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేలా ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ, జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియను ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, షెడ్యూల్‌కు అనుగుణంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని సీ.ఈ.ఓ దృష్టికి తెచ్చారు. అన్ని స్థాయిల్లో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించినట్లు వెల్లడించారు. ఈఆర్‌వోలు, ఏఈఆర్‌వోలు, జిల్లా స్థాయిలో మూడు దశలలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించామని అన్నారు.బూత్ లెవల్ అధికారులకు శిక్షణ కార్యక్రమాలు పూర్తి చేశామని, ఇంటింటి సర్వే సందర్భంగా బి ఎల్ ఓ లు నిర్వర్తించాల్సిన విధులు, బాధ్యతలపై సమగ్ర అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువులోపు ఎస్ఐఆర్ ప్రక్రియను సజావుగా పూర్తి చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాలో ప్రీ మ్యాపింగ్ 87. శాతం పూర్తయ్యిందని తెలిపారు. 1565 పోలింగ్ కేంద్రాల పరిధిలో రాజకీయ పార్టీలు బీ.ఎల్.ఏ ల నియామకాలు పూర్తి చేశాయని, వారికి ఐ.డీ కార్డులు సమకూర్చాల్సిందిగా సూచించామని అన్నారు. కాగా, జిల్లాకు బీ ఎల్ ఓ కిట్లు కేటాయించాలని సీ.ఈ.ఓ ను కోరారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ భుజంగ రావు, ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్ర కుమార్, బోధన్ ఆర్డీఓ విజయలక్ష్మి, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు బాలరాజు, ఏఈఆర్ఓలు పాల్గొన్నారు.

## గాంధారి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎస్పీయం. రాజేష్ చంద్ర,




కామారెడ్డి బ్యూరో జున్ 19(విజన్ఆంధ్ర)కామారెడ్డి ఎస్పీ గాంధారి పోలీస్ స్టేషన్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.పోలీసింగ్ విధానాలను ఎప్పటికప్పుడు నవీకరించుకుంటూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సిబ్బందిని ఆదేశించారు.కేసుల దర్యాప్తులో నైపుణ్యాలు పెంపొందించుకుని నాణ్యమైన దర్యాప్తు చేపట్టాలని అన్నారు.ఆస్తి నేరాలు, రోడ్డు ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టి నేర నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.ప్రధాన కూడళ్లు, ప్రజా రద్దీ ప్రాంతాల్లో నిరంతరం విజిబుల్ పోలీసింగ్ నిర్వహించాలని ఆన్నారువర్షాకాల పరిస్థితుల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండి ప్రజల ప్రాణ, ఆస్తి భద్రతకు చర్యలు చేపట్టాలని,పేకాట, ఆన్‌లైన్ గేమింగ్, బెట్టింగ్ వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు.ఎస్పీ యం. రాజేష్ చంద్ర, గాంధారి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని రికార్డులు, పెండింగ్ కేసులు, నేరాల నియంత్రణ చర్యలు, సిబ్బంది పనితీరును సమీక్షించారు. అనంతరం పోలీసు అధికారులు, సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ, ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా పోలీసింగ్ విధానాలను ఎప్పటికప్పుడు నవీకరించుకుంటూ ప్రజలకు మరింత సమర్థవంతమైన సేవలు అందించాలని సూచించారు. కేసుల దర్యాప్తులో నైపుణ్యాలను పెంపొందించుకుని నాణ్యమైన దర్యాప్తు చేపట్టాలని, శాస్త్రీయ ఆధారాలతో నిందితులకు త్వరితగతిన శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఆస్తి నేరాలు, దొంగతనాలు, ఇతర నేరాల నియంత్రణకు ముందస్తు చర్యలు చేపట్టాలని, రాత్రి గస్తీని మరింత ముమ్మరం చేయాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుంటూ ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని తెలిపారు.ప్రజల్లో భద్రతా భావన పెంపొందించేందుకు ప్రధాన కూడళ్లు, రద్దీ ప్రాంతాలు, సున్నిత ప్రాంతాల్లో విజిబుల్ పోలీసింగ్‌ను నిరంతరం కొనసాగించాలని సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా నేరాల నివారణకు ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలని, గ్రామ పోలీస్ అధికారి వ్యవస్థను మరింత బలోపేతం చేసి సమాచార వ్యవస్థను పటిష్ఠం చేయాలని ఆదేశించారు.ప్రస్తుత వర్షాకాల పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, లోతట్టు ప్రాంతాలు, పొంగిపొర్లే వాగులు, వంకలు ప్రమాదకర ప్రాంతాల వద్ద ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజల ప్రాణ, ఆస్తి రక్షణ కోసం ఇతర ప్రభుత్వ శాఖలతో సమన్వయం చేసుకుంటూ పనిచేయాలని తెలిపారు. పేకాట, ఆన్‌లైన్ గేమింగ్, బెట్టింగ్ వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాలని, నిర్వాహకులు పాల్గొనే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే మాదకద్రవ్యాల నిర్మూలన, సైబర్ నేరాల నివారణ, సీసీ కెమెరాల ప్రాముఖ్యత, ట్రాఫిక్ నియమాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు.పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రజలు, ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, వారి సమస్యలను ఓర్పుతో విని చట్టబద్ధంగా పరిష్కరించాలని ఎస్పీ యం. రాజేష్ చంద్ర పోలీసు సిబ్బందికి సూచించారు.గాంధారి పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ సందర్భంగా ఎస్పీ యం. రాజేష్ చంద్ర, సదాశివనగర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి. సంతోష్ కుమార్ తదితరులు ఉన్నారు.

## వర్షాకాలం ఆకస్మిక వరదల సమయంలో ఎన్డీఆర్ఎఫ్ బృందం అప్రమత్తంగా ఉండాలి

### - జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



నిర్మల్ జిల్లా,జూన్ 19(విజన్ ఆంధ్ర);వర్షాకాలం ఆకస్మిక వరదలు సంభవిస్తే ప్రజలను సురక్షితంగా ఉంచేందుకు ఎన్డీఆర్ఎఫ్ (నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్) బృందాలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు. శుక్రవారం జిల్లాకు వచ్చిన ఎన్డీఆర్ఎఫ్ బృంద సభ్యులు కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వర్షాకాలం భారీ వర్షాలు కురిసి, వరదలు సంభవించి జిల్లా ప్రజలకు ఏవైనా ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడితే వారి సహాయం కొరకు ఎన్డీఆర్ఎఫ్ బృందం పనిచేయాలన్నారు. ఎన్డీఆర్ఎఫ్ బృందం మొత్తానికి అవసరమైన వసతి ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. వర్షాకాలం మొత్తం అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, డీఆర్ఓ రమేష్ రాథోడ్, ఆర్డిఓ దేవిదాస్ ఎన్డిఆర్ఎఫ్ ఇన్స్పెక్టర్ జిడి ముఖేష్ కుమార్, ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

## మైనారిటీ అభ్యర్థులకు 4 నెలల ఉచిత కోచింగ్

### రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ పోటీ పరీక్షలకు సన్నద్ధం చేసే శిక్షణ.. జూన్ 25 వరకు దరఖాస్తులకు అవకాశం

రాజన్న సిరిసిల్ల, జూన్ 19 (విజన్ ఆంధ్ర బ్యూరో):రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న మైనారిటీ అభ్యర్థుల కోసం తెలంగాణ మైనారిటీస్ స్టడీ సర్కిల్ అండ్ కెరీర్ కౌన్సెలింగ్ సెంటర్ ఆధ్వర్యంలో నాలుగు నెలల ఉచిత బేసిక్ ఫౌండేషన్ కోచింగ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి అయేషా తలత్ ఒక ప్రకటనలో తెలిపారు.ఈ కోచింగ్ ద్వారా ు+ూజ గ్రూప్ 1, గ్రూప్ 2, గ్రూప్ 3, గ్రూప్ 4, ఖూజ సివిల్ సర్వీసెస్, SSC`CGL, RRB అసిస్టెంట్ లోకో పైలట్, ==దీ టెక్నీషియన్, తెలంగాణ పోలీస్ నియామకాలు, ×దీూ తదితర రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ పోటీ పరీక్షలకు నిపుణుల ద్వారా శిక్షణ అందించనున్నట్లు పేర్కొన్నారు.ప్రత్యేకంగా ూజ-జ+ూ 2026 ద్వారా దేశవ్యాప్తంగా సుమారు 12,256 ఉద్యోగ ఖాళీల భర్తీకి అవకాశం ఉండటంతో ఈ కోచింగ్ అభ్యర్థులకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్, ఇన్‌కమ్ ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్, అసిస్టెంట్



ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్, సబ్ ఇన్‌స్పెక్టర్, ఆడిటర్, అకౌంటెంట్, ట్యాక్స్ అసిస్టెంట్, పోస్టల్ అసిస్టెంట్, జూనియర్ స్టాటిస్టికల్ ఆఫీసర్ తదితర ఉద్యోగాలకు ఈ పరీక్ష ద్వారా నియామకాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు.రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన ముస్లిం, క్రైస్తవ, సిక్కు, జైన్, పార్సీ, బౌద్ధ మైనారిటీ వర్గాలకు చెందిన డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు ఈ కోచింగ్‌కు అర్హులని తెలిపారు. మొత్తం 100 మంది అభ్యర్థులను మాత్రమే ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు.జూన్ 20 నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమవుతుందని, జూన్ 25 వరకు దరఖాస్తులు స్వీకరిస్తారని తెలిపారు. అదే రోజు నుంచి కోచింగ్ తరగతులు కూడా ప్రారంభం కానున్నాయని వెల్లడించారు.దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు ూజ, ఇంటర్మీడియట్, డిగ్రీ సర్టిఫికెట్ల జిరాక్స్ ప్రతులు, ఆధార్ కార్డు ప్రతితో పాటు రెండు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు సమర్పించాలని సూచించారు. దరఖాస్తులను తెలంగాణ మైనారిటీస్ స్టడీ సర్కిల్ అండ్ కెరీర్ కౌన్సెలింగ్ సెంటర్, ఇందిరా ప్రియదర్శిని డిగ్రీ కాలేజ్ ప్రాంగణం, ఎంఏఎం క్యాంపస్, గోషామహల్, నాంపల్లి, హైదరాబాద్లో సమర్పించవచ్చని తెలిపారు.మరిన్ని వివరాల కోసం 040-23236112, 9059050062 నంబర్లను సంప్రదించాలని సూచించారు. జిల్లాలోని అర్హులైన మైనారిటీ యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ప్రభుత్వ ఉద్యోగాల సాధనకు సన్నద్ధం కావాలని జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి అయేషా తలత్ కోరారు.

## రీసర్వే కు లైసెన్స్ సర్వేయర్ల సేవలు వినియోగించుకోవాలి

### భూ సంబంధ ఆర్జీలను పరిష్కరించాలి

### జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

గద్వాల జూన్ 19 (విజన్ ఆంధ్ర బ్యూరో)ప్రభుత్వం గ్రామాల్లోని సమగ్ర భూముల రీ సర్వేకు నిర్ణయించినందున అందుకు అవసరమైన లైసెన్స్ సర్వేయర్ల సేవలను వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు.శుక్రవారం సాయంత్రం ఐడిఓసి వీడియో కాన్ఫరెన్స్ హాల్లో జిల్లాలోని అన్ని మండలాల తహసిల్దార్లతో కలెక్టర్ సమావేశమై మాట్లాడారు. జిల్లాలో రీ సర్వేకు మొదటి దశలో 70 గ్రామాలు ఎంపిక అయ్యాయని, 150 మంది లైసెన్స్ సర్వేయర్ల సహకారంతో ఆయా గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి ప్రక్రియ మొదలు పెట్టాలన్నారు. అలాగే సాదా బైనామా, భూభారతి, తదితర భూ సంబంధ ఆర్జీలను పెండింగ్ లో ఉంచకుండా వచ్చేనెల 15వ తేదీలోగా పరిష్కరించాలని ఆదేశించారు. మండలాల వారీగా విపత్తు నిర్వహణ ప్లాన్ ను పక్కాగా తయారు చేసి అందజేయాలన్నారు. నేషనల్ ఫ్యామిలీ బెనిఫిట్స్ స్కీమ్ ను అర్హులైన వారందరూ సద్వినియోగం చేసుకునేలా అధికారులు కృషి చేయాలని ఈ



సందర్భంగా జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. గ్రామాల రీసర్వేకు సంబంధించి ఉదయం హైదరాబాదు నుంచి భూసేకరణ ముఖ్య కార్యదర్శి లోకేష్ కుమార్ అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ లో మాట్లాడారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి వీసీ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ విసి అనంతరం మొదటి దశలో జిల్లాలో 70 గ్రామాలు రీసర్వేకు ఎంపికైనందున అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని సర్వే డిప్యూటీ ఇన్స్పెక్టర్ గోవిందుకు సూచించారు.ఈ సమావేశంలో భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కృష్ణ, ఆర్డీవో శ్రీనివాసరావు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు మనోజ్ కుమార్ రెడ్డి, రాజ్ కుమార్, వివిధ మండలాల తహసిల్దార్ లు తదితరులు పాల్గొన్నారు.

## పేదోడి సొంతింటి కల కాంగ్రెస్ తో నే సహకారం

### -ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి

కొత్తకోట జూన్ 19 (విజన్ ఆంధ్ర): కొత్తకోట:: పేదోడి సొంతింటి కల కాంగ్రెస్ తోనే సహకారం చేస్తుందని ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి అన్నారు. కొత్తకోట పట్టణ కేంద్రంలోని ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశల్లో ఎమ్మెల్యే జిఎంఆర్ స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి ప్రారంభించి పట్టు వస్త్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ గత పాలకులు పేదలను పట్టించుకున్న పాపాన పోలేదని పదేళ్లలో నిరుపేదలకు డబుల్ బెడ్ రూమ్ పేరుతో విస్మరించిందన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందుతాయి



అన్నారు. అంతకుముందు బి పి ఆర్ గార్డెన్లో మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేసి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ ల కొరకు ప్రొసీడింగ్స్ అందజేసి. వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటి నీళ్ళు పోశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ పి.అరుణ శ్రీనివాసులు, మార్కెట్ యార్డ్ చైర్మన్ పి ప్రశాంత్, మున్సిపల్ కమిషనర్ సైదయ్య, మున్సిపల్ వైస్ పర్సన్ పి.పల్లవి కృష్ణారెడ్డి, డాక్టర్ పి జె బాబు, రావుల జితేందర్ నాథ్ రెడ్డి, రావుల కరుణాకర్ రెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు పెంటన్న యాదవ్, కౌన్సిలర్లు ఎన్ జే బోయెజ్, అబ్దుల్ నబీ, రవీందర్ రెడ్డి, మురళి యాదవ్, అఖిల ,భీమా చంద్రకాంత్, సంజీవుడు, సుధారాణి, అజ్మత్ కానం, నాయకులు ఎల్లంపల్లి నరేందర్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, చర్లపల్లి శేఖర్ రెడ్డి, నరేందర్ సాగర్, జెయం మిషేక్, సాయిల్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## ఖరీఫ్‌కి ముందే రైతుల నడ్డి విరుస్తున్న ధరలు

- జడ్చర్ల నియోజకవర్గ వ్యాప్తంగా ఎరువులు, విత్తనాల ధరల మోత
- గత ఏడాదితో పోలిస్తే 15 నుంచి 25 శాతం పెరిగిన ఇన్‌పుట్ల ధరలు
- పెట్టుబడి పెరగడంతో సాగు విస్తీర్ణం తగ్గించుకుంటున్న రైతులు
- కూలీల కొరత, కూలీ చార్జీల పెరుగుదలతో అదనపు భారం
- సకాలంలో సరసమైన ధరలకు ఇన్‌పుట్లు అందజేయాలని డిమాండ్







జడ్చర్ల, జూన్ 19 (విజన్ ఆంధ్ర): ఈసారి ఖరీఫ్ సీజన్ మొదలవ్వకముందే జడ్చర్ల నియోజకవర్గ రైతులకు షాక్ తగిలింది. వర్షాలు వచ్చి నారు పోయాల్సిన టైంలోనే ఎరువులు, విత్తనాల ధరలు విపరీతంగా పెరిగాయి. జడ్చర్ల, నవాబుపేట, బాలనగర్, రాజాపూర్, మిడ్జిల్, ఊరుకొండ మండలాల్లోని వ్యవసాయ దుకాణాల వద్ద రైతుల రద్దీ కనిపిస్తోంది. కానీ ధరలు వినగానే చాలా మంది వెనుతిరుగుతున్నారు. డిఏపీ, కాంప్లెక్స్ ఎరువులతో పాటు పత్తి, మొక్కజొన్న, వరి విత్తనాల రేట్లు గత ఏడాది కంటే 15 నుంచి 25 శాతం పెరిగాయి.ధరల మోతతో చిన్న, సన్నకారు రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఒక ఎకరాకు కనీసం 3-4 వేల రూపాయల అదనపు భారం పడుతోంది. పైగా కూలీలు దొరకడం కష్టంగా, దొరికినా రోజుకు 500-600 రూపాయలు అడుగుతున్నారు. పంటకు గ్యారెంటీ లేదు, గిట్టుబాటు ధర ఎంతో తెలియదు. కానీ విత్తనం కొనే ముందే జేబుకు చిల్లు పడుతోంది. దీంతో కొందరు రైతులు అప్పులపాలవుతున్నారు. మరికొందరు సాగు విస్తీర్ణాన్ని సగానికి తగ్గించుకుని చేతులు కడుక్కుంటున్నారు.

నియోజకవర్గ రైతులు వ్యవసాయ శాఖ అధికారులు రంగంలోకి దిగి ధరలను కంట్రోల్ చేయాలని కోరుతున్నారు. సబ్సిడీ ఎరువులు సకాలంలో అందుబాటులో ఉంచాలి. బ్లాక్ మార్కెట్, అధిక ధరలకు అమ్మే వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.సకాలంలో సరసమైన ధరలకు ఇన్‌పుట్లు అందితేనే ఖరీఫ్ సాగు సాధ్యమవుతుందని, లేకుంటే ఈ ఏడాది సాగు విస్తీర్ణం భారీగా తగ్గే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## అచ్చంపేటలో పాడి రైతుల అవగాహన సదస్సు

### -పాల్గొన్న ఎమ్మెల్యే వంశీకృష్ణ



అచ్చంపేట: "రైతు సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోంది" అని అచ్చంపేట శాసనసభ్యులు డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ స్పష్టం చేశారు. అచ్చంపేట పట్టణంలోని అంగిరేకుల ఫంక్షన్ హాల్‌లో తెలంగాణ పాడి పరిశ్రమాభివృద్ధి సహకార సంస్థ (విజయ డైరీ) ఆధ్వర్యంలో పాడి రైతుల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే వంశీకృష్ణ, పాడి రైతులతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణమాట్లాడుతూతెలంగాణను కోటి ఎకరాల మాగాణీగా మార్చడమే కాకుండా, ప్రతి రైతు ఇంట పాడి-పంటలతో సంపద నింపడమే మన ఇందిరమ్మ రాజ్య కాంగ్రెస్ ప్రభుత్వ ముఖ్య ఆశయం అని పేర్కొన్నారు.రైతు సంతోషంగా ఉంటేనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు.అచ్చంపేట నియోజకవర్గంలోని ప్రతి రైతు కుటుంబానికి కాంగ్రెస్ ప్రభుత్వం, అలాగే మీ వంశీకృష్ణ ఎల్లప్పుడూ తోడుగా ఉంటారని భరోసా ఇచ్చారు.ఈ సదస్సులో విజయ డైరీ పాలశీతలీకరణ కేంద్రాల రాష్ట్ర అధ్యక్షుడు అమిత్ రెడ్డి, అచ్చంపేట విజయ డైరీ చైర్మన్

## రాహుల్ గాంధీని ప్రధాని మంత్రిగా చూడాలన్నదే లక్ష్యం

### రాహుల్ గాంధీ జన్మదిన వేడుకల్లో ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి

కొత్తకోట జూన్ 19 (విజన్ ఆంధ్ర): కొత్తకోట: అభిమాన యువ నాయకుడు రాహుల్ గాంధీని ప్రధానమంత్రిగా చూడాలని అందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి అన్నారు. శనివారం కొత్తకోట పట్టణ కేంద్రంలోని రాహుల్ గాంధీ జన్మదినం సందర్భంగా ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ వనపర్తి జిల్లా అధ్యక్షులు శివసేన రెడ్డి స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. అనంతరం ప్రభుత్వ హాస్పిటల్లో పేషెంట్లకు పండ్ల పంపిణీ చేశారు. తదానంతరం వన మహోత్సవం కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటిన ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ పి అరుణ శ్రీనివాసులు, మార్కెట్ యార్డ్ చైర్మన్ పి.ప్రశాంత్, మున్సిపల్ వైస్ పర్సన్ పి పల్లవి కృష్ణారెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు పెంటన్న యాదవ్, కౌన్సిలర్లు ఎన్ జే బోయెజ్, పి. రవీందర్ రెడ్డి, అబ్దుల్ నబీ, మురళి యాదవ్, అఖిల , భీమచంద్రకాంత్, సంజీవుడు, సుధారాణి, అజ్మత్ కానం, మాజీ కోఆప్షన్ సభ్యులు జేయం మిషక్, నాయకులు, కో ఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# స్వచ్ఛమైన తాగునీరు అందించడమే లక్ష్యం

**- కలెక్టర్ రాజర్షి షా**

ఆదిలాబాద్, జూన్ 19 (విజన్ ఆంధ్ర): ప్రతి ఒక్కరికీ స్వచ్ఛమైన తాగునీరు అందించడమే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని జిల్లా కలెక్టర్ రాజర్షిషా స్పష్టం చేశారు. శుక్రవారం బజార్హత్నూర్ మండలం గులాబ్ తండాలో 'బాల వికాస ఫౌండేషన్' ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్‌ను ఆయన రిబ్బన్ కట్ చేసి ఘనంగా ప్రారంభించారు. అనంతరం ప్లాంట్ పనితీరును, నీటి శుద్ధి ప్రక్రియను స్వయంగా పరిశీలించిన కలెక్టర్, స్థానిక ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటి సేవలను అందుబాటులోకి తీసుకొచ్చారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజలు కలుషిత నీరు త్రాగడం ద్వారా అనారోగ్యం బారిన పడుతున్నారని అన్నారు. ఆర్వో ప్లాంట్ ద్వారా లభించే శుద్ధి చేసిన నీటిని వినియోగించుకోవడం వల్ల డయేరియా, టైఫాయిడ్ వంటి నీటి ద్వారా సంక్రమించే వ్యాధులను పూర్తిగా అరికట్టవచ్చని పేర్కొన్నారు. తద్వారా ప్రజల ఆరోగ్యం మెరుగవుతుందని వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి ప్లాంట్ల ఏర్పాటు ఎంత ముఖ్యమో, వాటి నిరంతర నిర్వహణ అంతే ముఖ్యమని అధికారులకు సూచించారు. ప్లాంట్‌లో ఎలాంటి సాంకేతిక సమస్యలు తలెత్తకుండా నిరంతరాయంగా ప్రజలకు నీరు అందేలా స్థానిక అధికారులు, గ్రామ పంచాయతీ ప్రత్యేక శ్రద్ధ



వహించాలని ఆదేశించారు. ప్రజలందరూ ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని, గ్రామాల్లో పారిశుద్ధ్యానికి ప్రాధాన్యత ఇస్తూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థుల భద్రతకు, పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ఇందులో భాగంగానే బజార్హత్నూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో నూతనంగా నిర్మించిన కాంపౌండ్ గోడను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బాల వికాస ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శౌరిరెడ్డి సింగారెడ్డి, శ్రీలక్ష్మి రెడ్డి, ఎంపీడీఓ మహేందర్ రెడ్డి, సర్పంచ్ రాథోడ్ లక్ష్మి భాయి, పంచాయతీ కార్యదర్శి శివకుమార్, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# భూసేకరణ బాధితులకు న్యాయం చేస్తాం

**- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**

వనపర్తి జిల్లా ప్రతినిధి, జూన్ 19 (విజన్ ఆంధ్ర) : జిల్లాలోని నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించి భూసేకరణలో భాగంగా భూములు కోల్పోయే రైతులకు ఆమోదయోగ్యమైన పరిహారం అందించి న్యాయం చేసేందుకు చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో గోపాల్ దిన్నె రిజర్వాయర్ లింకు కెనాల్ నిర్మాణంలో భాగంగా తూముకుంట, సంగినేనిపల్లి గ్రామాల పరిధిలో భూసేకరణ అంశంపై సంబంధిత గ్రామ రైతులతో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లాస్థాయి చర్చల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి లింకు కెనాల్ పరిధిలోని 90 ఎకరాల భూముల రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులు భూ సేకరణ అంశానికి సంబంధించి తమ అభిప్రాయాలను అధికారుల ముందు వెల్లడించారు. లింక్ కెనాల్ నిర్మాణం కోసం వీపనగండ్ల మండల పరిధిలోని తూముకుంట, సంగినేనిపల్లి గ్రామాల పరిధిలో సేకరించనున్న 90 ఎకరాలకు



సంబంధించి తమ గ్రామాలకి చెందిన చిన్న, సన్నకారు రైతులే ఉన్నారని గ్రామస్తులు తెలిపారు. తామంతా కేవలం వ్యవసాయం పైనే ఆధారపడి జీవిస్తున్నామని, భూములు కోల్పోతే తమకు ఉపాధి కోల్పోయి రోడ్డున పడతామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమకు ఎకరానికి ప్రభుత్వం నిర్దేశించిన విధంగా రూ.11.50 లక్షలు కాకుండా, పెద్ద మొత్తంలో నష్టపరిహారం ఇవ్వాలని విన్నవించారు. ప్రభుత్వం న్యాయపరమైన పరిహారం అందించి తమను ఆదుకోవాలని కోరారు. అదేవిధంగా ముందు సింగోటం వైపు నుండి భూసేకరణ ప్రారంభించి తమ వద్ద చేయాలని రైతులు అధికారులను కోరారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ గోపాల్ దిన్నె రిజర్వాయర్ లింక్ కెనాల్ భూ సేకరణలో భాగంగా భూములు కోల్పోనున్న రైతుల అభిప్రాయ సేకరణ కోసమే ఈ జిల్లాస్థాయి చర్చల కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం ఆయా ప్రాంతాల్లో మార్కెట్ రేట్ల కు అనుగుణంగా ధరను నిర్ణయిస్తుందని చెప్పారు. గతంలో వల్లభాపూర్, బొల్లారం గ్రామాల్లో చేసిన భూసేకరణ మాదిరిగానే ఇక్కడ కూడా చేస్తామని తెలిపారు. రైతులకు న్యాయం చేసేందుకే ప్రభుత్వం తరఫున తాము ఎప్పుడు ప్రయత్నిస్తామని తెలిపారు. కాబట్టి రైతులు వాస్తవ పరిస్థితులను ఆధారంగా చేసుకుని తమ విన్నపాన్ని తెలియజేయాలని సూచించారు. తాము రైతుల విన్నపాన్ని ప్రభుత్వానికి నివేదించి న్యాయం చేసే దిశగా అడుగులు వేస్తామని తెలియజేశారు. భూ సేకరణ చట్టం ప్రకారం పరిహారం ఎంత ఇవ్వవచ్చు అనేది త్వరలోనే నిర్ణయించడం జరుగుతుందని తెలిపారు. త్వరలోనే గ్రామానికి అధికారులు వచ్చి పరిహారం గురించి చెప్పడం జరుగుతుందని తెలియజేశారు. సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ వినోద్ కుమార్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ తిరుపతయ్య, నీటిపారుదల శాఖ అధికారులు, ఆర్డీవో సుబ్రహ్మణ్యం, ఇతర రెవెన్యూ అధికారులు, గ్రామస్తులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ఓటరు జాబితాలో నమోదుకు సువర్ణ అవకాశం

**- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**



వనపర్తి జిల్లా ప్రతినిధి,జూన్ 19 (విజన్ ఆంధ్ర) : జూన్, 25 నుండి ప్రారంభం కానున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్.ఐ.ఆర్) ప్రక్రియలో వనపర్తి జిల్లాలోని ఓటర్లు అందరూ భాగస్వాములై తమ పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి నేడొక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా జూన్ 25 నుండి జూలై , 24 వరకు కొనసాగనున్న ఎస్.ఐ.ఆర్. కార్యక్రమంలో ప్రజలు పాల్గొని బి.ఎల్. ఒ లు తమ ఇంటికి వచ్చినప్పుడు తప్పులు లేకుండా సరైన సమాచారం ఇచ్చి ఫారం పూరించుకునే విధంగా సహకారం అందించాలన్నారు. నెల రోజుల పాటు జరగనున్న ఓటరు నమోదు కార్యక్రమం అనంతరం జులై 31వ తేదీన డ్రాఫ్ట్ ఓటరు జాబితా విడుదల చేయడం జరుగుతుందని, డ్రాఫ్ట్ రోల్ లో ఏమైనా తప్పులు ఉన్నా, ఎవరిదైనా పేర్లు జాబితాలో నమోదు కాకుండా పోయిన జులై 31 నుండి ఆగస్టు 30 వ తేదీ వరకు ఫిర్యాదులు స్వీకరించడం జరుగుతుందని, వచ్చిన ఫిర్యాదులను తేది 31-7-2026 నుండి 28-9-2026 వరకు నోటీసులు జారీ చేసి పరిష్కారం అనంతరం అక్టోబర్ ఒకటవ తేదీన తుది జాబితా విడుదల చేయనున్నట్లు షెడ్యూల్ విడుదల చేశారు. ప్రతి పోలింగ్ కేంద్రానికి బి.ఎల్. ఒ లు, సూపర్వైజర్లను నియమిస్తూ ఉత్తర్వులు జారీ

జిల్లాలో ఎస్.ఐ.ఆర్ లో పాల్గొననున్న బూత్ లెవల్ ఆఫీసర్ల పేర్లు, సూపర్వైజర్ల పేర్లు, వారి మొబైల్ నెంబర్లను పోలింగ్ కేంద్రం వారిగా జిల్లాలోని 316 పోలింగ్ కేంద్రాల జాబితాను ప్రకటించడం జరిగిందని తెలిపారు. ఓటర్లు తమ బి ఎల్. ఒ, సూపర్వైజర్ల వివరాలు తెలుసుకొని తమ కుటుంబ సభ్యుల ఓటర్ల పేర్లను జాగ్రత్తగా నమోదు చేయించుకోవాలని సూచించారు. ఒక ఓటరుకు ఒకే చోట పేరు నమోదు చేయించుకోవాలని, ఒకటి కంటే ఎక్కువ చోట్ల ఇతర పోలింగ్ కేంద్రంలో లేదా నియోజక వర్గంలో నమోదు చేయించుకుంటే ఎన్నికల నిబంధనల ప్రకారం శిక్షలు ఉంటాయని తెలియజేశారు. జిల్లాలోని బి.ఎల్.ఓ ల జాబితా పోలింగ్ కేంద్రం వారిగా జత చేయడమైనది.

# మాదకద్రవ్యాల మహమ్మారిపై సమష్టి పోరాటం

**- వనపర్తి జిల్లా ఎస్పీ సునితరెడ్డి**

వనపర్తి జిల్లా ప్రతినిధి, జూన్ 19 (విజన్ ఆంధ్ర) మాదకద్రవ్యాల మహమ్మారి యువత భవిష్యత్తును అంధకారంలోకి నెట్టే సామాజిక శాపమని, దీనిని నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని వనపర్తి జిల్లా ఎస్పీ సునితరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం మరియు అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలో "నషా ముక్త్ భారత్ అభియాన్" పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. తెలంగాణ ప్రభుత్వం, దివ్యాంగులు, వృద్ధులు మరియు ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల సాధికారత శాఖ డైరెక్టర్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. మాదకద్రవ్యాలు వ్యక్తిగత జీవితాలనే కాకుండా, కుటుంబాలను, సమాజం మొత్తాన్ని తీవ్రంగా దెబ్బతీస్తాయని హెచ్చరించారు. "యువత శక్తి దేశ భవిష్యత్తు. యువత డ్రగ్స్‌కు 'నో' చెప్పాలి. వారిని సరైన మార్గంలో నడిపించడం తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులందరి బాధ్యత" అని ఆమె స్పష్టం




చేశారు. ప్రజల సహకారంతో వనపర్తిని మాదకద్రవ్య రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తోందని ఎస్పీ తెలిపారు. "నషా ముక్త్ భారత్ అభియాన్" ద్వారా డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలపై విస్తృత అవగాహన కల్పిస్తామని, మాదకద్రవ్యాల అక్రమ రవాణా లేదా విక్రయాల గురించి ఎవరికి సమాచారం తెలిసినా వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని ఆమె భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో డీసీఆర్బీ డీఎస్పీ బాలాజీ, జిల్లా సంక్షేమ శాఖ అధికారి కె. సుధారాణి, జిల్లా బాలల పరిరక్షణ అధికారి రాంబాబు, సంక్షేమ సూపరిండెంట్ అరుంధతి, చైల్డ్ ప్రొటెక్షన్ డీసీపీయూ సిబ్బంది మరియు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మరమ్మతులు మరిచిన విద్యుత్ అధికారులు..

**- ఎండిపోతున్న పంటలు**

**- ఆవేదన వ్యక్తం చేసిన రైతులు**

ఆర్మూర్,జూన్ 19:( విజన్ ఆంధ్ర ) : ఆర్మూర్ నియోజకవర్గంలోని గోవింద్ పెట్ గ్రామంలో రైతులు పంట పొలాల్లో ఉన్న విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ ను మరమ్మత్తులు చేయడంలో నిర్లక్ష్యం వహించడంతో పంట నష్టపోతున్నామని రైతులు నీలం మహేష్, మద్దిడి గంగాధర్, దాసరి ఒడ్డెన్న ఆవేదన వ్యక్తం చేశారు.వివరాలలోకి వెళ్తే..ఆర్మూర్ మండలంలోని గోవింద్ పేట గ్రామంలో 14 మంది రైతులు 30 ఎకరాల పసుపు,మొక్కజొన్న,వరి పంట సాగు వర్షాలు లేక ఎండిపోతున్నాయని మండిపడ్డారు.గత ఎనిమిది రోజుల క్రితం విద్యుత్ అధికారులు వర్షానికి తెగిపడి ఉన్న విద్యుత్ స్తంభానికి మరమ్మత్తులు నామ మాత్రము మరమ్మత్తులు



చేసి వెళ్లిపోయారు. విద్యుత్ స్తంభానికి,విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ కు విద్యుత్ సరఫరా లేక రైతులకు తీవ్ర అంతరాయం ఏర్పడి పంట ఎండిపోయే స్థితికి చేరుకుంది. పంట నష్టం జరగకుండా అధికారులు స్పందించి సత్వరమే మరమ్మత్తులు చేయించాలని కోరారు. లేనియెడల అధికారుల కార్యాలయం ముందు రైతులందరినీ ఏకం చేసి ధర్నా నిర్వహిస్తామని రైతులు డిమాండ్ చేశారు.

## రైతులకు మినీ కిట్టు కందులు విత్తనాలు ప్యాకెట్ను పంపిణీ చేసిన ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి

గద్వాల జూన్ 19 (విజన్ ఆంధ్ర బ్యూరో) : జోగులాంబ గద్వాల జిల్లా కె. టి దొడ్డి మండలం పరిధిలో కుచినెర్ల గ్రామంలో వ్యవసాయ అధికారులు రైతులకు మినీ కిట్టు కందులు విత్తనాల ప్యాకెట్ ను గద్వాల శాసనసభ్యులు బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి చేతుల మీదుగా రైతులకు పంపిణీ చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో జిల్లా సీనియర్ నాయకులు బండ్ల రాజశేఖర్ రెడ్డి , సత్య రెడ్డి, నందిన్నె ప్రకాశ్ రావు,పి?ఎసిఎస్. ఛైర్మెన్ తిమ్మారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ రామకృష్ణ నాయుడు, సర్పంచ్ కృష్ణ, మాజీ సర్పంచ్ వెంకట కిషన్ రావు, నాయకులు , మైలగడ్డ చంద్రశేఖర్ , తిక్కన, హరి ప్రసాద్ గౌడ్, కర్రెప్ప రాముడు నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# నాలా కబ్జా చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

**- గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి**

**- ఆకృతి కన్స్ట్రక్షన్స్ పై ఎమ్మార్వో కు పిర్యాదు**



శేరిలింగంపల్లి .జూన్ 19: (విజన్ ఆంధ్ర) : శేరిలింగంపల్లి నియోజకవర్గం గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని గోపన్‌పల్లి సర్వే నెం. 21లో గల ప్రభుత్వ భూమిలో ఆకృతి కన్స్ట్రక్షన్ అనే నిర్మాణ సంస్థ నాలాను ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపడుతున్న విషయమై కఠిన చర్యలు తీసుకోవాలని గచ్చిబౌలి మాజీ కార్పొరేటర్ వి. గంగాధర్ రెడ్డి శేరిలింగంపల్లి ఎమ్మార్వోకు వినతిపత్రం ప్రభుత్వం ఒకవైపు ప్రభుత్వ భూములను, చెరువులను, నాలాలను పరిరక్షిస్తామని ప్రకటిస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో మాత్రం అక్రమ ఆక్రమణలు నిరంతరం కొనసాగుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించడమే కాకుండా, గ్రామ ప్రజలకు ఎంతో ముఖ్యమైన శ్మశానవాటిక ప్రాంతాన్ని మరియు చెరువు నీటి ప్రవాహానికి ఉపయోగపడే సహజ నాలాను కూడా



కబ్జా చేసి నిర్మాణాలు చేపట్టడం అత్యంత ఆందోళనకరమని పేర్కొన్నారు. నాలా ఆక్రమణల కారణంగా భవిష్యత్తులో భారీ వర్షాల సమయంలో వరద ముప్పు ఏర్పడి పరిసర కాలనీలు, గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదం ఉందని తెలిపారు. చెరువులకు నీటి ప్రవాహ మార్గాలు మూసివేయబడటం వల్ల పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుందని, భూగర్భ జలాలపై కూడా ప్రతికూల ప్రభావం పడుతుందని అన్నారు. అధికారులు వెంటనే స్థల పరిశీలన నిర్వహించి, ప్రభుత్వ భూమి, నాలా మరియు శ్మశానవాటికపై జరిగిన ఆక్రమణలను తొలగించి అసలు స్థితిని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఆక్రమణదారులపై చట్టపరమైన చర్యలు తీసుకొని భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు అమలు చేయాలని కోరారు. ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని అధికారులు తక్షణమే స్పందించి న్యాయం చేయాలని, లేనిపక్షంలో గ్రామస్తులు మరియు స్థానిక ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపట్టాల్సి వస్తుందని గంగాధర్ రెడ్డి హెచ్చరించారు.

## రాహుల్ గాంధీ జన్మదినం సందర్భంగా విద్యార్థులకు ఉచిత పుస్తకాల పంపిణీ.



ములుగు జూన్19, విజన్ ఆంధ్ర ప్రతినిధి : కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకొని ములుగు మున్సిపాలిటీ 5వ వార్డులోని సీఎస్ఐ మిషనరీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఉచిత పుస్తకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. 5వ వార్డు కౌన్సిలర్ గుగ్గిళ్ల దివ్య సుజన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్పర్సన్ చింతనిప్పుల చంద్రకళ బిక్షపతి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచంద్ర ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులకు పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా చైర్పర్సన్ చంద్రకళ మాట్లాడుతూ, రాహుల్ గాంధీ జన్మదినాన్ని సేవా కార్యక్రమాలతో జరుపుకోవడం అభినందనీయమని, విద్యార్థుల విద్యాభివృద్ధికి తోడ్పాటు అందించిన కౌన్సిలర్ దివ్య సుజన్‌ను ప్రత్యేకంగా అభినందించారు. విద్యే సమాజ అభివృద్ధికి పునాది అని, పుస్తకాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత లక్ష్యాలు సాధించాలని విద్యార్థులకు సూచించారు. కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ విద్య, యువత సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా ఆత్మ డైరెక్టర్ జక్కుల రేవంత్, పాఠశాల హెచ్ఎం బలరాం, ఉపాధ్యాయులు రమేష్, రత్నాకర్, కాంగ్రెస్ నాయకులు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# జిపి పదవికి ఎమ్మెల్యే మాట మార్చారా ..?

**దళిత న్యాయవాదికి హ్యాండ్......**

**బీ సీ కి రెడ్ కార్పెట్..?**

ములుగు జూన్ 19, విజన్ ఆంధ్ర ప్రతినిధి : ములుగు జిల్లా గవర్నమెంట్ ప్లీడర్(జిపి)నియామకం వ్యవహారం రాజకీయంగా వేడెక్కింది.ఒక దళిత న్యాయవాదికి తొలుత సిఫార్సు చేసిన అధికార పార్టీ ఎమ్మెల్యే,అనంతరం అదే సిఫార్సును వెనక్కి తీసుకొని మరో బిసి సామాజిక వర్గానికి చెందిన న్యాయవాదికి మద్దతు ఇచ్చారనే ఆరోపణలు జిల్లాలో చర్చనీయాంశంగా మారాయి. విశ్వసనీయ సమాచారం మేరకు మాదిగ సామాజిక వర్గానికి చెందిన ఓ దళిత న్యాయవాది గవర్నమెంట్ ప్లీడర్ పదవి కోసం ఎమ్మెల్యేను సంప్రదించినట్లు, ఆయన సిఫార్సు లేఖ ఇచ్చినట్లు ఆ లేఖను సచివాలయంలో సమర్పించిన అనంతరం తనకు నియామకం ఖాయమనే ఆశతో ఉన్న సమయంలో పరిస్థితులు మారిపోయినట్లు సమాచారం గత ప్రభుత్వ హయాంలో అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా పని చేసిన ఓ బిసి సామాజిక వర్గానికి చెందిన న్యాయవాది కోసం తీవ్ర స్థాయిలో లాబీయింగ్ జరిగినట్లుగా గుసగుసలు ఈ ప్రక్రియలో అదే సామాజిక



వర్గానికి చెందిన ఓ ప్రముఖ న్యాయవాది కీలక పాత్ర పోషించినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అంతేకాకుండా,తొలుత దళిత న్యాయవాదికి ఇచ్చిన సిఫార్సు లేఖను పక్కన పెట్టి, కొత్త సిఫార్సు లేఖను ఫైల్‌లో చేర్చే ప్రయత్నాలు జరిగాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.ఈ వ్యవహారంలో ఫైల్ టాంపరింగ్ జరిగిందా? లేదా? అనేది అధికారికంగా తేలాల్సి ఉంది.మరోవైపు జిపి పదవికి పోటీలో ఉన్న బీసీ న్యాయవాది ఫోన్ ద్వారా తనను దుర్భాషలాడుతూ బెదిరించాడని దళిత న్యాయవాది పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. అయితే ఆ కేసు విచారణలో పెద్దగా పురోగతి కనిపించడం లేదని స్థానిక న్యాయవాదులు అభిప్రాయ పడుతున్నారని వినికిడి.ఈ పరిణామాల నేపథ్యంలో దళిత న్యాయవాది తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం.తనకు ముందుగా అవకాశం చూపించి, చివరికి దూరం చేశారని ఆయన సన్నిహితుల వద్ద వాపోయినట్లు తెలిసింది.అనంతరం దళిత నాయకులను,ప్రజా ప్రతినిధులను కలిసి న్యాయం చేయాలని తను గోడు వెళ్లబోసుకున్నారని ఇదే విషయాన్ని ఎంపీ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన స్పందించి పూర్తి వివరాలు తెలుసుకుని తగిన న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది.ఈ పరిణామాల నేపథ్యంలో ఒక ప్రశ్న రాజకీయ వర్గాల్లో బలంగా వినిపిస్తోంది.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉండగా,గత ప్రభుత్వ పాలనలో కీలక బాధ్యతలు నిర్వహించిన వ్యక్తులకు స్థానిక కాంగ్రెస్ నాయకత్వం ఎందుకు అండగా నిలుస్తోంది.? అనే ప్రశ్నకు సమాధానం ఏమిటని కాంగ్రెస్ శ్రేణులు,దళిత సంఘాలు చర్చించుకుంటున్నాయి.ములుగు జిపి నియామకం ఇప్పుడు కేవలం ఒక న్యాయవాది నియామక వ్యవహారం కాకుండా, రాజకీయ ప్రభావం,సామాజిక సమీకరణాలు, దళిత ప్రతినిధిత్వం వంటి అంశాల చుట్టూ తిరుగుతున్న చర్చగా మారింది.ప్రభుత్వం చివరకు ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోనని ములుగులో ఆసక్తికరంగా మారింది.

# నీట్ (యుజి) పరీక్షల సందర్భంగా పట్టణంలో 163 బిఎన్ఎస్ఎస్ అమలు

**- జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు**


గద్వాల జూన్ 19 (విజన్ ఆంధ్ర బ్యూరో) : జోగులాంబ గద్వాల జిల్లాలో జూన్ 21వ తేదిన నిర్వహించబడనున్న నీట్ (యుజి)2026 ప్రవేశ పరీక్షల నేపథ్యంలో పరీక్షలు ప్రశాంతంగా, పారదర్శకంగా సాగేందుకు గద్వాల పట్టణంలో సెక్షన్ 163 భారతీయ నాగరిక సురక్షా సంహిత2023 అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా, శాంతి భద్రతల పరిరక్షణకు కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన పేర్కొన్నారు. పరీక్ష రోజు ఆదివారము మధ్యాహ్నం 12:00 గంటల నుండి సాయంత్రం 7:00 గంటల వరకు పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాల్లో ఈ నిబంధనలు అమలులో ఉంటాయని స్పష్టం చేశారు. ఈ మేరకు పరీక్ష కేంద్రాలకు 200 మీటర్ల పరిధిలో ఐదుగురికి మించి గుంపులుగా ఉండటం పూర్తిగా నిషేధమని, అలాగే సభలు, సమావేశాలు, ర్యాలీలు, దర్నాలు నిర్వహించరాదని ఎస్పీ తెలిపారు. మైకులు, డీజేలు వినియోగంపై కూడా పూర్తి నిషేధం విధించినట్లు చెప్పారు.



పరీక్షల సమయాల్లో ఇంటర్నెట్ సెంటర్లు, జిరాక్స్ కేంద్రాలు, స్టేషనరీ దుకాణాలు తాత్కాలికంగా మూసివేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 4 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా, అవన్నీ గద్వాల పట్టణ పరిధిలోనే ఉన్నట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు, పరిసర ప్రాంతాల్లో నిరంతర పోలీస్ పెట్రోలింగ్ బృందాలను నియమించినట్లు చెప్పారు. ట్రాఫిక్ అంతరాయం లేకుండా ప్రత్యేక ట్రాఫిక్ నియంత్రణ చర్యలు తీసుకుంటున్నట్లు, అలాగే నిఘా బృందాలను ఏర్పాటు చేసి పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు వివరించారు.ఈ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో సజావుగా జరిగేలా ప్రజలు పోలీస్ శాఖకు సహకరించాలని జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు. నిబంధనలు అతిక్రమించిన పక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని జిల్లా ఎస్పీ హెచ్చరించారు.

# నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు - సీఐ వెంకటేశ్వర్లు

పినపాక, జూన్ 19(విజన్ఆంధ్ర): ఖరీఫ్ సీజన్ ప్రారంభం నేపథ్యంలో కరకగూడెం మండలంలోని ఫెర్టిలైజర్, విత్తనాల దుకాణాల్లో శుక్రవారం సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ ఐ నాగేశ్వరావు లు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కరకగూడెం మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లోని పలు దుకాణాలను తనిఖీ చేశారు. విత్తనాల స్టాక్ రిజిస్టర్లు, లైసెన్సులు, బిల్ బుక్స్, గోడౌన్లను క్షుణ్ణంగా పరిశీలించారు. రైతులకు అమ్ముతున్న పత్తి, మిర్చి, వరి విత్తనాల బ్యాచ్ నంబర్లు, ఎక్స్‌పైరీ తేదీలు సరిచూశారు. ఈ సందర్భంగా సీఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, "రైతుల జీవితాలతో చెలగాటమాడే నకిలీ విత్తనాల దందాను ఉపేక్షించేది



లేదు. లైసెన్స్ లేకుండా, బిల్లులు ఇవ్వకుండా నకిలీ విత్తనాలు, కల్తీ ఎరువులు అమ్మినట్లు తేలితే పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటాం" అని హెచ్చరించారు. రైతులు కూడా అప్రమత్తంగా ఉండాలని, ప్రభుత్వ గుర్తింపు పొందిన దుకాణాల్లోనే బిల్లుతో సహా విత్తనాలు కొనాలని సూచించారు. నకిలీ విత్తనాల సమాచారం ఉంటే వెంటనే డయల్ 100కు గానీ, స్థానిక పోలీస్ స్టేషన్‌కు గానీ తెలియజేయాలని కోరారు. అలాగే షాపు యజమానులు రేట్ల పట్టికను అందరికీ కనిపించేలా ఉంచాలని ఆదేశించారు. ఈ తనిఖీల్లో పోలీస్ సిబ్బంది, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# 40 ఏళ్ల సీనియారిటీ ఉన్న రేవూరి ప్రకాష్ రెడ్డి మాట్లాడే తీరు ఇదేనా?

**- బిఆర్ఎస్ నాయకుడు కొక్కిరాల రాకేష్ రావు**



పరకాల, జూన్ 19 (విజన్ ఆంధ్ర) : రాజకీయాల్లో 40 ఏళ్ల సీనియారిటీ ఉందని చెప్పుకునే ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి.. మహిళలకు మేలు జరుగుతుంటే కడుపు మంటతో మాట్లాడటం ఆయన సంస్కారానికి నిదర్శనమని బిఆర్ఎస్ నాయకుడు కొక్కిరాల రాకేష్ రావు అన్నారు. వరంగల్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలపై రేవూరి చేసిన వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా రాకేష్ రావు మాట్లాడుతూ 40 ఏళ్ల రాజకీయ అనుభవం ఉన్న ఒక సీనియర్ నాయకుడు ఇలానేనా మాట్లాడేది అని రాకేష్ రావు ప్రశ్నించారు. సీనియారిటీ కేవలం మాటలకేనా, చేతల్లో లేదా అని నిలదీశారు.మహిళలు ఆర్థికంగా ఎదిగి, తమ సొంత కాళ్లపై తాము నిలబడాలనే గొప్ప సంకల్పంతో ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి నిరంతరం శ్రమిస్తున్నారని.పోచంపల్లి ఫౌండేషన్ ద్వారా మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్ శిక్షణ ఇవ్వడమే కాకుండా, వారికి ఉచితంగా కుట్టు మిషన్లను కూడా అందిస్తూ వారి బ్రతుకు తెరువుకు మార్గం చూపుతున్నారని.తాము అధికారంలో, ప్రభుత్వంలో ఉండి కూడా మహిళలకు ఇలాంటి మేలు చేయలేని రేవూరి ప్రకాష్ రెడ్డి.. పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి స్వచ్ఛందంగా చేస్తుంటే చూసి తట్టుకోలేక కడుపు మంటతో మాట్లాడుతున్నారని. ప్రజల్లో పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి కి వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేకనే రేవూరి ఇలాంటి చౌకబారు విమర్శలు చేస్తున్నారని, ఇకనైనా బురదజల్లడం మాని మహిళల అభ్యున్నతికి ఏం చేయాలో ఆలోచించాలని రాకేష్ రావు హితవు పలికారు.

# కర్నాటక లో అక్రమంగా నిర్మిస్తున్న కురిడి లిఫ్ట్...

**- తెలంగాణ లో ఉన్న ఆర్డిఎస్ ఎడారే..**

**- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్. రామచంద్రారెడ్డి**



అయిజ జూన్ 19 (విజన్ ఆంధ్ర) : జోగులాంబ గద్వాల జిల్లా అయిజ పట్టణ కేంద్రంలోని బిజెపి కార్యాలయంలో బీజేపీ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్. రామచంద్రారెడ్డి మీడియా సమావేశంలో మాట్లాడుతూ కర్నాటక రాష్ట్రంలో అక్రమంగా నిర్మిస్తున్న కురిడి లిఫ్ట్ ను గత 400 రోజుల నుండి నిర్మాణం చేస్తున్న నాకు తెలియదు అని చీఫ్ ఇంజనీర్ రహీముద్దీన్ అనడం సిగ్గు చేటు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్. రామచంద్రారెడ్డి అన్నారు.అర్డిఎస్ ఎగువన 100 మీటర్ల దూరం లో కర్నాటక ప్రభుత్వం కురిడి లిఫ్ట్ ను గత 400 రోజుల నుండి 2 టిఎంసి లు అక్రమం గా తరలిచేవిధంగా ఎలాంటి అనుమతి లేకుండా ఈ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టారు.ఛీఫ్ ఇంజనీర్ రహీముద్దీన్ అడిగితే నాకు తెలియదు సమాచారం లేదు అని చెప్పడం సిగ్గు చేటు అని అన్నారు.అర్డిఎస్ పైన మరియూ క్రింద ఏమి జరుగుతుందో తెలుసుకోవాల్సిన బాధ్యత లేదా అని అన్నారు. అదేవిధంగా ప్రక్కన ఉన్న కర్ణాటక ప్రభుత్వం ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా కురిడి లిఫ్ట్ పూర్తి చేస్తుంటే మన తెలంగాణ ప్రభుత్వం లో ఉన్న కాంగ్రెస్ నాయకులు, ముఖ్యంగా నాగర్ కర్నూల్ ఎంపీ మల్లు రవి అనుమతి ఉన్న తుమ్మిళ్ల లిఫ్ట్ సంబంధించిన మల్లమ్మ కుంట వద్దు అని సంబంధిత అధికారులకు లెటర్ ఇవ్వడం శోచనీయం అని అన్నారు. ఇప్పటికే కర్ణాటక లో ఉన్న ఆర్డిఎస్ రైతులకు 5000 వేల ఎకరాలకు నీళ్లు ఇవ్వాలి కానీ 20000 ఎకరాలకు అక్రమంగా సాగు చేస్తున్నారు.కురిడి లిఫ్ట్ ద్వారా అదనంగా మరో 2 టీఎంసీ లు వారు అక్రమంగా తీసుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. మన ఆర్ డి ఎస్ రైతులకు 87500 ఎకరాలకు నీళ్ల రావాలి కానీ 20000 ఎకరాల కూడా మారడం లేదని ఆరోపించారు. వెంటనే కురిడి లిఫ్టును రద్దు చేయాలని లేని పక్షంలో రైతుల పక్షాన పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి పార్టీ పట్టణ అధ్యక్షుడు నరసింహులు, మండలాధ్యక్షుడు గోపాలకృష్ణ, లక్ష్మణ గౌడ్, భీమన్న, నేత్ర, తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి

**- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**




గద్వాల జూన్ 19 (విజన్ ఆంధ్ర బ్యూరో) : ఓటరు జాబితాలో ఎలాంటి తప్పిదాలకు అవకాశం లేకుండా సమగ్రంగా రూపొందించేందుకు చేపట్టిన ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. ఓటరు జాబితా సమగ్ర సవరణ ప్రక్రియపై శుక్రవారం హైదరాబాద్ నుంచి ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి సంబంధిత ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిఎల్ ఓ, బిఎల్ ఏ లకు ఈనెల 24 లోగా శిక్షణ కార్యక్రమాలు పూర్తి చేయాలన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకారం ఈ నెల 25వ తేదీ నుంచి బిఎల్ఓ లు తమ పోలీస్ స్టేషన్ ల పరిధిలోని ఓటర్ల ఇంటింటికి తిరిగి ఎన్నుమరేషన్ ఫారాలను అందజేయాలన్నారు. అక్టోబర్ 1వ తేదీన తుది ఓటరు జాబితా ప్రకటించే వరకు షెడ్యూల్ ప్రకారం ఆయా కార్యక్రమాలను సజావుగా నిర్వహించాలన్నారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పై ప్రజలకు పెద్ద ఎత్తున అవగాహన కలిగేలా ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. గద్వాల ఐడిఓసి వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి సంబంధిత జిల్లా అధికారులతో కలిసి వీసీ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మాట్లాడుతూ జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియను షెడ్యూల్ ప్రకారం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. బూత్ లెవెల్ అధికారులకు శిక్షణ కార్యక్రమాలు పూర్తి చేశామని, వారికి మ్యాపింగ్ చేయబడని డేటాను అందజేయడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో ఆర్డీవో శ్రీనివాసరావు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు మనోజ్ కుమార్ రెడ్డి, రాజ్ కుమార్, ఎన్నికల విభాగం అధికారి మంజుల, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

# సీఎంసీపై చేస్తున్న ఆరోపణలు నిరాధారం

**- మెడికల్ ఆస్పత్రి ప్రతిష్టను దెబ్బతీసే వారిపై చర్యలు తప్పవు.**

**- ఆరోపణలను ఖండించిన ఐ ఎం ఎస్ ఆర్ చైర్మన్ షణ్ముగం మహాలింగం.**




నిజామాబాద్ జూన్ 19:( విజన్ ఆంధ్ర ) : ఐ ఎం ఎస్ ఆర్ , సీఎంసీ యాజమాన్యంపై కొందరు వ్యక్తులు చేస్తున్న తప్పుడు, నిరాధార ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఐ ఎం ఎస్ ఆర్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ షణ్ముగం మహాలింగం తెలిపారు. సీఎంసీ మెడికల్ కళాశాల ప్రతిష్టను భంగపరిచేందుకు ప్రయత్నిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, 200 కోట్ల పెట్టుబడితో కళాశాల ప్రారంభించేందుకు ప్రయత్నిస్తే దురుద్దేశ పూర్వకంగా ఐ ఎం ఎస్ ఆర్ సంస్థపై ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిజామాబాద్ ప్రెస్ క్లబ్ లో శుక్రవారం ఇంటిగ్రేటెడ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ ప్రైవేట్ లిమిటెడ్ హైదరాబాద్ సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ షణ్ముగం మహాలింగం మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ డిచ్పల్లి మండలం సుద్దపల్లిలో గల సీఎంసీ మెడికల్ కళాశాల వ్యవహారంలో ఇరువర్గాల మధ్య జరుగుతున్న వివాదాలను ఆయన వివరించారు. సిఎంసి క్యాంపస్‌లో జరిగిన ఘటనల నేపథ్యంలో ఇప్పటికే పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేయకపోవడంతో న్యాయస్థానాన్ని ఆశ్రయించగా ఎఫ్ఐఆర్ నం.176/2026 ద్వారా సీఎస్ఐ సంస్థ ప్రతినిధులైన బి. విమల్ సుకుమార్, దయానంద్, కె వి ప్రసాద్,నిబంధనలకు విరుద్ధంగా కళాశాల లో విధులు నిర్వహిస్తున్న డాక్టర్ అజ్జ శ్రీనివాస్ తో పాటు మరో ఇద్దరిపై ఈనెల 11న కేసు నమోదైనట్లు తెలిపారు. దీనికి ప్రతిస్పందనగా కొందరు వ్యక్తులు సంస్థ ప్రతిష్టను దెబ్బతీయాలనే ఉద్దేశంతో అసత్య ఆరోపణలు చేస్తూ తనపై డిచ్పల్లి పోలీస్ స్టేషన్లో మరోసారి తప్పుడు ఫిర్యాదు చేశారని చెప్పారు. తనతో సి ఎస్ ఐ సంస్థ ప్రతినిధులకు మధ్య ఎటువంటి చట్టబద్ధమైన ఎంఓయూ కుదరలేదని, నకిలీ ఐఏఎస్ పేరుతో తాను చలామణి అవుతున్నట్లు ఫిర్యాదు చేశారని వివరించారు.అయితే పోలీసులు ఎలాంటి విచారణ చేపట్టకుండా గతంలో మాదిరిగానే ఏకపక్షంగా వ్యవహరించి తప్పుడు ఎఫ్ఐఆర్ నమోదు చేశారని తెలియజేశారు. ఇరు వర్గాల మధ్య జరుగుతున్న వివాదాన్ని విచారణ చేపట్టి పరిష్కరించాల్సిన పోలీసులు వివక్ష చూపుతూ నిరాధార ఆరోపణలతో తనపై కేసులు నమోదు చేయడం భావ్యం కాదని అన్నారు. తాము ఇప్పటికే మెడికల్ కళాశాల పునరుద్ధరణకై సుమారు 25 కోట్ల మేరకు నిధులు వెచ్చించామని, ఆర్థిక లావాదేవీల కు సంబంధించిన అన్ని సాక్షాలు తమ వద్ద ఉన్నాయని డాక్టర్ షణ్ముగశీ మహాలింగం స్పష్టం చేశారు. ప్రస్తుతం కొందరు వ్యక్తులు సీఎంసీ పేరును ఉపయోగించి కొందరితో లావాదేవీలు జరిపినట్లు తమ దృష్టికి వచ్చిందని, అలాంటి చర్యలకు ఐ ఎం ఎస్ ఆర్ అనుమతి లేదని తెలిపారు. వైద్య కళాశాల నిర్వహణకు అవసరమైన సామర్థ్యం, అనుభవం, వనరులు ఐఎంఎస్ఆర్‌కు సమృద్ధిగా ఉన్నాయని, బయటి వ్యక్తుల సహాయం అవసరం లేదన్నారు. తనకు ఐఎంఎస్ఆర్ తరఫున ప్రాతినిధ్యం వహించే అధికారం లేదని కొందరు సీఎంసీ సభ్యులు, డా. అజ్జ శ్రీనివాస్ ఆరోపించడాన్ని తోసిపుచ్చారు. అజ్జ శ్రీనివాస్ పై ఇప్పటికే డిచ్పల్లి పోలీస్ స్టేషన్లో ఒక కేసు నమోదు కాగా, నాంపల్లి న్యాయస్థానంలో ఐదు కోట్లకు సంబంధించిన చెల్లుబాటు కానీ చెక్కుల విషయంలో మరో క్రిమినల్ వ్యాజ్యం పెండింగుల్లో ఉందన్నారు.కొందరు సీఎంసీ ప్రతినిధులతో పాటు డాక్టర్ శ్రీనివాస్ పై ఇప్పటికే మరోమారు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశామని, అవసరమైతే సహకరించిన వారిపైనా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అక్టోబర్ 2024 నుంచి సీఎస్ఐ టీఏ మెదక్ దయాసిస్‌తో కుదిరిన అవగాహన ఒప్పందం మేరకు సిఎంసి క్యాంపస్‌లో పలు అభివృద్ధి, సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. గత రెండేళ్లుగా చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, సమాజ సేవలను ప్రజలకు వివరించడంతో పాటు సంస్థపై జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని ప్రజలకు తెలియజేస్తున్నామని ఆయన వివరణ ఇచ్చారు.

# సింగరేణి బాటలో బీజేపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు!!

**- శ్రీరాంపూర్ గనుల సందర్శనకు నేతల బృందం**

**- కందుల సంధ్యారాణి ఆధ్వర్యంలో లీడర్లకు ఘన స్వాగతం**

**- గని కార్మికుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందడుగు**



పెద్దపల్లి బ్యూరో చీఫ్, జూన్ 19 (విజన్ ఆంధ్ర): గోదావరిఖని నడిబొడ్డున బీజేపీ శ్రేణుల నినాదాల హోరు, కార్యకర్తల కోలాహలం మధ్య శ్రీరాంపూర్ సింగరేణి గనుల సందర్శనకు బయల్దేరిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల బృందానికి శుక్రవారం బస్టాండ్ ప్రాంగణంలో ఊహించని రీతిలో అత్యంత ఘనంగా, అపూర్వ స్వాగతం లభించింది. రాష్ట్ర ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షురాలు కందుల సంధ్యారాణి స్వయంగా ముందడుగు వేసి ప్రజాప్రతినిధులను శాలువాలతో సత్కరిస్తూ, పుష్పగుచ్ఛాలు అందించి సాదరంగా ఆహ్వానించిన ఈ కార్యక్రమానికి పార్టీ శ్రేణులతో పాటు స్థానిక ప్రజలు సైతం భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఇదే వేదికపై భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) ప్రతినిధులు కందుల సంధ్యారాణి నేతృత్వంలో సింగరేణి గని కార్మికుల దశాబ్దాల నాటి వేదనను, వారి న్యాయమైన డిమాండ్లను ప్రతిబింబించేలా ఒక సమగ్ర వినతిపత్రాన్ని నేతలకు సమర్పించారు. ఆ పత్రంలో కేవలం సమస్యలను ప్రస్తావించడమే కాకుండా, భూగర్భ గనుల్లో ప్రాణాలకు తెగించి పనిచేసే కార్మికుల భద్రత, పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాల పెంపు, అత్యాధునిక వైద్య సౌకర్యాల కల్పన, పదవీ విరమణ ప్రయోజనాలతో పాటు ఉద్యోగ భద్రత వంటి అత్యంత కీలకమైన ఐదు అంశాలను వివరించారు. స్పందించిన బీజేపీ ప్రజాప్రతినిధులు తాము కేవలం మొక్కుబడి పర్యటన కోసం కాకుండా, శ్రీరాంపూర్ ఓపెన్‌కాస్ట్ మరియు అండర్‌గ్రౌండ్ గనుల్లోని వాస్తవ పరిస్థితులను, మైనింగ్ రంగంలో కార్మికులు ఎదుర్కొంటున్న ప్రత్యక్ష సవాళ్లను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకే వెళ్తున్నామని స్పష్టం చేశారు. నల్లబంగారం వెలికితీసే కార్మికుల కష్టాలను, వారి ఇబ్బందులను లోతుగా అధ్యయనం చేసి, వాటి శాశ్వత పరిష్కారం కోసం అసెంబ్లీ వేదికగా, ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లి గట్టిగా పోరాడుతామని ఈ సందర్భంగా వారు హామీ ఇచ్చారు. నేతల హామీతో సింగరేణి ప్రాంతంలో కొత్త ఆశలు చిగురించగా, ఈ కీలక పర్యటన కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు, వారి చిరకాల సమస్యల పరిష్కారానికి ఒక బలమైన ముందడుగు అవుతుందని కార్మిక సంఘాల నాయకులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ స్వాగత కార్యక్రమంలో మండల అధ్యక్షులు ఊరగొండ అపర్ణ మాజీ మండల అధ్యక్షులు కోడూరు రమేష్,జక్కన బాలు, ఎల్తూరి సరిత,బూడిద హర్ష,బండారి శ్యాం పటేల్, అంకరి భరత్,రాజ్ కుమార్ చారి, బియ్యాల మహేందర్ వకులాభరణం వేణు ,కొట్టె ప్రవీణ్, మీస వికాస్, సిలారపు కళ్యాణ్,గుండబోయిన పృధ్వి,చింత అంజి, శ్రీనివాస్, అరవింద్ ,తోట రవి,సింగారం శ్రీకాంత్,రేకుర్తి సందీప్,వంశీ, రేకుర్తి సందీప్,ఏరుకొండ తిరుపతి,వంశీ తదితరులు పాల్గొన్నారు.

# భూ సేకరణ ప్రక్రియ వేగవంతం కావాలి

**- భూసేకరణపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం**

**- జిల్లా కలెక్టర్,గద్వాల ఎమ్మెల్యే**



గద్వాల జూన్ 19 (విజన్ ఆంధ్ర బ్యూరో) : జిల్లాలోని వివిధ ప్రాజెక్టుల భూ సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డితో కలిసి నెట్టెంపాడు, గట్టు ఎత్తిపోతల పథకాలతో పాటు మల్లమ్మ కుంట రిజర్వాయర్ నిర్మాణానికి అవసరమైన భూసేకరణపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో భూసేకరణ ఆలస్యం కావడంపై ప్రభుత్వం సీరియస్ గా ఉందని, భూ సేకరణ ప్రక్రియను వేగవంతం చేసేందుకు రెవిన్యూ, సర్వే, ఇరిగేషన్ శాఖల అధికారులతో కలిపి ఏర్పాటు చేసిన ప్రత్యేక టీములు సమన్వయంతో పని చేయాలన్నారు. గట్టు ఎత్తిపోతల పథకంలో భాగంగా రిజర్వాయర్, సమాంతర కాలువల నిర్మాణానికి ఇంకా అవసరమైన భూసేకరణ వేగవంతం కావాలన్నారు. నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంలో భాగంగా వివిధ ప్యాకేజీలలో పెండింగ్ లో ఉన్న 541 ఎకరాల్లో గత 15 రోజుల్లో 56 ఎకరాలకు ప్రిలిమినరీ డిక్లరేషన్ ఇచ్చినందున మిగిలిన భూసేకరణ కూడా చేపట్టాలన్నారు. మల్లమ్మ కుంట రిజర్వాయర్ నిర్మాణానికి అవసరమైన భూసేకరణను కూడా వేగవంతం చేయాలన్నారు. భూ సేకరణకు సంబంధించి ఎవరైనా రైతుల నుంచి అభ్యంతరాలు వ్యక్తమైతే సంబంధిత గ్రామాల్లో సభలు నిర్వహించి ప్రాజెక్టుల ఆవశ్యకత, ప్రభుత్వ అవసరాల గురించి వివరించి ఒప్పించాలన్నారు. ఇక నుంచి ప్రతి శుక్రవారం జిల్లాలో ప్రాజెక్టుల భూసేకరణకు సంబంధించి రివ్యూ నిర్వహించడం జరుగుతుందని సంబంధిత అధికారులు భూసేకరణ విషయంలో ఎప్పటికప్పుడు పురోగతిని సాధించి నివేదికలు సమర్పించాలన్నారు. అనంతరం ఆయా మండలాల వారీగా వివిధ గ్రామాల పరిధిలో చేపట్టాల్సిన భూసేకరణ పై సంబంధిత మండలాల అధికారులతో క్షుణ్ణంగా మాట్లాడారు. ఈ సమావేశంలో భూ సేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కృష్ణ, ఆర్డీవో శ్రీనివాసరావు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు మనోజ్ కుమార్ రెడ్డి, రాజ్ కుమార్, కలెక్టరేట్ ఏవో భూపాల్ రెడ్డి, ఇరిగేషన్ శాఖ ఈఈలు సంజీవ్ ప్రసాద్, శ్రీనివాసులు, ఇతర ఇంజనీర్లు, ఆయా మండలాల తహసిల్దార్ లు, సర్వే అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# భూ సమస్యల పరిష్కారంలో జాప్యం వద్దు

**- ప్రిన్సిపల్ సెక్రటరీ**

**- భూధార్, సాదా బైనామా, రీ-సర్వే పనులు టైమ్‌బౌండ్‌గా పూర్తి చేయాలి.**

**- రెవెన్యూ సేవల్లో పారదర్శకతే ప్రధానం : డి.ఎస్. లోకేష్ కుమార్**



ములుగు జూన్ 19 , విజన్ ఆంధ్ర ప్రతినిధి : భూధార్ సర్వే, భూభారతి దరఖాస్తుల పరిష్కారాన్ని వేగవంతం చేయాలని, సాదా బైనామా, నాన్-కడాస్ట్రల్ గ్రామాల రీ-సర్వే ప్రక్రియలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డి.ఎస్. లోకేష్ కుమార్, జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి పలు జిల్లాల కలెక్టర్లతో భూధార్ సర్వే, భూభారతి, సాదా బైనామా, రీ-సర్వే, నక్షా డిజిటల్ మ్యాపింగ్ తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ములుగు జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు,అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సి. హెచ్. మహేందర్ జి ఈ సమావేశంలో పాల్గొన్నారు. ప్రిన్సిపల్ సెక్రటరీ మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న భూధార్ సర్వే ను వేగంగా పూర్తి చేసి ప్రతి భూ యజమానికి ఖచ్చితమైన వివరాలు నమోదు చేయాలన్నారు. భూభారతి దరఖాస్తులను జాప్యం లేకుండా పరిశీలించి సకాలంలో పరిష్కరించాలని సూచించారు. సాదా బైనామా దరఖాస్తులను ప్రాధాన్యతగా తీసుకొని అర్హులకు వెంటనే న్యాయం చేయాలని, భూములకు సంబంధించిన పెండింగ్ అంశాలు క్లియర్ చేయాలని ఆదేశించారు. నాన్-కడాస్ట్రల్ గ్రామాల రీ-సర్వే ను గడువులోగా పూర్తి చేయాలని, ఎంపిక చేసిన గ్రామాల్లో నక్షా డిజిటల్ భూ మ్యాపింగ్ పనులు నాణ్యతతో చేపట్టాలన్నారు. హద్దుల నిర్ధారణలో పారదర్శకత పాటిస్తూ భూ రికార్డుల ఆధునీకరణకు చర్యలు తీసుకోవాలని కోరారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు రెవెన్యూ అధికారులతో సమీక్షించారు. రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాలను గడువులోగా పూర్తి చేసేందుకు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ విజయభాస్కర్, సంబంధిత రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

# కేంద్ర నిధుల పనులు వేగవంతం చేయాలి

**- ఎంపీ బలరాం నాయక్**

**- దిశా సూచనల మేరకు లక్ష్యాలు పూర్తి చేస్తాం: కలెక్టర్ హేమంత్**

**- దిశా సమావేశంలో అధికారులకు ఆదేశాలు.**



ములుగు జూన్ 19, విజన్ ఆంధ్ర ప్రతినిధి : కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనుల్లో పురోగతి కనిపించాలని, సంక్షేమ పథకాల లబ్ధి అర్హులైన ప్రతి ఒక్కరికీ సకాలంలో అందాలని లిమహబూబాబాద్ ఎంపీ, దిశా కమిటీ చైర్మన్ పోరిక బలరాం నాయక్‌లి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో దిశా కమిటీ సమావేశం ఆయన అధ్యక్షతన జరిగింది. పీఎం ఆవాస్ యోజన, జల్ జీవన్ మిషన్, ఎంజీఎన్ఆర్ఈజీఎస్ తదితర కేంద్ర పథకాల అమలు తీరును ఎంపీ సమీక్షించారు. నిధుల వినియోగంలో జాప్యం లేకుండా, పనుల నాణ్యతతో లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత పాటించాలని, క్షేత్రస్థాయిలో పర్యటించి పనులు పరిశీలించాలని కోరారు. జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు మాట్లాడుతూ, దిశా కమిటీ ఇచ్చిన సూచనలు, ఆదేశాల మేరకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి కేంద్ర ప్రభుత్వ పథకాల లక్ష్యాలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేసి ప్రగతి నివేదికలు సమర్పించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో మహిళా కమిషన్ సభ్యురాలు రాధాబాయి, ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, డీఎఫ్ఓ వికాస్ మీనా, అదనపు కలెక్టర్ సంపత్ రావు, దిశా సభ్యులు పూర్ణచందర్ తదితరులు పాల్గొన్నారు.

# లేబర్ కార్డుల కోసం మధ్య దళారులను నమ్మి మోసపోవద్దు


**- జిల్లా లేబర్ ఆఫీసర్ వేణుగోపాల్**



గద్వాల జూన్ 19 (విజన్ ఆంధ్ర బ్యూరో) : భవన, ఇతర నిర్మాణ కార్మికులు లేబర్ కార్డుల నమోదు లేదా పునరుద్ధరణ కోసం మధ్య దళారులను ఆశ్రయించి మోసపోవద్దని జిల్లా లేబర్ ఆఫీసర్ వేణుగోపాల్ తెలిపారు. శుక్రవారం గద్వాల మండలంలోని నది అగ్రహారం గ్రామంలో భవన , ఇతర నిర్మాణ కార్మికుల నమోదు, పునరుద్ధరణ, సంక్షేమ పథకాలు, కార్మికుల హక్కులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, 18 నుంచి 60 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి, గత 12 నెలల్లో కనీసం 90 రోజులు భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పరిధిలోని 54 రకాల నిర్మాణ వృత్తుల్లో పనిచేస్తున్న కార్మికులు సభ్యత్వం పొందడానికి అర్హులని వివరించారు.నమోదైన కార్మికులకు ప్రసూతి సహాయం, వివాహ సహాయం, విద్యా సహాయం, ప్రమాద/సహజ మరణ పరిహారం, అంత్యక్రియల ఖర్చులు తదితర సంక్షేమ పథకాలు అందుబాటులో ఉంటాయని చెప్పారు. కార్మికులు ఆధార్ కార్డు, బ్యాంకు పాస్ బుక్, మొబైల్ నంబర్, ఫోటోలు, ఉపాధి ధ్రువీకరణ పత్రంతో సమీప మీ సేవ కేంద్రంలో రూ.110 సేవా రుసుము చెల్లించి రసీదు తీసుకుని, కలెక్టరేట్ గది నెం.23 లోని జిల్లా లేబర్ కార్యాలయంలో నమోదు పూర్తి చేసుకోవాలని సూచించారు. సహజ మరణం, ప్రమాద మరణానికి సంబంధించిన క్లెయిమ్‌ల నిర్వహణ బాధ్యతను ప్రభుత్వం ట్రైల్ బ్లేజర్ ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీకి అప్పగించినట్లు తెలిపారు. ఈ క్లెయిమ్‌లకు సంబంధించిన నామినీలు, అర్హులైన కుటుంబ సభ్యులు అవసరమైన పత్రాలతో జిల్లా లేబర్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ట్రైల్ బ్లేజర్ కంపెనీ ప్రతినిధి కార్తీక్ (మొబైల్: 7331119174) ను సంప్రదించి క్లెయిమ్ దరఖాస్తులను సమర్పించుకోవచ్చని వివరించారు.తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో మోసాలకు పాల్పడుతున్న మధ్యవర్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎలాంటి సందేహాలు లేదా ఫిర్యాదులు ఉన్నా నేరుగా జిల్లా లేబర్ కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు. ఈ అవగాహన కార్యక్రమంలో గ్రామంలోని నిర్మాణ కార్మికులు, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితా సవరణను పకడ్బందీగా నిర్వహించాలి - సి.సుదర్శన్ రెడ్డి

ఆదిలాబాద్, జూన్ 19 (విజన్ ఆంధ్ర): సార్-2026 ఓటర్ల జాబితా సవరణ అత్యంత పకడ్బందీగా నిర్వాహించాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సి.సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం హైదరాబాద్ నుండి జిల్లా కలెక్టర్లు, ఎన్నికల అధికారులకు సార్ -2026 ఓటర్ల జాబితా సవరణపై ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి దిశ నిర్దేశం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టరేట్ విసి హాల్ నుండి కలెక్టర్ రాజర్షి షా పాల్గొని జిల్లా నివేదికను వివరిస్తూ, జిల్లాలో ఓటర్ల నమోదు, సవరణ ప్రక్రియకు సంబంధించి బీఎల్ఓ, బీఎల్ఏల శిక్షణ, కిట్ల పంపిణీ ఇప్పటికే పూర్తయిందని వివరించారు. ఎన్యుమరేషన్ ఫారాలను ఇప్పటికే అందించామని, ఈ నెల 23 నాటికి అవి అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ఓటర్లలో అవగాహన కోసం జిల్లా, మండల కేంద్రాల్లో హోర్డింగుల ద్వారా విస్తృత ప్రచారం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.



క్షేత్రస్థాయి పరిశీలన కోసం ఏఈఆర్ఓలు, ఈఆర్ఓలు, డిప్యూటీ డీఈఓలతో నిరంతరం తనిఖీలు నిర్వహిస్తున్నామని వెల్లడించారు. ఇంకా మ్యాపింగ్ కాని ఓటర్లను గుర్తించి, మార్పులు-చేర్పులు చేపట్టాలని బీఎల్ఓలను ఆదేశించినట్లు చెప్పారు. ఫారాల సేకరణ, డిజిటలైజేషన్ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షిస్తామని, ఈ ప్రక్రియలో సహాయం కోసం ఎలాంటి రాజకీయ అనుబంధం లేని స్థానిక వాలంటీర్లను మాత్రమే ఎంపిక చేశామని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఆర్.ఎస్. చిత్రూ, ఆర్డీఓ జగదీశ్వర్ రావు, ఎన్నికల విభాగం పర్యవేక్షకురాలు నలంద ప్రియ, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్ జిల్లాలో ప్రజా పాలన జయకేతనం

## జిల్లాలో ప్రజా పాలన విజయవంతం

- ప్రజాపాలన ప్రగతి ప్రణాళికతోప్రజల జీవితాల్లో గణనీయ మార్పు..
- ప్రజా ప్రతినిధులు అధికారుల సమన్వయంతో సక్సెస్ ఫుల్
- 99 రోజులు.. 10 ప్రధాన అంశాలు.. ప్రజల భాగస్వామ్యంతో సమగ్ర అభివృద్ధి
- గ్రామం నుంచి జిల్లా స్థాయి వరకు విజయవంతమైన కార్యాచరణ
- పారదర్శక పరిపాలన.. వేగవంతమైన సేవలు సుస్థిర అభివృద్ధికి నూతన దిశ





**కరీంనగర్, జూన్ 19 (విజన్ ఆంధ్ర ) :**
99 రోజులపాటు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమం కరీంనగర్ జిల్లాలో చారిత్రాత్మకంగా నిలిచింది. ప్రజల జీవితాల్లో పెను మార్పులను తీసుకొచ్చింది. గ్రామ గ్రామాన వార్డు మెంబర్ నుంచి మంత్రుల వరకు.. మరోపక్క పంచాయతీ కార్యదర్శి నుంచి జిల్లా కలెక్టర్ వరకు.. అందర్నీ భాగస్వామ్యం చేసింది ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక. ఇంతకు మునుపెన్నడూ జరగని విధంగా ఈ కార్యక్రమం 99 రోజులపాటు నిరాటకంగా జరగడం విశేషం. అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు మరింత చేరువ అయ్యేలా చేసింది. జిల్లా ఇన్చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు , మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ నేతృత్వంలో జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో కరీంనగర్ జిల్లాలో విజయవంతంగా ఈ కార్యక్రమం ముగిసింది. 10 ప్రధాన అంశాలపై షెడ్యూల్ వారీగా నిర్వహించి పాలన ప్రజలకు మరింత చేరువైంది. కరీంనగర్ జిల్లాలో మార్చి 6 నుంచి జూన్ 12, 2026 వరకు అమలైన ఈ కార్యక్రమం గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిల్లో అద్భుతంగా జరిగింది. తద్వారా కరీంనగర్ జిల్లా ప్రగతి ప్రధాన నిలిచేందుకు దోహదపడింది. కరీంనగర్, మానకొండూరు, చొప్పదండి, హుజురాబాద్ నియోజకవర్గాల్లో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజల ముందు ఉంచింది. కరీంనగర్ జిల్లా ఆదర్శంగా నిలిచింది. మంత్రుల ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో అన్ని శాఖల అధికారుల సమన్వయంతో ప్రజల సహకారంతో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక దిగ్విజయంగా పూర్తయింది. చొప్పదండి శాసనసభ్యులు మేడిపల్లి సత్యం, మానకొండూర్ శాసనసభ్యులు కవ్వంపల్లి సత్యనారాయణ, మేయర్ కొలగాని శ్రీనివాస్, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం, పలువురు ప్రజా ప్రతినిధులు ప్రజా పాలన కార్యక్రమం నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించారు.

### మంత్రుల సమక్షంలో ఘనంగా ప్రారంభమైన కార్యక్రమం

ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణకు 2026 మార్చి 6న కరీంనగర్ కలెక్టరేట్ ఆడిటోరియంలో శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి వ్యవసాయ శాఖ మంత్రి, జిల్లా ఇన్చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రభుత్వ విప్ లు ఆది శ్రీనివాస్ , చింతకుంట విజయ రమణారావు ఎంపీలు ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు , ఉమ్మడి జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, పలువురు అధికారులు హాజరయ్యారు.

### పరిశుభ్రత.. ఫైళ్ల పరిష్కారంలో ప్రధాన పాత్ర.

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో మొట్టమొదటి అంశం ఫైళ్ళ పరిష్కారం పరిశుభ్రత కార్యక్రమం. జిల్లాలోని 318 గ్రామపంచాయతీలు కరీంనగర్ కార్పొరేషన్ తో పాటు హుజురాబాద్ జమ్మికుంట చొప్పదండి మున్సిపాలిటీల్లో పెద్ద ఎత్తున పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలో పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు, మార్కెట్లు, హాస్టళ్లు, శ్మశానవాటికలు, బస్టాండ్లలో పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టారు. పరిశుభ్రతకు నోచుకోని ఆయా కేంద్రాలు ప్రస్తుతం శోభాయమానంగా తయారయ్యాయి. ప్రభుత్వం చేపట్టిన పరిశుభ్రత కార్యక్రమం మంచి ఫలితాలను ఇచ్చింది. ప్రభుత్వ కార్యాలయాల్లో పాత సామగ్రిని తొలగించి పరిశుభ్రత చర్యలు చేపట్టారు. అదేవిధంగా ఫైళ్ల పరిష్కారానికి ప్రధానంగా కృషి చేశారు. జననమరణ ధ్రువపత్రాలు, వ్యాపార లైసెన్సులు, మ్యుటేషన్లు, లేఅవుట్ అనుమతులు, ఈ–ఆఫీస్ ఫైళ్లతో కలిపి మొత్తం 4,290 ఫైళ్లను జిల్లాలో పరిష్కరించారు. భూభారతి కింద అందిన 239 దరఖాస్తులను పరిష్కారానికి అధికారులు ఉన్నతాధికారులకు పంపించారు. ఇంటి వద్దే చెత్త వర్గీకరణ, హోం కంపోస్టింగ్, ప్లాస్టిక్ నిషేధం, ఈ–వేస్ట్ సేకరణ, ఫాగింగ్, బ్లీచింగ్, డ్రైనేజీల పూడికతీత కార్యక్రమాలు చేపట్టారు.






### అరైవ్ అలైవ్ రాష్ట్ర వ్యాప్తంగా గుర్తింపు..

**- రోడ్డు ప్రమాదాల నియంత్రణలో ముందడుగు..**

ఏప్రిల్ 13 నుంచి 18 వరకు జిల్లాలో రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన అరైవ్ అలైవ్ కార్యక్రమం సత్ఫలితాలను ఇచ్చింది. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ముందడుగు పడింది. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో వినూత్నమైన కార్యక్రమాలు నిర్వహించి ప్రజల్లో నూతన మార్పు తీసుకొచ్చారు. 318 గ్రామపంచాయతీల్లో రోడ్డు భద్రత గ్రామసభలు నిర్వహించి 2,986 మంది సభ్యులతో కమిటీలు ఏర్పాటు చేశారు. హెల్మెట్, సీటుబెల్ట్ వినియోగం, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. 19 ప్రాంతాల్లో గోల్డెన్ అవర్ స్పందన శిక్షణ, రాహవీర్, పీఎం రాహత్ పథకాలపై కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా రోడ్డు ప్రమాదాలు, మరణాలు సంఖ్య గణనీయంగా తగ్గింది. జీరో ఎన్ఫోర్స్మెంట్ డే సందర్భంగా హెల్మెట్ ధరించిన వాహనదారులను పూలతో అభినందించారు. అత్యధికంగా జిల్లాలో రోడ్డు ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్లుగా గుర్తించి వాటి నియంత్రణకు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. ప్రజలు ప్రయాణికుల నుంచి మంచి స్పందన లభించింది. సైబర్ నేరాలు, ఆన్లైన్ మోసాలు, పిల్లల భద్రతపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. అనాథ, విడిచిపెట్టబడిన పిల్లలపై సర్వే చేపట్టారు. నాలుగు నియోజకవర్గాల్లో డ్రగ్స్ వ్యతిరేక అవగాహన సమావేశాలు నిర్వహించారు.

### అన్నదాతకు అండగా..

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో రైతు వారోత్సవాల్లో భాగంగా అన్నదాతకు అండగా నిలిచారు. రైతుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం ఇచ్చారు. తెలంగాణ ఆర్గానిక్స్ మొబైల్ యాప్ను ప్రారంభించారు. 76 రైతు వేదికల్లో నేల ఆరోగ్యం, సమతుల్య ఎరువుల వినియోగం, సహజ వ్యవసాయం, వినియోగదారులు ఇష్టపడే వరి రకాలపై అవగాహన కల్పించారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యామ్నాయ పంటల సాగు చేపట్టాలని రైతులను ప్రోత్సహించారు. అదేవిధంగా ఫామ్ ఆయిల్ పంటను అత్యధికంగా పండించాలని అధికారులు గ్రామ గ్రామానా విస్తృత ప్రచారం నిర్వహించారు. హార్టికల్చర్, మార్కెటింగ్, పశు సంవర్ధక, నీటిపారుదల శాఖలు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాయి. "ఖేతీ బచావో అభియాన్" ద్వారా జీవ ఎరువుల వినియోగాన్ని ప్రోత్సహించారు. రైతు భరోసా పథకం ద్వారా 1,93, 544 మంది రైతులకు 143.55 కోట్లు నేరుగా రైతుల ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసింది. మరణించిన 206 మంది రైతు కుటుంబాలకు రైతు బీమా ద్వారా ప్రభుత్వం ఇప్పటివరకు 13.35 కోట్లు ఆర్థిక సహాయం అందించింది. అదేవిధంగా ఈ సీజన్లో 319 కొనుగోలు కేంద్రాల ద్వారా దాదాపు మూడు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి రాష్ట్రంలోనే కరీంనగర్ జిల్లా ఆదర్శంగా నిలిచింది. తద్వారా 554 కోట్లు రైతులకు ప్రభుత్వం అందించింది. అదేవిధంగా 23,710 మెట్రిక్ టన్నుల మొక్కజొన్నను కొనుగోలు చేశారు.

### సంక్షేమ పథకాల అమలులో ఆదర్శం..

**లక్షలాది కుటుంబాలకు అపన్న హస్తం.**

సంక్షేమ పథకాల అమల్లో కరీంనగర్ జిల్లా ఆదర్శంగా నిలిచింది. లక్షలాది కుటుంబాలకు అపన్న హస్తం అందిస్తోంది. జిల్లాలో కొత్తగా 45,920 రేషన్ కార్డులు మంజూరు చేసి వేలాది కుటుంబాలకు ఆహార భద్రత కల్పించారు. రేషన్ కార్డులో 96,775 కొత్త సభ్యుల పేర్లను చేర్చారు. 3.20 లక్షల కుటుంబాలకు ప్రతినెల 6,021 మెట్రిక్ టన్నుల సన్న బియ్యం పంపిణీ చేస్తున్నారు. అదేవిధంగా మహిళల ఆర్థిక సాధికారత కోసం అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకం కింద ఆర్టీసీ బస్సుల్లో మహిళలు చేసిన 7.39 కోట్ల ఉచిత ప్రయాణాలకు గాను రూ. 334 కోట్ల లబ్ధి చేకూరింది. జిల్లాలో 1.58 లక్షల మంది లబ్ధిదారులకు 9.23 లక్షల గ్యాస్ సిలిండర్లను రూ.500 రూపాయలకే అందిస్తున్నారు. అందుకోసం ప్రభుత్వం 29.78 కోట్ల వెచ్చిస్తున్నది. అదేవిధంగా గృహ జ్యోతి పథకం ద్వారా జిల్లాలో 1.73,627 మంది వినియోగదా రులకు రూ.153 కోట్ల లబ్ది చేకూరింది. ఇందిరమ్మ పథకం కింద జిల్లాలో 10,114 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు. 7000 కి పైగా ఇండ్లు నిర్మాణ దశలో ఉన్నాయి. 2100 కుటుంబాలు గృహప్రవేశం పూర్తి చేసుకున్నాయి. 100% ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పై జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది. వేగవంతంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటుంది.



### వైద్యా ఆరోగ్య రంగానికి పెద్ద పీట

వైద్యం ఆరోగ్య పరిరక్షణకు పెద్దపీటవేశారు.ఆహార భద్రత, సురక్షిత మాతృత్వం, ఎయిడ్స్ నివారణ, ఆయుష్, హోమియోపతి సేవలపై వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లాలో వివిధ ప్రాంతాలతో పాటు కరీంనగర్ ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఆధ్వర్యంలో విస్తృతమైన కార్యక్రమాలు చేపట్టారు. ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించారు. నాణ్యమైన ఔషధాల లభ్యత, నియంత్రణ వ్యవస్థ బలోపేతానికి చర్యలు చేపట్టారు. ప్రజలకు మరింత మెరుగైన వైద్య సదుపాయం అందేలా జిల్లా యంత్రాంగం తరఫున ప్రత్యేక కృషి చేశారు. కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా ప్రభుత్వ ఆసుపత్రులను తీర్చిదిద్దడంలో కరీంనగర్ జిల్లా ప్రముఖ పాత్ర పోషిస్తున్నది.

### సంక్షేమ విద్యా సంస్థలకు... కొత్త రూపు

అన్ని సంక్షేమ విద్యాసంస్థల్లో ప్రత్యేక కార్యక్రమాల ద్వారా కొత్త రూపు తీసుకొచ్చారు. అన్ని సంక్షేమ విద్యాసంస్థల్లో పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించి ఆహార భద్రత కమిటీలను ఏర్పాటు చేశారు. 1,220 మంది విద్యార్థులతో ప్రతిభా ఉత్సవాలు నిర్వహించారు. విద్య, ఆరోగ్యం, పోషణ, క్రమశిక్షణ, కెరీర్ మార్గదర్శకతపై తల్లిదండ్రుల సమావేశాలు నిర్వహించారు. సంక్షేమ విద్యాసంస్థలకు కొత్త రూపు తీసుకొచ్చి మొత్తంగా తీర్చిదిద్దారు. ప్రభుత్వం నాణ్యమైన విద్య బోధన అందిస్తున్నది. అదేవిధంగా ప్రభుత్వం రుచికర భోజనం సన్నబియ్యంతో అందిస్తున్నది. ప్రభుత్వ పాఠశాలల్లో హాజరు శాతం పెంచేందుకు జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. గణనీయ మార్పును తీసుకొచ్చారు. బడిబాట కార్యక్రమం ద్వారా 202627 విద్యా సంవత్సరానికి 5,102 ప్రవేశాల లక్ష్యంతో ప్రత్యేక చర్యలు చేపట్టారు. 11 భవిత కేంద్రాలు, ఐదు వంటశాల భవనాలు, ఒక సైన్స్ ల్యాబ్ను ప్రారంభించారు. 17 పీఎం శ్రీ పాఠశాలల్లో సమ్మర్ క్యాంపులు నిర్వహించారు. జేఈఈ, నీట్, క్లాట్ కోచింగ్ కార్యక్రమాలు చేపట్టారు. తల్లిదండ్రుల సమావేశాలు, లైబ్రరీ డే, కళలుసంస్కృతి దినోత్సవం, విద్యా విజయోత్సవం నిర్వహించారు. మొత్తానికి విద్య శాఖ బలోపేతానికి జిల్లా యంత్రాంగం విద్యాశాఖ సమన్వయంతో ప్రత్యేక చర్యలు చేపట్టింది.

### నిరుద్యోగులకు ఉపాధి కల్పన లక్ష్యంగా ముందుకు..


జిల్లాలో పెద్ద ఎత్తున నిరుద్యోగులకు వివిధ ప్రైవేటు కంపెనీల్లో ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించేందుకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా జిల్లా కేంద్రం కలెక్టరేట్లో మెగా జాబ్ మేళా నిర్వహించారు. నిరుద్యోగ యువతీ యువకుల నుంచి విశేష స్పందన లభించింది. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో ఈ జాబ్ మేళా దిక్సూచిగా పనిచేసింది. ఈ మేళాలో 78 వివిధ ప్రైవేట్ కంపెనీలు పాల్గొనగా, దాదాపు 300 మందికి ఉద్యోగ అవకాశాలు లభించాయి. కరీంనగర్ జిల్లాలో హుజురాబాద్ చొప్పదండి ఇతర చోట్ల ప్రతి మూడు నెలలకు ఒకసారి మెగా జాబ్ మేళా లు నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ప్రణాళిక రూపొందిస్తున్నారు.

### రాష్ట్రానికే దిక్సూచి.. కరీంనగర్ జిల్లా

99 రోజుల కార్యక్రమం ప్రజల ఆకాంక్షలను ఫలితాలుగా మలిచిన సమగ్ర అభివృద్ధి యజ్ఞం. ప్రభుత్వ దృఢ సంకల్పం, జిల్లా యంత్రాంగం సమర్థ నిర్వహణ, ప్రజాప్రతినిధుల చొరవ, ప్రజల చురుకైన భాగస్వామ్యం కలిసొచ్చినప్పుడు మార్పు ఎంత వేగంగా సాధ్యమవుతుందో కరీంనగర్ జిల్లా ఆచరణలో చాటిచెప్పింది. రైతుకు అండగా, మహిళకు ఆత్మవిశ్వాసంగా, యువతకు అవకాశాల వేదికగా, విద్యార్థులకు ఆశల పునాదిగా, గ్రామాలకు పరిశుభ్రతగా, సమాజానికి చైతన్య స్ఫూర్తిగా ఈ ప్రణాళిక ప్రతి రంగంలో స్పష్టమైన ప్రభావాన్ని చూపించింది. పాలన కార్యాలయాల గోడలకే పరిమితం కాకుండా ప్రజల గడపకు చేరినప్పుడు, సంక్షేమ పథకాలు కేవలం గణాంకాలుగా కాకుండా కుటుంబాల జీవితాల్లో వెలుగులు నింపినప్పుడు, అభివృద్ధి కార్యక్రమాలు ప్రచారంగా కాకుండా ప్రజల అనుభవాలుగా మారినప్పుడు కలిగే సానుకూల మార్పులకు ఈ 99 రోజుల ప్రగతి ప్రణాళిక ప్రత్యక్ష నిదర్శనంగా నిలిచింది. కాలవ్యవధి 99 రోజులే అయినప్పటికీ... ఈ ప్రగతి ప్రస్థానం ప్రభావం మాత్రం దీర్ఘకాలం నిలిచేలా ఉంది. ప్రజల భాగస్వామ్యంతో పాలనను మరింత చేరువ చేసిన కరీంనగర్ జిల్లా, సమగ్ర అభివృద్ధికి కొత్త ప్రమాణాలను నెలకొల్పుతూ తెలంగాణకు ఆదర్శంగా అవతరించింది. అందుకే ఈ 99 రోజుల ప్రగతి కేవలం ఒక కార్యక్రమం విజయకేతనం కాదు; ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకున్న పాలనకు ప్రతీకగా, కరీంనగర్ జిల్లాకు దక్కిన సరికొత్త గుర్తింపుగా చరిత్రలో నిలిచిపోనుంది.

# భూధార్ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

## రాష్ట్ర రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ లోకేష్ కుమార్



నిర్మల్ జిల్లా,జూన్ 19(విజన్ ఆంధ్ర); భూధార్ సర్వేను పకడ్బందీగా నిర్వహించి, భూ సంబంధిత దరఖాస్తుల పరిష్కారంలో జాప్యం లేకుండా చర్యలు చేపట్టాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ లోకేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి జిల్లాల కలెక్టర్లు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన ఆయన, జిల్లాల్లో భూధార్ సర్వే చేపట్టేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని, సర్వేయర్లను ఈ ప్రక్రియలో భాగస్వామ్యం చేయాలని సూచించారు. పెండింగ్లో ఉన్న సాదాబైనామా దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలని, అలాగే భూభారతి దరఖాస్తులను నిర్ణీత 60 రోజుల గడువులోగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి వీడియో కాన్ఫరెన్స్లో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, భూధార్ సర్వే నిర్వహణకు అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలని, సాదాబైనామా దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని, భూభారతి దరఖాస్తుల పరిష్కారంలో ఎలాంటి ఆలస్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్లో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, డీఆర్వో రాథోడ్ రమేష్, ఏడి ల్యాండ్ సర్వేయర్ నరసింహమూర్తి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, వసతుల కల్పనే లక్ష్యం

**- దిలవార్పూర్ కేజీబీవీలో ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**

**- విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం**

**- మెనూ ప్రకారం భోజనం అందించాలని ఆదేశం**





నిర్మల్ జిల్లా,జూన్ 19(విజన్ ఆంధ్ర); ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మౌలిక సదుపాయాలను మెరుగ్గా అందించడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు. శుక్రవారం దిలవార్పూర్ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)ను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వసతి గృహంలో విద్యార్థులకు అందుతున్న వసతులు, సౌకర్యాలను పరిశీలించి, పాఠశాల హాజరు పట్టికను తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు, సిబ్బంది సంఖ్యకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం తరగతి గదులను సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. పలు సబ్జెక్టులపై ప్రశ్నలు అడిగి వారి విద్యా నైపుణ్యాలను పరీక్షించారు. పుస్తక జ్ఞానంతో పాటు సామాజిక అంశాలపై అవగాహన పెంపొందించుకోవాలని, ప్రతి విషయాన్ని శ్రద్ధగా నేర్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. వసతి గృహంలోని స్టోర్ రూమ్ను పరిశీలించిన కలెక్టర్, నిల్వ ఉంచిన కూరగాయలు, వంట సరుకుల నాణ్యతను తనిఖీ చేశారు. సరుకులు వచ్చిన వెంటనే వాటి నాణ్యతను పరిశీలించి, నాణ్యమైన సరుకులను మాత్రమే వినియోగించాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారమే ప్రతిరోజూ రుచికరమైన, పోషకాహార భోజనాన్ని విద్యార్థులకు అందించాలని సూచించారు. తనిఖీలో భాగంగా విద్యార్థులతో కలిసి కలెక్టర్ మధ్యాహ్న భోజనం చేశారు. భోజనం రుచి, నాణ్యతపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో ఏవైనా సమస్యలు ఎదురైతే వెంటనే ఉపాధ్యాయుల దృష్టికి తీసుకురావాలని విద్యార్థులకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి భోజన్న, మండల ప్రత్యేక అధికారి (డిఆర్ఓ) రాథోడ్ రమేష్, తహసీల్దార్ ఎజాజ్ అహ్మద్, అధికారులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# రాజగృహలో పుట్టింటి పండగ!!

- ఆడబిడ్డలకు అన్న ప్రేమ కానుక
- అధికారం దిగినా ఆత్మీయత దిగలేదు
- ఒకే పంక్తి, ఒకే కుటుంబం
- చీరే కాదు, చిరునవ్వుల సారే
- పుట్ట మధు, శైలజ దంపతుల ఆతిథ్యానికి ఆడబిడ్డల కళ్లల్లో ఆనందబాష్పాలు

పెద్దపల్లి బ్యూరో చీఫ్, జూన్ 19 (విజన్ ఆంధ్ర): మంథని నియోజకవర్గం మళ్లీ ఒకసారి మానవీయతకు నిలువెత్తు సాక్ష్యంగా నిలిచింది.





మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్, మాజీ చైర్మన్ శైలజ దంపతుల నివాసం 'రాజగృహ' శుక్రవారం నాడు అచ్చం అమ్మగారింటిలా మారిపోయింది. మహాముత్తారం మండలం మీనాజిపేట నుండి తరలివచ్చిన పలువురు ఆడబిడ్డలకు పుట్ట దంపతులు ఎదురెళ్లి మరీ ఆహ్వానం పలికారు. అధికారం దిగిపోయినా, ఆత్మీయత మాత్రం అలాగే ఉందని నిరూపించిన క్షణాలవి.

**ఒకే పంక్తి, ఒకే మనసు**

ప్రోటోకాల్‌లు, హోదాలు పక్కనపెట్టి శైలజ స్వయంగా వడ్డన చేశారు. పప్పు, పులుసు, పచ్చడి, పాయసం ప్రతి ముద్దలోనూ అమ్మ ప్రేమను నింపినట్టుగా సహపంక్తి భోజనం సాగింది. కబుర్ల మధ్య యోగక్షేమాలు అడిగి తెలుసుకున్న మధూకర్ దంపతులు, "మీరు మా ఇంటి ఆడపిల్లలు" అనే భరోసా ఇచ్చారు.

**పుట్టింటి కానుక**

భోజనం అయ్యాక ప్రతి ఒక్కరికీ 'పుట్టింటి చీరే సారె' అందించారు. కొత్త చీర చేతిలో పడగానే చాలామంది కళ్లు చెమ్మగిల్లాయి. "పుట్టింటికి వచ్చినట్టే ఉంది. ఇంత ప్రేమ పంచిన మిమ్మల్ని జీవితంలో మర్చిపోం" అంటూ మహిళలు తమ సంతోషాన్ని పంచుకున్నారు.

**రాజకీయానికి అతీతమైన బంధం**

నిత్యం పేదల బతుకుల కోసం తపించే పుట్ట మధూకర్‌కు ఈ ఆత్మీయత కొత్త కాదు. కానీ అధికారం లేకపోయినా 'రాజగృహ' తలుపులు ఎప్పుడూ ప్రజల కోసం తెరిచే ఉంటాయని మరోసారి చాటిచెప్పారు. ఎమ్మెల్యేగా ఉన్నా, మాజీగా ఉన్నా ప్రజల గుండెల్లో స్థానం సంపాదించుకోవడమే అసలైన రాజకీయం అని ఈ దృశ్యం చెబుతోంది. 'పుట్టింటి ఆత్మీయత'కు బ్రాండ్ అంబాసిడర్‌లా నిలిచిన పుట్ట దంపతుల ఈ చొరవ, నేటి రాజకీయాలకు ఒక మోడర్న్ ఎమోషనల్ బ్లూప్రింట్.

# అంగన్వాడీ బడి... అమ్మ ఒడి!!

- చిన్నారుల కళ్లల్లో 'పూల' మురిపెం
- చెక్స్ చొక్కా.. పూల గౌను.. ప్రౌడ్ మూమెంట్స్
- క్లాస్ లుక్‌లో లిటిల్ జెంటిల్‌మెన్, క్యూట్ ప్రిన్సెస్
- ఇకపై అంగన్వాడీ బడి... ఒక ట్రెండీ 'అమ్మ ఒడి'

*తల్లిదండ్రుల ఆర్థిక కష్టాలు గట్టెక్కేలాగా ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కోసం కృషి చేస్తున్న ప్రభుత్వ ఆలోచనలకు మా వంతు సహాయంగా "విజన్ ఆంధ్ర" అందిస్తున్న స్పెషల్ స్టోరీ*







**హైదరాబాద్, జూన్ 19:**

ఆ బుజ్జాయిల చిరునవ్వులు... ఆ బుడి బుడి అడుగుల సవ్వడులు... ఎప్పుడూ ఒకటే సందడి. కానీ ఈసారి సీన్ మారింది! ఆ ముద్దులొలికే ముఖాల్లో మురిపెం రెట్టింపయ్యింది. ఎందుకంటే, తెలంగాణ ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల్లోని చిన్నారుల కోసం సరికొత్త 'స్టైల్ స్టేట్‌మెంట్' తీసుకొచ్చింది. ఈ ఏడాది నుంచి వీరికి సరికొత్త యూనిఫామ్‌లను అందిస్తూ, అంగన్వాడీలను అచ్చంగా కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ముస్తాబు చేసింది.

**న్యూ లుక్... అదిరిపోయే డిజైన్ కలెక్షన్!!**

నిన్నటివరకు రంగురంగుల బట్టలతో అంగన్వాడీ మెట్లు ఎక్కిన ఆ చిట్టిపొట్టి పాదాలు... ఇప్పుడు ఒకే రకమైన ట్రెండీ డ్రెస్‌లలో మెరిసిపోతున్నాయి. ప్రభుత్వం ఈసారి పిల్లల యూనిఫామ్స్ కలర్ కాంబినేషన్‌ను చాలా స్పెషల్‌గా డిజైన్ చేయించింది.

**టిల్ జెంటిల్‌మెన్ (బాలురు)**

బుడిబుడి అడుగుల మాస్ లీడర్స్ లాంటి బాలురకు... క్లాసిక్ లుక్ ఇచ్చే రెడ్ మరియు యాష్ కలర్ చెక్స్ ఉన్న చొక్కా, దానికి పర్ఫెక్ట్ మ్యాచ్‌గా బ్లూ కలర్ నిక్కరు కేటాయించారు. ఈ డ్రెస్ వేసుకుని కాలర్ ఎగరేస్తుంటే ఆ మురిపెమే వేరు!

**క్యూట్ ప్రిన్సెస్ (బాలికలు)**

ఇక ఇంటి మహాలక్ష్ములైన బాలికల కోసం... ఎంతో అందమైన రెడ్ మరియు యాష్ రంగుల కలయికతో కూడిన ఫ్లోరల్ డిజైన్ (పూల డిజైన్)' ఉండే ఫ్రాక్ లేదా గౌనును రూపొందించారు. ఆ పూల గౌను వేసుకుని ఇళ్ల ముందర తిరుగుతుంటే అచ్చంగా దేవకన్యల్లా కనిపిస్తున్నారు. "ఇంతకాలం ప్రైవేట్ స్కూల్ పిల్లలు ఇలాంటి చెక్స్ చొక్కాలు, ఫ్లోరల్ ఫ్రాక్స్ వేసుకుని ముస్తాబై వెళ్తుంటే... గేటు దగ్గర నిలబడి చూసేవాళ్లం. ఇప్పుడు మా పిల్లలు కూడా అదే రేంజ్‌లో తయారవుతుంటే కళ్లల్లో ఆనందబాష్పాలు వస్తున్నాయ్" అని ఒక తల్లి ఎమోషనల్ అయ్యారు. అద్దంలో తమ సరికొత్త కలర్ కాంబినేషన్ బట్టలను, ఆ పూల డిజైన్లను చూసుకుంటూ ఆ బుజ్జాయిలు పడుతున్న మురిపెం చూస్తే ఎవరికైనా మనసు నిండిపోవాల్సిందే.

**ఒకే లుక్... సరికొత్త జోష్!**

ఈ మార్పు కేవలం దుస్తులకే పరిమితం కాలేదు; పిల్లల మైండ్‌సెట్‌లో ఒక కొత్త కాన్ఫిడెన్స్‌ను నింపింది.

**ఈక్వాలిటీ వైబ్స్:**

పేద, ధనిక అనే తేడా లేకుండా పిల్లలందరూ ఒకే కలర్, ఒకే స్టైల్‌లో కనిపించడంతో అంగన్వాడీల్లో సరికొత్త 'క్లాస్' లుక్ వచ్చింది.




**కార్పొరేట్ స్టైల్, అమ్మ కేర్**

పోషకాహారంతో పాటు ఇప్పుడు బ్రాండెడ్ లుక్ ఉన్న దుస్తులు కూడా ఇవ్వడంతో, అంగన్వాడీ కేంద్రాలు అచ్చంగా 'అమ్మ ఒడి'ని తలపిస్తున్నాయి.

**ట్రెండీ చిన్నారులు**

బడికి వెళ్లడానికి మారాం చేసే పిల్లలు కూడా... ఇప్పుడు ఈ చెక్స్ షర్టులు, పూల గౌన్ల క్రేజ్‌తో ఎప్పుడెప్పుడు రెడీ అవుదామా అని ఎగ్జైట్ అవుతున్నారు.

**బాల్యం వికసించే తోట... అంగన్వాడీ కేంద్రాలు**

అంగన్వాడీ అంటే కేవలం గుడ్డు, పాలు ఇచ్చే కేంద్రం మాత్రమే కాదు... అది ఒక బాల్యం వికసించే అందమైన తోట అని తెలంగాణ ప్రభుత్వం ఈ సరికొత్త యూనిఫామ్స్ నిర్ణయంతో నిరూపించింది. చెక్స్ చొక్కాలు, పూల గౌన్లలో ఉన్న ఆ చిన్నారుల నవ్వులు, వారి తల్లిదండ్రుల కళ్లల్లో ఆనందం చూస్తుంటే ఒక్కటి మాత్రం నిజం అనిపిస్తుంది... "అంగన్వాడీ బడి... ఇప్పుడు నిజంగానే ఒక ట్రెండీ అమ్మ ఒడి!".

**- గడ్డం సంతోష్ రాజ్**
**స్పెషల్ కరస్పాండెంట్ (విజన్ ఆంధ్ర)**

# ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలి

**- రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి**

నిర్మల్ జిల్లా ,జూన్ 19,(విజన్ ఆంధ్ర); స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ నిర్వహణపై రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి, అన్ని జిల్లాల కలెక్టర్లు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించారు. ఈ వీసీ లో భాగంగా ఆయన మాట్లాడుతూ, అన్ని జిల్లాలలో ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఎన్యుమరేషన్ ఫారంల పంపిణీ, తిరిగి స్వీకరణ, తదితర అంశాలను పకడ్బందీగా చేపట్టాలన్నారు. బూత్ లెవెల్ అధికారులకు తప్పనిసరిగా అన్ని అంశాలపై అవగాహన ముఖ్యమన్నారు. జిల్లాల వారిగా ఎస్ఐఆర్ ప్రక్రియ నిర్వహణకు చేపట్టిన చర్యలు, రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశాల వివరాలు కలెక్టర్ల ద్వారా తెలుసుకున్నారు. ప్రక్రియను మొత్తం కలెక్టర్లు,




ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని తెలిపారు. ఈ వీసీ లో భాగంగా జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా మాట్లాడుతూ, ఎస్ ఐ ఆర్ ప్రక్రియను మొత్తం పకడ్బందీగా నిర్వహిస్తామన్నారు. ఇప్పటికే ప్రక్రియకు సంబంధించి వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించినట్లు వివరించారు. ఎస్ఐఆర్ ప్రక్రియను నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తామని వివరించారు. ఈ వీసీలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, డిఆర్ఓ రాథోడ్ రమేష్, ఆర్డీఓ దేవీదాస్, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు స్వాతి, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఅర్. అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న తహసిల్దార్ ఎన్. జ్యోతి



అయిజ జూన్ 19 (విజన్ ఆంధ్ర బ్యూరో) : జోగులాంబ గద్వాల జిల్లా అయిజ మండల కేంద్రంలోని రెడ్డి ఫంక్షన్ హాల్ నందు ట్రైనర్, హెడ్మాస్టర్ తిమ్మారెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐఅర్. పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అయిజ మండల తహసిల్దార్ ఎన్ జ్యోతి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో బి ఎల్ ఓ లకి, వివిధ పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులకు ఎస్ఐఅర్. పై అవగాహన కల్పిస్తూ, అంశాలవారీగా వివరించడం జరిగినది. 2002 ఓటర్ ఓటర్ లిస్ట్ ప్రస్తుతం ఉన్న ఓటర్ లిస్ట్ మ్యాపింగ్ 80 శాతం అయిజ మండలంలో పూర్తి కావడం జరిగినదని, ఓటర్ జాబితాలో ఓట్లు పోతాయని అపోహ పడవద్దు అని వివరించారు. 3. బి ఎల్ ఓ ఒక్క ఎనిమరేషన్ ఫామ్ మూడుసార్లు మీ ఇంటికి చేరవేడుస్తారు సమాచారం ఇచ్చినట్లయితే మీ ఓటు హక్కు పోదు, సమాచారం సమయానికి ఇవ్వకపోతే మీ మీ విలువైన ఓటు కోల్పోతారని, కాబట్టి ఎస్ ఐ ఆర్ పైన అభ్యంతరాలు ఉన్నట్లయితే బిఎల్ఓ లేదా సమాచారం ఇవ్వగలరు. ఈ కార్యక్రమానికి మండల తహసిల్దార్ ఎన్ జ్యోతి, అర్ ఐ. రజినీకాంత్ రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ గోవిందు, ట్రైనర్ హెడ్మాస్టర్ తిమ్మారెడ్డి,సూపర్వైజర్లు, బిఎల్వోలు, పంచాయతీ సెక్రెటరీ, బిఎల్ఏ బూత్ లెవెల్ ఏజెంట్ లు, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# మున్సిపాలిటీ కి చెందిన మహాప్రభువులారా చెత్త డంపింగ్ యార్డ్ దుర్వాసన నుండి రక్షణ కల్పించాలి

## రాఘవేంద్ర కాలని ప్రజలు

గద్వాల జూన్ 19 (విజన్ ఆంధ్ర) : గద్వాల పట్టణం 9వ వార్డు రాఘవేంద్ర కాలనీ సమీపంలో ఏర్పాటు చేసిన మున్సిపల్ చెత్త డంపింగ్ యార్డ్ స్థానిక ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోంది. గతంలో కాలనీకి దూరంగా ఉన్న ఈ డంపింగ్ ప్రదేశం, ప్రస్తుతం కాలనీ విస్తరించడంతో నివాస గృహాల మధ్యలో ఉన్నట్లుగా మారింది. దీంతో ప్రతిరోజూ వివిధ వార్డుల నుండి తీసుకొచ్చే తడి చెత్త, పొడి చెత్తను ఇక్కడే డంప్ చేయడంతో పరిసర ప్రాంతాల్లో భరించలేని దుర్వాసన వ్యాపిస్తోంది. ఉదయం వాకింగ్‌కు వెళ్లే ప్రజలు, విద్యార్థులు, వృద్ధులు, మహిళలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. చెత్త కుప్పల వల్ల దోమలు, ఈగలు విపరీతంగా పెరిగి సమీప ఇళ్లలోకి చేరుతున్నాయని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే దుర్వాసనతో ఇబ్బందులు పడుతుండగా, రానున్న వర్షాకాలంలో పరిస్థితి మరింత దారుణంగా మారే అవకాశం ఉందని వారు ఆందోళన చెందుతున్నారు. పర్యావరణ నిపుణుల అభిప్రాయం ప్రకారం, నివాస ప్రాంతాలకు సమీపంలో చెత్త డంపింగ్ కొనసాగితే డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా, వైరల్ జ్వరాలు, చర్మ వ్యాధులు, శ్వాసకోశ సంబంధిత సమస్యలు పెరిగే ప్రమాదం ఉంది. వర్షాల సమయంలో చెత్తలో నిల్వ ఉండే నీరు దోమల పెంపక కేంద్రాలుగా మారి ప్రజారోగ్యానికి ముప్పుగా పరిణమించే అవకాశం ఉంది. అంతేకాకుండా, చెత్త నుండి వెలువడే దుర్వాసన, విషవాయువులు చిన్నారులు, వృద్ధులు, గర్భిణీలు, అనారోగ్యంతో బాధపడుతున్న వారిపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. నివాస ప్రాంతాల మధ్య చెత్త డంపింగ్ కొనసాగడం ప్రజల ఆరోగ్య హక్కులకు భంగం కలిగించే అంశమని స్థానికులు పేర్కొంటున్నారు. కాబట్టి స్థానిక వార్డు కౌన్సిలర్, మున్సిపల్ చైర్మన్, మున్సిపల్ కమిషనర్ తక్షణమే స్పందించి రాఘవేంద్ర కాలనీ సమీపంలోని చెత్త డంపింగ్ యార్డ్‌ను తొలగించి, పట్టణానికి కనీసం రెండు నుండి మూడు కిలోమీటర్ల దూరంలో శాస్త్రీయ పద్ధతుల్లో నిర్వహించే ప్రదేశానికి తరలించాలని కాలనీ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రజల ఆరోగ్యం కంటే ముఖ్యమైనది మరొకటి లేదని, సమస్య తీవ్రరూపం దాల్చకముందే అధికారులు చర్యలు తీసుకుని రాఘవేంద్ర కాలనీ వాసులకు ఉపశమనం కల్పించాలని స్థానికులు కోరుతున్నారు. ప్రజారోగ్య పరిరక్షణలో భాగంగా మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి శాశ్వత పరిష్కారం చూపాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



# మిడ్జిల్ తహసీల్దార్ కార్యాలయంలో అవినీతి కలకలం

మిడ్జిల్, జూన్ 19: (విజన్ ఆంధ్ర) : మిడ్జిల్ మండల తహసీల్దార్ కార్యాలయంలో అవినీతి జరుగుతోందంటూ సోషల్ మీడియాలో వైరల్ అయిన వీడియో స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. రైతుల భూముల కొనుగోలు, అమ్మకాల రిజిస్ట్రేషన్ ప్రక్రియలో అక్రమ వసూళ్లు జరుగుతున్నాయని, కార్యాలయంలో ఫైళ్లు కదలాలంటే తప్పనిసరిగా "మామూలు" సమర్పించాల్సి వస్తోందని ఆరోపిస్తూ ఓ వ్యక్తి చేసిన వ్యాఖ్యలు శుక్రవారం సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం పొందాయి. వైరల్ వీడియోలో గతంలో మీసేవ ఆపరేటర్‌గా పనిచేసిన వ్యక్తి తహసీల్దార్ కార్యాలయంలో జరుగుతున్నట్లు చెబుతున్న అవకతవకలపై పలు ఆరోపణలు చేసినట్లు తెలుస్తోంది. భూముల రిజిస్ట్రేషన్లు, ధరణి సంబంధిత సేవలు, రెవెన్యూ పనుల విషయంలో రైతులు, ప్రజల నుంచి అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. దీంతో మండల వ్యాప్తంగా ఈ వ్యవహారం చర్చకు దారితీసింది. అయితే ఈ ఆరోపణలను కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న ప్రశాంత్ ఖండించారు. తనపై కావాలనే కక్ష సాధింపు చర్యల్లో భాగంగా వీడియో చిత్రీకరించి వైరల్ చేశారని ఆయన పేర్కొన్నారు. తాను విధులు నిర్వహిస్తున్న సమయంలో అనుమతి లేకుండా వీడియో తీసి సోషల్ మీడియాలో ప్రచారం చేయడం




వల్ల తన పరువు ప్రతిష్ఠలకు భంగం కలిగిందని తెలిపారు. ఇటీవల వైరల్ వీడియోలో కనిపించిన వ్యక్తి నిర్వహిస్తున్న మీసేవ కేంద్రంపై ప్రజలు తహసీల్దార్‌కు ఫిర్యాదులు చేశారని ప్రశాంత్ ఆరోపించారు. ప్రభుత్వ నిర్దేశిత రుసుముల కంటే అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారని వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో తనపై కక్ష పెంచుకొని తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆయన మీడియాకు వివరించారు. ఇదిలా ఉండగా, వైరల్ వీడియోలో చేసిన ఆరోపణలపై పూర్తి స్థాయి విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని పలువురు రైతులు, ప్రజా సంఘాల ప్రతినిధులు కోరుతున్నారు. రెవెన్యూ కార్యాలయాల్లో పారదర్శకత పెంచి ప్రజలకు ఇబ్బందులు లేకుండా సేవలు అందించాలని వారు అభిప్రాయపడుతున్నారు. వైరల్ వీడియోలోని ఆరోపణలపై ఉన్నతాధికారులు స్పందించి విచారణ చేపడతారా లేదా అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. అధికారులు సమగ్ర దర్యాప్తు నిర్వహించి నిజానిజాలు తేల్చాలని ప్రజలు కోరుతున్నారు.

# ఘనంగా ప్రపంచ సికిల్ సెల్ అవగాహనా దినోత్సవం

## జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డా. జె. సంధ్యా కిరణ్మయి

గద్వాల జూన్ 19 (విజన్ ఆంధ్ర బ్యూరో) : శుక్రవారం




ప్రపంచ సికిల్ సెల్ అవగాహనా దినోత్సవాన్ని పురస్కరించుకొని జోగులాంబ గద్వాల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. బస్తీ దవాఖాన, అర్బన్ హెల్త్ సెంటర్, రాంనగర్ నందు ప్రత్యేక అవగాహన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డా. జె. సంధ్యా కిరణ్మయి ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఓ. మాట్లాడుతూ, సికిల్ సెల్ వ్యాధి వంశపారంపర్యంగా సంక్రమించే రక్తహీనత వ్యాధి. ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో దీని ప్రభావం ఎక్కువగా ఉంది. వివాహానికి ముందే యువతీ యువకులు తప్పనిసరిగా సికిల్ సెల్ స్క్రీనింగ్ పరీక్ష చేయించుకోవాలి. జిల్లాలో అన్ని పిఎచ్ సి,యుపిఎచ్ సి, బస్తీ దవాఖానల్లో ఈ పరీక్ష ఉచితంగా అందుబాటులో ఉంది. వ్యాధి ఉన్నవారు నిరాశ చెందకుండా ప్రభుత్వం అందిస్తున్న ఉచిత మందులు, రక్త మార్పిడి సేవలు వినియోగించుకోవాలి అని పిలుపునిచ్చారు. జిల్లా సికిల్ సెల్, ఎంహెచ్ఎన్ ప్రోగ్రాం అధికారి డా. ప్రసూనారాణి మాట్లాడుతూ, సికిల్ సెల్ ఉన్నట్లయితే హైడ్రాక్సీయూరియా మందులు, ఫోలిక్ యాసిడ్ ఉచితంగా అందిస్తామని. ప్రతి నెలా ఫాలోఅప్ చేస్తున్నాము అని వివరించారు. ఈ కార్యక్రమంలో యుపిఎచ్ సి.వైద్యాధికారి డా.శరణ్య, జిల్లా డెమో ఆఫీసర్ హిరియానాయక్, సూపర్‌వైజర్లు, హనుమంతు, నరసయ్య, ఏఎన్ఎం లు, ఆశా కార్యకర్తలు, రాంనగర్ వార్డు ప్రజలు, మున్సిపల్ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

EDITED,PRINTED, PUBLISHED AND OWNED BY J.NARENDER PRINTED AT SREE DATTA SAI GRAPHICS,# H.NO.1-1-651/8. GANDHINAGAR.HYDERABAD-500020.TELANGANA STATE,PUBLISHED AT J.N.PUBLICATIONS,H.NO.2-1-340/A/4,G.H.M.C NO 12, NEAR FEVER HOSPITAL, BESIDE SBI ATM CENTRE, O.U.ROAD, NALLAKUNTTA MAIN ROAD, HYDERABAD-500044, TELANGANA STATE. RNI.NO.70731/1999 EDITOR : J.NARENDER, CELL:9440897445, Mail visionandhra1999@gmail.com.